
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 14, అక్టోబరు 2025



బీఈడీ పరీక్షల్లో అక్రమాలు

- డమ్మీ అభ్యర్థికి రూ.5వేలు
- చూచిరాతకు రూ.1000
- యథేచ్ఛగా వసూలు చేస్తున్న కాలేజీల యాజమాన్యాలు
- జోరుగా కాపీయింగ్
- కన్నెత్తిచూడని అధికారులు

పొదిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అయ్యోర్ల పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థుల బలహీనతను బట్టి కళాశాల యాజమాన్యాలు ముక్కుపిండి మరీ దండుకుంటున్నాయి. జాతికి మార్గదర్శకంగా నిలవాల్సిన ఉపాధ్యాయ పరీక్షలలో కాబోయే టీచర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. కళాశాల నిర్వాహకులకు విద్యాశాఖ అధికారులు వంతపాడుతున్నారు. పొదిలిలో సోమవారం నుంచి ప్రారంభమైన బీఈడీ పరీక్షలు అవకతవకలకు కేరాఫ్‌గా మారాయి. పట్టణంలోని మూడు కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ముఖ్యంగా ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన బీఈడీ విద్యార్థులు అధిక శాతం మంది ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. దీంతో వారి నుంచి చూచిరాతకు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చొప్పున

మిగతా 6వ పేజీలో



ఒంగోలులో సోమవారం ఉదయం కురుస్తున్న వర్షం

రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతాలు భారీ వర్షాలతో అతలాకుతలమవుతుండగా జిల్లాలో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన వాతావరణం నెలకొంది. వారం నుంచి ఏరోజుకారోజు సాయంత్రానికి జల్లులు పడుతున్నా అవి కొద్దిప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. ఎక్కువ చోట్ల వర్షాభావం నెలకొంది. జిల్లాలోని మూడొంతుల మండలాల్లో ఈ నెలలో ఇప్పటి వరకు కురవాల్సిన వర్షపాతం కన్నా తక్కువగానే నమోదైంది. ఇంచుమించు సగం మండలాల్లో సాధారణంలో 50శాతం కూడా పడలేదు. ఈ ప్రభావం ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలపై చూపుతోంది. అది రబీ సాగుపైనా పడే అవకాశం కనిపిస్తోంది.



తర్లుపాడు ప్రాంతంలో మిర్చి పైరు పరిస్థితి ఇదీ..

ఇదేం వాన!

కొన్ని మండలాల్లో సగం వర్షం కూడా కురవలేదు

- నాల్గో వంతు ప్రాంతాల్లో పదిశాతం లోపుగానే...
- ఈ నెలలో ఇప్పటివరకు 38.0శాతం లోటు వర్షపాతం
- వ్యవసాయ సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏడాది మొత్తంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యేది అక్టోబరులోనే. ఉమ్మడిగా ఉన్న సమయంలో వార్షిక వర్షపాతం 871.50 మి.మీ కాగా విభజన అనంతరం మిగిలి ఉన్న ప్రస్తుత జిల్లాలో అది 679.8కి పడిపోయింది. అంటే మంచి వర్షాలు కురిసే ప్రాంతాలు అధికం ఇతర జిల్లాల్లో కలిసిపోయాయి. వర్షపాతం తక్కువగా ఉండే పశ్చిమప్రాంతం ప్రస్తుత జిల్లాలో మిగిలిపోయింది. ప్రస్తుత జిల్లాలో వార్షిక సాధారణ వర్షపాతం 679.80 మి.మీ కాగా అందులో అత్యధికంగా 205 మి.మీ అక్టోబరులో కురుస్తుంది. అంటే ఏడాది మొత్తంలో ఇంచుమించు 30శాతం వర్షపాతం ఈనెలలోనే ఉంటుంది. అంతేకాక ఈ సమయానికి ఖరీఫ్‌లో వేసిన పైర్లు పంటకు రావడంతోపాటు రబీ

మిగతా 6వ పేజీలో

దారి తప్పుతున్న యువత

- విద్యాలయాల్లోనే వింత పోకడలు
- గంజాయి, మద్యం ఇతర దురలవాట్లు
- అసాంఘిక శక్తులుగా అవతారం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



7

స్కూళ్లకు కొత్త కళ

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

- అనేక పాఠశాలల్లో తీరిన కొరత
- పూర్వవైభవం దిశగా బడులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు



గొళ్లవిడిపిలో ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

చర్యలు తీసుకున్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా విజయవాడలో నియామకపత్రాలు ఇచ్చారు. అనంతరం వారికి శిక్షణ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు కేటాయించారు. అలా జిల్లావ్యాప్తంగా

మిగతా 6వ పేజీలో

ప్రధాని సభ ఏర్పాట్లలో జిల్లా నేతలు

- మంత్రి జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో పాల్గొన్న ఉగ్ర, అశోక్‌రెడ్డి, దామచర్ల సత్య
- మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు జనసమీకరణ బాధ్యతలు
- డోన్‌కు ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్
- నల్లమల ప్రాంతంలో పోలీసుల జల్లెడ



మంత్రి జనార్దన్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యేలు ముత్తుముల, ఉగ్ర,మారిటైంబోర్డు చైర్మన్ సత్య తదితరులు

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న కర్నూలు జిల్లాలో పర్యటించనుండగా ప్రభుత్వపరంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో మన జిల్లాకు చెందిన పలువురు నేతలు భాగస్వామ్యమవుతున్నారు. మంత్రి రవికుమార్‌కు జనసమీకరణ బాధ్యతలు అప్పగించగా ఆయన సోమవారం అక్కడికి చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌లు సవరించిన నేపథ్యంలో దాని ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 16న కర్నూలులో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సభలో ప్రధాని పాల్గొంటున్నారు. సుమారు మూడు లక్షల మందితో కర్నూలు నగరానికి సమీపంలోని నన్నూరు వద్ద ఈ సభను నిర్వహిస్తున్నారు. అందుకోసం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అధిష్ఠానం ఆదేశాలతో జిల్లాకు చెందిన మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి

మిగతా 6వ పేజీలో

పోలీసు స్టేషన్‌లో హల్‌చల్

- చీమకుర్తిలో డ్రైవర్‌పై దాడి
- మార్కాపురంలో కేసు నమోదుకు పట్టు
- టౌన్ ఎస్సైతో సీఐటీయూ నాయకుల వాగ్వాదం.. ఉద్రిక్తత

మార్కాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలో ఓ లారీ డ్రైవర్‌పై యజమాని దాడి చేసిన విషయంలో మార్కాపురంలో కేసు నమోదు చేయాలని పట్టుబట్టడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటన సోమవారం మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే .. స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన దాసరి నారాయణ చీమకుర్తి సమీపంలో ఒక కంకర మిల్లులో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం కంకర అన్‌లోడ్‌కి వెళ్లి తిరిగి వచ్చిన నారాయణ మద్యం సేవించి ఉన్నట్లు యజమాని అనుమానించి దాడిచేసి కొట్టాడు. దీంతో డ్రైవర్ నారాయణ పొదిలిలో చికిత్స పొందాడు. తనపై దాడి చేసిన యజమానిపై చర్యలు తీసుకోవాలని సోమవారం సీఐటీయూ నాయకులతో కలిసి మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు మీరు చీమకుర్తిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇక్కడే కేసు నమోదు చేసి యజమానిని పిలిపించి డ్రైవర్‌కు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకుడు రూబెన్ ఎస్ఐపై ఒత్తిడి తెచ్చారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తానని.. చీమకుర్తి వెళితే మీకు న్యాయం జరుగుతుందని ఎస్ఐ స్పష్టం చేశారు. దీనికి అంగీకరించని వారు ఎస్ఐతో వాగ్వివాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో రూబెన్‌తోపాటు డ్రైవర్ నారాయణను విధులకు ఆటంకం కల్గించారని స్టేషన్‌లోనే ఉంచారు. విషయం తెలుసుకున్న సుందరయ్య కాలనీ వాసులు 50మంది స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. తమ వారిని బయటకు పంపాలని కాలనీవాసులు నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు వారికి, పోలీసులకు మధ్య వాగ్వాదం నెలకొంది. చివరికి ఇరువురిని బయటకు పంపడంతో పరిస్థితి సద్దుమణిగింది.



టౌన్ ఎస్ఐ చాంబర్ వద్ద జరుగుతున్న తోపులాట

రక్తమోడిన రోడ్లు

- వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- వల్లూరు వద్ద మినీ బస్సు బోల్తాపడి ఒకరి మృతి
- 19 మందికి గాయాలు
- సీఎస్‌పురం మండలంలో మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టిన బైకిస్టు.. ఇద్దరూ మృతి
- కొనకనమిట్ల మండలం ఎదురాళ్లపాడు వద్ద మరో ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

వివరాలు లోపలి పేజీల్లో..



సీఎస్‌పురం మండల ఉప్పలపాడు వద్ద బైకిస్టు రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న కానిస్టేబుల్



7

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు

ఒంగోలు, పొదిలి, కనిగిరి డిపోల నుంచి ప్రతి ఆదివారం ఏర్పాటు

చిట్‌ఫండ్ సిబ్బంది వేధింపులకు ప్రభుత్వ ఉద్యోగి బలి

- పురుగుమందు తాగి ఆత్మహత్య
- ఒంగోలులో ఘటన

7


ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

రైతులకు ఈ-పంట... కూలీలకు ఈకేవైసీ

- నమోదులో నిమగ్నమైన అధికారులు
- పంట నమోదులో పుల్లలచెరువు చివరిస్థానం
- ఈనెల 25వరకు గడువు పొడిగింపు
- ఈకేవైసీలో అట్టడుగున దొనకొండ

త్రిపురాంతకం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా రైతులకు ఈ-పంట, ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ప్రజల జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రెండింటినీ చేపట్టింది. ఇవి అన్నదాతలకు అనేక ప్రయోజనాలను చేకూర్చడంతోపాటు గ్రామీణ కూలీల ఆర్థిక స్వావలంబనకు అలంబనగా నిలవనున్నాయి. ఈ-పంట నమోదు వలన పంటల బీమా, ఇతర ప్రభుత్వ సబ్సిడీలు, మద్దతు ధర వంటివి రైతులకు లభిస్తాయి. జాబ్‌కార్డులు కలిగిన వారికి ఈకేవైసీ వలన ఉపాధి హామీలో పారదర్శకత పెరగనుంది. జిల్లావ్యాప్తంగా పంట నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో ప్రభుత్వం ఈనెల 25 వరకు గడువు పొడిగించింది. దీంతో అధికారులు కూడా నూరుశాతం నమోదుకు కృషి చేస్తున్నారు. మరోవైపు ఈకేవైసీ ద్వారా ఉపాధి హామీ పనుల్లో బోగస్ మస్టర్లకు చెక్ పడనుంది. కూలీల వేతనాలు సకాలంలో బ్యాంకుల ద్వారా

మిగతా 6వ పేజీలో



ఈ-పంట నమోదు చేస్తున్న త్రిపురాంతకం వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి

జిల్లాలో ఇప్పటి వరకూ నమోదు చేసిన వివరాలు ఇలా..

జిల్లాలో ఈ-పంట నమోదులో 39.56 శాతంతో పుల్లలచెరువు మండలం చిట్టచివరి స్థానంలో ఉంది. అత్యధికంగా 86.94 శాతంతో మద్దిపాడు ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. 83.73 శాతంతో ఎర్రగొండపాలెం రెండో స్థానంలో ఉంది. త్రిపురాంతకంలో 72.62, దోర్నాలలో 54.05, పెద్దారవీడులో 48.43 శాతం నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా చూస్తే 59.51 శాతం మాత్రమే పంట నమోదు ప్రక్రియ జరిగింది. ఇక ఉపాధి హామీ పథకం కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ కూడా వేగంగా సాగుతోంది. జిల్లాలో 8,24,127 మంది కూలీలు ఉండగా అందులో సోమవారం నాటికి 3,59,272 మందికి (43.59 శాతం) ఈకేవైసీ పూర్తి చేశారు. ఇందులో అత్యధికంగా 62 శాతంతో అర్ధవీడు మండలం ముందుంది. దొనకొండ 33.44 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎర్రగొండపాలెం మండలంలో 38.61, త్రిపురాంతకంలో 42.51, పుల్లలచెరువులో 45.47, దోర్నాలలో 47.21, పెద్దారవీడులో 55.92 శాతం నమోదు చేశారు.

పశువుల పోరంబోకు భూమి ఆక్రమణ

పరిశీలించిన తహసీల్దార్ పుల్లారావు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పొన్నలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భోగనంపాడు పంచాయతీ పరిధి పర్చూరివారిపాలెం గ్రామ సర్వే నంబర్ 63లో 1.50 ఎకరాల పశువుల పోరంబోకు భూమి ఉంది. దాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి శనివారం జామాయిల్ మొక్కలు నాటారు. దీనిపై కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ వి.పుల్లారావు సోమవారం ఆక్రమిత భూమిని పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో అది పోరంబోకు భూమిగా ఉన్నట్లు నిర్ధారించారు. అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ శివ, వీఆర్వో హరి ఉన్నారు.

రైతులకు ఈ-పంట.. కూలీలకు ఈకేవైసీ

(5వ పేజీ తరువాయి)

అందడంతోపాటుఇతర సదుపాయాలు లభిస్తాయి. ఇందులో నమోదు కాని వారికి పని కల్పించటం కుదరదని చెప్పడంతో ఈ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈ-పంట నమోదులో పుల్లలచెరువు మండలం అట్టడుగున ఉంది. ఉపాధి హామీ కూలీలు ఎక్కువ మంది ఈ ప్రాంతంలోనే ఉన్నందున ఈ రెండు కార్యక్రమాలు 100 శాతం పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు.

దాడిచేసి కొట్టారని వ్యక్తి ఫిర్యాదుపై కేసు

మార్టూరు,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో జానీ బాషా మరో నలుగురు యువకులతో కలిసి తనపై దాడిచేసి కొట్టారని గోరంట్ల నారాయణ అనే వ్యక్తి సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు వలపర్ల పంచాయతీలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన నారాయణ గతంలో వలపర్ల గ్రామానికి చెందిన మౌలాలి అనే వ్యక్తి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. ఇటీవల మౌలాలి చనిపోవడంతో, ఆయనకు మారుడు జానీబాషా లక్షరూపాయలను ఇవ్వాలని నారాయణపై వత్తిడి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం వలపర్ల గ్రామంలో స్నేహితులతో కలిసి నారాయణపై జానీబాషా దాడి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో సోమవారం నాయుడు లక్ష్మీనారాయణ అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అవివాహితుడైన లక్ష్మీనారాయణ రెండురోజుల క్రితం గ్రామంలో ఒక మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భయపడిన యువకుడు ఇంట్లోనే పురుగు మందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆయన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

పోటీలలో విద్యార్థుల ప్రతిభ

మేదరమెట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా డివిజనల్ స్థాయి ఆటల పోటీలలో పమిడిపాడు విద్యార్థులు ప్రతిభ చూపడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీ పోటీలలో పి.చరణ్‌తేజ, ఏ. కార్తీక్‌లు, అండర్-14 విభాగంలో జి.ధనుష్.. బాలికల విభాగంలో వి. అమరేశ్వరి, అండర్-14 విభాగంలో సీహెచ్ మహాలక్ష్మి, యూ.ప్రణతిలు అర్హత సాధించారు. అథ్లెటిక్స్ పోటీలలో కే.యశ్వంత్, వై.గిరిలు ఎంపికైనట్లు హెచ్‌ఎం. బి. అంజయ్య తెలిపారు.

పొంచిపట్టి.. శిథిలావస్థకు చేరి...!

మర్రిపూడిలో రక్షిత నీటి ట్యాంక్ దుస్థితి ఇది

గ్రామస్థుల దాహం కేకలు

పది రోజులుగా నిలిచిన నీటి సరఫరా

పట్టించుకోని అధికారులు

ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



అధ్వానంగా రక్షిత నీటి ట్యాంక్

మర్రిపూడి, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడిలో పది రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామస్థులు దాహార్తిని తీర్చుకునేందుకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న స్టోరేజ్ ట్యాంక్ వద్దకు బిందెలు తీసుకొని పరుగులు పెడుతున్నారు. మరికొంతమంది రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొట్టిరెడ్డిపాలెం బీఎల్ఎస్ఆర్ ట్యాంక్ వద్దకు వెళ్లి బిందెలతో తోడుకొని వస్తున్నారు. రెండు వేల కుటుంబాలకుపైగా ఉన్న గ్రామంలో కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఆయా నీటి వనరులను వాడుకొంటున్నారు. మిగిలిన అందరు శుద్ధ జలాలను కొనుక్కొని తాగాల్సి వస్తోంది. దీనికితోడు ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి శాసన సభ్యులు ప్రస్తుత రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి పూర్తిగా శిథిలావస్థకు చేరిన ట్యాంక్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. అప్పట్లో తాత్కలికంగా ట్యాంక్ మరమ్మతులు చేయడంతో ఇప్పటి వరకు ఇబ్బది లేకుండా ఉంది. అయితే ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన నిచ్చెన ఊడిపోవడంతో ట్యాంక్‌పైకి ఎక్కి శుభ్రం చేసే నాధుడే కరువయ్యారు. ట్యాంక్‌పైకప్పు మూత లేక పోవడంతో పావురాలు, కాకుల కళేబరాలు ట్యాంక్‌లోపల పడి చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అప్పుడప్పుడు పక్షుల ఈకలు కుళాయిల ద్వారా బయటకు వస్తున్నాయి. ట్యాంక్ శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో తరచూ అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ట్యాంక్‌ను శుభ్రం చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు మూడు రోజుల క్రితం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను ముక్తకంఠంతో వేడుకున్నారు. నిచ్చెన ఏర్పాటు చేయనిదే ట్యాంక్ శుభ్రం చేసే వీలు పడదని ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ జైపాల్ తెల్పి చెప్పారు. నిచ్చెన ఏర్పాటు కోసం రూ.3 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామన్నారు. దీంతోపాటు 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మరో రెండు ట్యాంక్‌ల నిర్మాణం కోసం రూ.56 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఏదిఏమైనా గతపదిరోజులుగా తాగు నీరు సరఫరా కాకపోవడంపై గ్రామస్థుల్లో అసంతృప్తి వెల్లుబుకుతోంది.

కొలుకులలకు కొత్త టీచర్లు వచ్చారహో..!

పండుగ వాతావరణంలో

గురువులకు ఘన స్వాగతం



కొలుకులలో నూతనంగా విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిన్నటి వరకు ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధించింది. తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయంటూ ఇటీవల తల్లిదండ్రులు బడి ముందు నిరసనకు దిగారు. ఇది ఎర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామ పాఠశాల పరిస్థితి. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఏటా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెగా డీఎస్సీని ప్రకటించి పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు.

ఎర్రగొండపాలెం మండలంలో 12 మంది ఎస్‌జీటీలు, 40 మంది స్కూల్ అసిస్టెంట్లు మొత్తం 52 మంది సోమవారం విధుల్లో చేరారు. వారిలో కొలుకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 మంది విధుల్లో చేరడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. నూతన ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో పి.ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం అయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలన పాటించి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచుకున్నారు.

చెక్‌పోస్టులలో డిజిటల్ చెల్లింపులేవి..?

● చెల్లింపుదారులతో పాటు

సిబ్బందికి తప్పని తిప్పలు



భవానీసెంటర్‌లో వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు

అద్దంకి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ డిజిటల్ యుగం వైపు పరుగులు తీస్తుంటే వ్యవసాయ మార్కెట్ యార్డులలో నేటికీ నగదు ద్వారా మాత్రమే చెల్లింపులకు అనుమతిస్తున్నారు. సాధారణంగా దూర ప్రయాణం చేసే వాహనచోదకులు, రైతులు నగదు తక్కువ తీసుకొని, ఎక్కువ మొత్తాన్ని డిజిటల్ చెల్లింపులకు వీలుగా ఉంచుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయమార్కెట్ యార్డులు చెక్‌పోస్టులలో మాత్రం డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేదు. అత్యధిక సందర్భాలలో చెల్లింపుదారుల వద్ద నగదు లేక డిజిటల్ చెల్లింపులు మాత్రమే చేస్తామని పట్టుబడుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితులలో విధులలో ఉన్న సిబ్బంది తమ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు డిజిటల్ చెల్లింపులు చేయించుకొని, మరుసటి రోజు బ్యాంక్‌కు వెళ్లి కార్యాలయాలలో జమ చేస్తున్నారు. దీంతో సమయం వృథా కావడంతో పాటు వ్యక్తి గత బ్యాంక్ ఖాతాలలో నగదు లావాదేవీలు పెరిగి పలు సందర్భాలలో అదనపు చెల్లింపులు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇక రెగ్యులర్ సిబ్బంది తమ వ్యక్తిగత ఖాతాలలో డిజిటల్ చెల్లింపులు చేయించుకుంటే ఆదాయపన్ను వివరాలు దాఖలు సమయంలో ఇబ్బందిగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఇక అవుట్ సోర్సింగ్ సిబ్బంది అయితే అంత నగదు లావాదేవిలు జరిగితే ఏ ముప్పు ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇలా నగదు చెల్లింపులు జరిగే సమయంలో విధులలో ఉన్న సిబ్బంది మధ్య మనస్పర్థలు కూడా వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ యార్డులలో డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించాలని రైతులు, రవాణాదారులు, సిబ్బంది కోరుతున్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం

డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేకపోవడంతో పలుమార్లు ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. ఎక్కువ మంది చెల్లింపుదారులు డిజిటల్ చెల్లింపులనే ఇష్టపడుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వస్తే డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పిస్తాం.

సూర్యప్రకాష్‌రెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు.



దుద్దుకూరు వద్ద నిలిచిన రాకపోకలు

పొంగి ప్రవహించిన దుద్దుకూరు వాగు

● నిలిచిన రాకపోకలు

● ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

ఇంకొల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాత మద్రాసురోడ్డులోని దుద్దుకూరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో వాగుపై ఉన్న నేలచప్టా వద్ద సోమవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇంకొల్లు నుంచి ఒంగోలు వైపు వెళ్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చిన్నపాటి వర్షానికి ఇక్కడ వాగు పొంగి ప్రవహించడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు ఎటువంటి ప్రమాదం జరగకుండా సిబ్బందితో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఇదేం వాన!

(5వ పేజీ తరువాయి)

పంటల సాగు ముమ్మరంగా సాగుతుంది. వ్యవసాయ సీజన్లకు సంబంధించి అత్యంత కీలకమైన ఈ నెలలో ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఈనెలలో ఇప్పటివరకు కురవాల్సిన వర్షపాతంలో దాదాపు 38శాతం లోటు కనిపిస్తోంది. అక్టోబరు మొత్తం సాధారణ వర్షపాతం 205 మి.మీలలో ఈ రెండు వారాల్లో 89.70 మి.మీ కురవాల్సి ఉంది. అయితే 55.60 మి.మీ వర్షపాతం మాత్రమే ఇప్పటి వరకు నమోదైంది. జిల్లాలో 39 మండలాలో కేవలం 8 మండలాల్లో మాత్రమే సాధారణం కన్నా అధికంగా కురిసింది. మిగిలిన 31 మండలాల్లో తక్కువగానే ఉంది. వాటిలో 19 మండలాల్లో ఏకంగా 50శాతం నుంచి 94శాతం, మరో 9 మండలాల్లో 20 నుంచి 50శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ ప్రభావం పంటలపై పడనుంది.

రబీపై తీవ్ర ప్రభావం

సాధారణంగా ఈ సమయంలో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పైర్లు అత్యధిక భాగం పూత, పిందె, పొట్టదశల్లో ఉంటాయి. ఇప్పుడు కురిసే వర్షాలు వాటికి ఉపకరించి మంచి పంట దిగుబడి వస్తుంది. అలాగే రబీ ముమ్మరంగా సాగుతుంటుంది. అలా రెండు సీజన్లలో ఈనెలలో వర్షం అత్యంత కీలకం కాగా మూడొంతుల మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, సగం మండలాల్లో మరింత దారుణంగా పరిస్థితి నెలకొనడం వ్యవసాయ సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. సాగర్ కాలువల్లో నీరు జోరుగా వస్తుండటం, ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమప్రాంతంలో మంచి వర్షాలు కురవడం కొంత ఊరట కలిగించినా తాజా పరిస్థితి రైతాంగంలో ఆందోళన కలిగిస్తోంది.



ఒంగోలులో రిమ్స్ వద్ద వాన

ఈనెలలో ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి

ఈ నెలలో సాధారణ వర్షపాతం: 205.0 మి.మీ

ఇప్పటివరకు కురవాల్సింది: 89.70 మి.మీ

ఇప్పటివరకు నమోదైంది: 55.60 మి.మీ

లోటు వర్షపాతం: 38 శాతం

సాధారణం కన్నా అధికం నమోదైన మండలాలు

కొత్తపట్నం 49.2శాతం, వైపాలెం 29.3శాతం, జరుగుమల్లి 23.1, చీమకుర్తి 14.1, ఒంగోలు రూరల్ 14.0, పొన్నలూరు 9.7, మర్రిపూడి 52.శాతం అధికంగా నమోదు.

లోటు వర్షపాతం అధికంగా ఉన్న మండలాలు

మండలం	లోటుశాతం
పీసీపల్లి	96.4
కంభం	93.0
రాచర్ల	87.6
అర్ధవీడు	87.2
కోమరోలు	86.6
బీపేట	85.6
పామూరు	85.4
కేకేమిట్ల	81.0
గిద్దలూరు	79.7
కనిగిరి	75.7
హనుమంతునిపాడు	74.3
వెలిగండ్ల	73.5
తర్లుపాడు	73.2

దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

అవీఇవీ

నక్కబొక్కలపాడులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభించిన ఈఈ



వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఈఈ మస్తాన్‌రావు తదితరులు

బల్లికురవ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడులో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ శాఖ ఈఈ మస్తాన్‌రావు ప్రారంభించారు. గ్రామంలోని 30 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. వారికి అవసరమైన ఏడు త్రిఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సోమవారం వాటిని ఈఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో రైతులకు సత్వరమే కనెక్షన్లు మంజూరవుతున్నాయన్నారు. రైతులు ఎవరైనా విద్యుత్ కనెక్షన్ కావాలంటే వెంటనే దరఖాస్తులు చేసుకుంటే మంజూరు చేయిస్తామన్నారు. మార్టూరు ఏడీఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు, దర్శి రామస్వామి, బుల్లిరామయ్య, మురళి, ముత్తినేని సుబ్బారావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెయ్యి ఇచ్చిన విద్యార్థి యథేచ్ఛగా చూసి రాసుకోవచ్చు. వారికి అవసరమైన స్లిప్పులను అందిస్తారు. ఒకవేళ ఆ విద్యార్థి పరీక్షకు రాలేకపోతే వారి తరఫున నకిలీ వ్యక్తి పరీక్ష రాసేందుకు రూ.5వేలను వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా కళాశాలల్లో సైతం కేవలం ఇతర రాష్ట్రాల విద్యార్థులు ప్రవేశం పొందడమే వారి విధి. ఆ తరువాత క్లాసులకు హాజరుకావాల్సిన పనేలేదు. కేవలం పరీక్షలకు హాజరైతే సరిపోతుందని యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నాయి. తరగతులు నిర్వహించే పని లేకపోవడంతో ఆ కాలేజీలో బోధన సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరం కూడా లేదు. జిల్లా నడికూడలిలో బీఈడీ పరీక్షలు అపహాస్యంగా మారగా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఈ అక్రమాల్లో అధికారుల చేతివాటం కూడా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భావి తరాలను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు ఇలా తప్పుడు మార్గంలో పరీక్షలు రాయడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్కూళ్లకు కొత్తకళ

(5వ పేజీ తరువాయి)

657 మందికి నియామకపత్రాలను అందజేశారు. వారిలో విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎలిమెంటరీ పాఠశాలల్లో 619 మంది, గిరిజన పాఠశాలల్లో 38మంది ఉన్నారు. ఈ కొత్త ఉపాధ్యాయులందరినీ కేటగిరీ-3లో నియమించారు. దీంతో జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. తొలిరోజు కొందరు వారి కుటుంబ సభ్యులతో సహా వెళ్లి పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించినట్లు తెలుస్తోంది. దీంతో పాఠశాలలకు పూర్వవైభవం రానుంది. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలు జరగడంతో అనేక పాఠశాలల్లో కొరత ఏర్పడింది. ప్రజాప్రభుత్వం కొత్త ఉపాధ్యాయుల నియామకంతో ఆ పాఠశాలలు కొత్త వారితో కళకళలాడుతున్నాయి.

ప్రధాని సభ ఏర్పాట్లలో జిల్లా నేతలు

(5వ పేజీ తరువాయి)

సోమవారం అక్కడికి వెళ్లారు. వీరు బహిరంగ సభా వేదిక, సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించడంతోపాటు మంత్రి నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు.వివిధ నియోజకవర్గాల్లో జనసమీకరణకు సంబంధించిన బాధ్యతలను ఉమ్మడి జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలకు అప్పగించారు. డోన్‌నియోజకవర్గానికి దామచర్ల జనార్దన్, మంత్రాలయం బాధ్యతలు నాగేశ్వరరావుకు ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ఇదిలా ఉండగా కర్నూలు సభకు ముందు ప్రధాని శ్రీశైలం వెళ్లి మల్లన్నను దర్శించుకోనున్నారు.ఈనేపథ్యంలో దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

కళాశాల పాత భవనాల తొలగింపు



పాత భవనాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో పాత భవనాలలో ఒకటిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగిస్తున్నారు. పట్టణంలో 1960లో ప్రభుత్వ హైస్కూల్‌లో అదనపు గదులను నిర్మించారు. అనంతరం 1966లో ఎస్ఎస్ఎల్‌సీ ఎగ్జామ్ సెంటర్‌ను ఇదే భవనంలో నిర్వహించారు. ఈ భవనాన్ని 1974 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వినియోగించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త భవనాలు నిర్మించడంతో కొంత కాలం పాటు ఖాళీగా ఉంది. అనంతరం గొట్టిపాటి రవికుమార్ అద్దంకి ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలో అద్దంకికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించడంతో ఖాళీ గా ఉన్న భవనాలను వినియోగించుకున్నారు. దశాబ్ద కాలం క్రితం శింగరకొండ సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు భవనాలు నిర్మించారు. అప్పటి నుండి పాత భవనాలు ఖాళీగా ఉన్నాయి. అదే సమయంలో పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. అదే ప్రాంతం లో అద్దంకి పట్టణ సమగ్ర మంచినీటి పథకం లో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌ను అదే ప్రాంతంలో నిర్మిస్తున్నారు. దీంతో పలువురు ఇటీవల మంత్రి రవికుమార్‌ను కలిసి పాత భవనాలను తొలగించాలని కోరారు. దీంతో రెండు రోజులుగా పాతభవనాల తొలగింపు చేపడుతున్నారు. దీంతో ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు అదనపు ఖాళీ స్థలం ఏర్పడనుంది. అయితే అద్దంకి పట్టణం నడిబొడ్డున ఉండటంతో వాకింగ్ ట్రాక్‌గా అభి వృద్ధి చేస్తే మరింత ఉపయోగకరంగా ఉం టుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● ఐదుగురు జూదరుల అరెస్ట్ ● రూ.23,500 స్వాధీనం

జాండ్రపేట (చీరాల), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై వన్ టౌన్ సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. సోమవారం స్టేషన్ పరిధిలోని జాండ్రపేటలోలో జరిగిన ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద రూ.23,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చినగంజాం మండలంలో కూడా...

చినగంజాం : మండలంలోని కడవకుదురు గ్రామంలోని పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ట్రైనీ ఎస్ఐ సీహెచ్ అనూష తెలిపారు. అలాగే కడవకుదురు గ్రామంలోని మోటుపల్లి రైల్వేగేటు సమీపంలో నిర్మాణంలోని భవనంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1000ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని పర్యాటక కేంద్రాల అభివృద్ధిలో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పాకల బీచ్‌కు ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ప్రకాశం రీజియన్ మేనేజరు జి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రోజున ఒంగోలు నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి గంటకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. పొదిలి డిపో నుంచి ఉదయం 6.15 గంటల నుంచి రెండు ట్రిప్‌లు, మధ్యాహ్నం రెండు ట్రిప్‌లు కనిగిరి డిపో నుంచి కందుకూరు మీదుగా కనిగిరిలో ఉదయం 7.15 గంటలకు 8-15 గంటలకు మధ్యాహ్నం 1 గంటకు, 2 గంటలకు, కందుకూరులో ఉదయం 8.45 గంటలకు, 9.45 గంటలకు మధ్యాహ్నం 2.30కి, 3.30 గంటలకు సాయంత్రం 4.30 గంటలకు, 5.30 గంటలకు బయలుదేరే విధంగా ఈ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

17న యువజన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఔత్సాహిక యువ కళాకారులను ప్రోత్సహించేందుకు ఒంగోలులో ఈనెల 17వ తేదీన ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి యువజన వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో సోమవారం జిల్లాస్థాయి యువజన వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఈ యువజనోత్సవాల్లో ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, ప్రసంగం, పద్యరచన, కథారచన, చిత్రలేఖనం, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే యువజనోత్సవాలకు జిల్లా తరుపున పంపించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని స్వామి వివేకానంద జయంతిని పురష్కరించుకొని వచ్చే ఏడాది జనవరి 12న జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఖర్చులతో పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 15వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, సెట్ప్ సీఈవో శ్రీమన్నారాయణ, డీఈవో కిరణ్‌కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ



సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో జండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఒంగోలులో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి ఒబులేషు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ కే కనకదుర్గభవాని, రాష్ట్ర జీఎస్టీ నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రచార నోడల్ అధికారి ఎం.సత్యప్రకాష్‌లు ప్రారంభించారు. ఈ ర్యాలీ రామనగర్‌లోని డీ మార్టు వద్ద ప్రారంభమై నెల్లూరు బస్టాండు, కలెక్టరేట్ మీదుగా ట్రంకురోడ్డు, పాత మార్కెట్ సెంటర్, బాపూజీ కాంప్లెక్స్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు విద్య, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 22 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తూ ఇంటర్మీడియట్ విద్యా కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇంటర్ జిల్లా విద్యాధికారి కే ఆంజనేయులు తెలిపారు. రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఈనెల 30వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఇచ్చారు. మళ్లీ ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గడువులోపు ఫీజు చెల్లించాలని ఆయన కోరారు.

రేషన్ షాపులో విచారణ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపులో స్మార్ట్ రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసే సమయంలో డీలర్ కార్డుదారుల నుంచి రూ.20 చొప్పున వసూలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ఆదివారం వైరల్ కావడంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పందించారు. వెంటనే ఆ దుకాణంలో విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ విచారణ చేపట్టారు. నల్లబండ బజారులోని 42వ రేషన్‌షాపులో 17, 18 వార్డుల కార్డుదారులు ఉన్నారు. వారి నుంచి రూ.20 చొప్పున డీలర్ వసూలు చేసినట్లు కార్డుదారుల నుంచి తెలుసుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. డీలర్‌పై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

జిల్లాలో బెల్టుషాపులను అరికట్టాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పూర్తిస్థాయిలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికట్టేలా ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం సాయంత్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా జిల్లాలో నాటుసారా తయారీ నిర్మూలనకు చర్యలు, బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు, నూతన ఎక్సైజ్ పాలసీ విధానంపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐడీ లిక్కర్ పీడిత గ్రామాల్లో నాటుసారా నిర్మూలించి ప్రభుత్వ లక్ష్యం చేరుకునేలా పనిచేయాలన్నారు. ఆ వృత్తి నుంచి వారి కుటుంబాలను దూరం చేసి సమాజంలో గౌరవప్రదమైన ఉపాధి మార్గాలను వారికి కల్పించేలా ప్రభుత్వం కల్పించే రాయితీలను, పథకాలు వారికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ విజయ ఉన్నారు.

హృదయ శ్వాసకోస పునర్జీవనంపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : హృదయ శ్వాస కోసం పునర్జీవనంపై జిల్లా అధికారులు, అర్జీదారులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణల ఆధ్వర్యంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హార్ట్‌స్ట్రోక్ వస్తే వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వైద్యాధికారులు డెమో ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాణాలను కాపాడటంలో సకాలంలో కార్డియో పల్మనరీ పునర్జీవనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రజల్లో ఎవ్వరైనా ఆపస్మారక స్థితిలో పడిపోయినప్పుడు అత్యవసర ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. అందులో ముందుగా రోగి చుట్టూపక్కల గుంపులుగా లేకుండా రోగికి గాలి వచ్చేవిధంగా చూడాలన్నారు. వెంటనే 108 వాహనానికి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. డీసీహెచ్‌ఎస్ కార్యాలయ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో సోమవారం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. రెండు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా మరో ఘటనలో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



అవినాష్, గణేష్ మృతదేహాలు

ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు మృతి

కొనకనమిట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎదురాళ్లపాడు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామంలో రెండురోజుల కిందట ఒక వివాహం జరిగింది. ఈక్రమంలో వివాహ బృందం కొనకనమిట్ల మండలం ఎదురాళ్లపాడు గ్రామానికి మర్లుపెళ్లికి ట్రాక్టర్లో వచ్చారు. దేశబోయిన గణేష్, పిట్టమల్ల అవినాష్ ఇద్దరు ద్విచక్రవాహనంపై ఎదురాళ్లపాడు వచ్చారు. తిరిగి ట్రాక్టర్ ఎదురాళ్లపాడు గ్రామం నుంచి చింతగుంట్లకు బయలుదేరింది. కొంతదూరం వెళ్లాక వర్షం పడుతుండడంతో ట్రాక్టర్ నిలిపి పట్టా కట్టుకుంటున్నారు. గమనించని గణేష్, అవినాష్ ట్రాక్టర్‌ను వెనుకవైపు ఢీకొట్టారు. ఈప్రమాదంలో దేశబోయిన గణేష్ (20), పిట్టమల్ల అవినాష్(22) తీవ్రంగా గాయపడ్డారు. వారిని ప్రైవేటు వాహనంలో కొనకనమిట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాలను పోస్టమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

పురుగు మందు తాగి ఉద్యోగి ఆత్మహత్య

ఒంగోలుక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్ సిబ్బంది వేధింపుల కారణంగా పురుగుమందులో ఎలుక మందు పేస్టు కలుపుకొని తాగి ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం ఒంగోలులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు ఇరిగేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోమటిగుంట శ్రీనివాసులు (37) రెండేళ్ల క్రితం కపిల్ చిట్స్‌లో చీటి వేశాడు. ఏడాది పాటు సక్రమంగా చెల్లింపులు చేశాడు. అయితే కొద్దిరోజులుగా సకాలంలో చెల్లింపులు చేయడం లేదు. దీంతో చిట్‌ఫండ్ సిబ్బంది శ్రీనివాసులును వేధించడం ప్రారంభించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసులు నగరంలోని 60 అడుగుల రోడ్డులో గల నారాయణ ప్యాలెస్‌లో గది అద్దెకు తీసుకొని పురుగుమందులో ఎలుకల మందు కలిపి తాగాడు. అనంతరం అతని భార్యకు ఫోన్ చేసి తాను పురుగుమందు తాగానని ఆసుపత్రికి తీసుకెళ్లమని చెప్పాడు. దీంతో అతని భార్య లాడ్జి వద్దకు వచ్చి భర్తను ఆటోలో రిమ్స్‌కు తరలించింది. అక్కడ అవుట్ పోస్టు పోలీసులు శ్రీనివాసులు వద్ద వాగ్మూలం తీసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను నగరంలోని సంతపేటలో నివాసం ఉంటున్నాడు.



మతి స్థిమితం లేని వ్యక్తి మృతదేహం

బైక్ ఢీకొని ఇద్దరు మృతి

సీఎస్‌పురం (పామూరు) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్టు, మతి స్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కృష్ణంరాజుపల్లి గ్రామానికి చెందిన కాటసాని రవి బైక్ మరో వ్యక్తిని వెంట పెట్టుకొని హైదరాబాద్‌కు వెళ్లేందుకు సీఎస్‌పురానికి వస్తుండగా ఉప్పలపాడు జాతీయ రహదారి వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి బైక్‌కు అడ్డుగా రాగా బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రవితో పాటు మతిస్థిమితం లేని వ్యక్తి ఇద్దరు ఘటనా స్థలంలో మృతి చెందారు. బైక్‌పై వెనుక కూర్చున్న తిరుపతిరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్టేషన్‌హెడ్ కానిస్టేబుల్ అచ్చిరెడ్డి ప్రమాద ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కేవలం హెల్మెట్ లేని కారణంగానే బైకిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఆదాయం పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

● కొండపి ఏఎంసీ సమావేశంలో మంత్రి డాక్టర్ స్వామి ● మార్కెటింగ్ ఏడీ, ఇంజనీరింగ్ అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

సింగరాయకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. స్థానిక ఏఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కమిటీ తొలి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ఏఎంసీల ఆదాయంలో కొండపి ప్రథమ స్థానంలో ఉన్నదన్నారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌కు రావాల్సిన వసూళ్లు, ట్రెజరీ బ్యాలెన్స్ గురించి మార్కెటింగ్ అధికారులను మంత్రి స్వామి ప్రశ్నించారు. దీనిపై వారు స్పందిస్తూ.. టార్గెట్ రూ.6.62 కోట్లు ఉండగా ఇప్పటి వరకూ రూ.2కోట్లు వసూలు చేశామని చెప్పారు. ట్రెజరీలో నిల్వ రూ.17 కోట్లు ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకూ సగటున రూ.3కోట్లకుపైన వసూలు చేయాల్సి ఉండగా, రూ.2కోట్లు మాత్రమే రాబట్టడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై సకాలంలో మార్కెట్ ఫీజులు వసూలు చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎరువులు, ధాన్యం నిల్వకు గోదాముల అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండే డొంక రోడ్లను గుర్తించాలన్నారు. సింగరాయకొండలో నూతన రైతు బజారు నిర్మాణానికి స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్ ఎన్‌బీవీ రాజేష్‌ను ఆదేశించారు. జిల్లా మార్కెట్ ఏడీ వరలక్ష్మి, ఇంజనీరింగ్ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కర్ణా తిరుపతమ్మ, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, కమిటీ సభ్యులు, కనుమళ్ల సొసైటీ చైర్మన్ బైరపనేని మోహన్‌రావు, మార్కెట్ కమిటీ సెక్రటరీ జీవీ రవికుమార్, ఏడీఏ నిర్మలాకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డీఈకి ఆదేశం

సింగరాయకొండ మండలంలో అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ డీఈ వీరయ్యను మంత్రి స్వామి ఆదేశించారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని తాతయ్యకాలనీ, మల్లికార్జున్‌నగర్, బాలిరెడ్డినగర్‌లో ప్రమాదహేతువుగా ఉన్న పాత విద్యుత్ లైన్‌ల స్థానంలో త్వరితగతిన కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రంకురోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను కూడా మార్చాలన్నారు.

నకిలీ పట్టాలు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలి

సింగరాయకొండ మండలంలో ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలు సృష్టిస్తున్నారని స్థానికులు మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ నకిలీ పట్టాలు సృష్టించే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజేష్‌కు సూచించారు. కనుమళ్ల పంచాయతీ పరిధిలోని సర్వే నెం.322, 323లో ఆక్రమణల విషయాన్ని మంత్రి స్వామి దృష్టికి కనుమళ్ల పీఏసీఎస్ చైర్మన్ తీసుకెళ్లగా వాటిపై విచారణ చేపట్టాలని ఆయన ఆదేశించారు. అనర్హులు ఉంటే నోటీసులు జారీచేయాలని తహసీల్దార్‌కు సూచించారు.

గనుల ఆదాయంపై ప్రత్యేక దృష్టి


● కలెక్టర్ రాజాబాబు అదేశం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గనులశాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రాబడిపై నిరంతరం పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం సాయంత్రం గనులశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గనుల విస్తీర్ణం, వాటి రకాలు, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, రాయితీలు తదితర అంశాలను ఆ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.432.94 కోట్ల రాబడి లక్ష్యంగా నిర్దేశించగా సెప్టెంబరు నాటికి రూ.157.08 కోట్లు వచ్చిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందులో 144 క్వారీలు పనిచేస్తుండగా 132 క్వారీలు పనిచేయడంలేదని గురులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రాబడి పెరిగేలా చర్యలు తీసుకో వాలన్నారు.

దారి తప్పుతున్న యువత

- విద్యాలయాల్లో వింత పోకడలు
- గంజాయి, మద్యం ఇతర దురలవాట్లకు మొగ్గు
- అసాంఘిక శక్తులుగా అవతారం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



ఒంగోలుక్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేటి బాలలే రేపటి పౌరులు అన్న సూక్తిని కొందరు విద్యార్థులు తుంగలో తొక్కేస్తున్నారు. బంగారు భవితకు బాటలు వేసుకోల్సిన వారు మత్తుకు బానిసలవుతున్నారు. జల్సాలకు అలవాటు పడి దొంగలుగా మారుతున్నారు. గంజాయి మత్తులో ఘర్షణలు పడి సస్పెండ్ అయిన విద్యార్థులు కూడా ఉన్నారు.

జిల్లాలో కొన్ని ఉదాహరణలివీ..

- వెంకముక్కపాలెం వద్ద ఒక కళాశాలకు చెందిన యువతిని బస్సు డ్రైవర్ దుర్భాషలాడాడనే నెపంతో రెండు కళాశాలలకు చెందిన కొందరు విద్యార్థులు డ్రైవర్‌ను కొట్టారు. పోలీసులు ఆ విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యం మత్తులో ఈ దాడి చేసినట్లు గుర్తించారు. ఇటువంటి అనేకం ఇటీవల జరుగుతున్నాయి.
- రెండేళ్ల క్రితం ఒంగోలు మెడికల్ కళాశాలలో విద్యార్థులు గంజాయి తాగి తోటి విద్యార్థులపై దాడులు చేశారు. దీంతో కొంతమంది మెడికోలను కొద్ది రోజులు సస్పెండ్ చేశారు.
- ఒంగోలు ట్రిపుల్‌ఐటీ కాలేజీలో జూనియర్ విద్యార్థిని సీనియర్లు ర్యాగింగ్ చేశారు. విషయం బయిటకు చెబితే నీ ఇష్టం అంటూ బెదిరించారు. విషయం బయటకు రావడంతో అందుకు భాధ్యులైన వారిని సస్పెండ్ చేశారు.
- ఒంగోలులో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రేమ పేరుతో విద్యార్థి అత్మహత్యకు పాల్పడితే రెండు రోజులు పాటు గుర్తించలేదు. అంటే పిల్లల పట్ల కళాశాల యాజమాన్యం శ్రద్ధ ఎలా ఉందో గమనార్హం.
- పొదిలిలో 9వ తరగతి చదువుతున్న బాలుడు గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డాడు.
- ఒంగోలులోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఏడుగురు ముఠాగా ఏర్పడి జల్సాలకు అలవాటుపడి మోటార్ సైకిళ్లు దొంగిలించి అడ్డంకి పోలీసులకు దొరికారు. వారి వద్ద 16 బులెట్లు, ఒక స్కూటీ రికవరీ చేశారు.
- ముగ్గురు విద్యార్థులు పూటుగా మద్యం సేవించి బుల్లెట్‌పై నగరంలో విన్యాసాలు చేసి వెంగముక్కపాలెం రోడ్డు జంక్షన్ వద్ద ఎదురుగా వెళుతున్న మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు.
- ఒంగోలు సమీపంలోని ఓ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి కాలు అడ్డు పెట్టాడని మరో విద్యార్థి తీవ్రంగా కొట్టాడు. అడ్డు వెళ్లి ఇంకో విద్యార్థిని కొట్టాడు. వారు తీవ్రగాయాలపాలయ్యారు.



కొత్తకోట వాగుకు చేరిన వరదనీరు

పొంగిన కొత్తకోట వాగు

నాగులుప్పలపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో మండల పరిధిలో ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి రోడ్లు జలమయం అయ్యాయి. ఎగువ ప్రాంతంలోని వర్షపు నీరు నాగులుప్పలపాడు తిమ్మనపాలెం రహదారిలోని కొత్తకోట వాగుకు చేరాయి. దాంతో సోమవారం ఉదయం నుంచి ఆ దారిలో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఎస్ఐ రజియాసుల్తానా కొత్తకోట వాగును పరిశీలించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి చిన్నపాటి వర్షానికే కొత్తకోట వాగుకు వరదనీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అక్కడ హైలెవల్ వంతెన నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం ఉండటం లేదు.

నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం


మీ కోసంలో అర్జీదారు సమస్యను వింటున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దరఖాస్తులు మళ్లీ రీ ఓపెన్ కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తమ ం అవుతాయన్న నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తున్నారని,ఆ నమ్మకాన్ని ప్రతి ఒక్క అధికారి నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు అర్జీలన్నీ నిర్దేశిత గడువులోగా పరిష్కారం కావాలని, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించడం ద్వారా అర్జీలు పెండింగ్‌లో ఉండవన్నారు. పరిష్కారమైన వినతుల పట్ల అర్జీదారులు తమ సంతోషాన్ని వ్యక్తపర్చాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేశు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు కుమార్, పార్థసారథి, విజయజ్యోతితో పాటు ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

మీకోసంలో 71 వినతులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు క్రైం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 71 మంది తమ సమస్యలను విన్నవించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ మేరకు అర్జీదారులతో అదనపు ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన సమస్యలు పరిష్కరిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ , సీఐలు విజయకృష్ణ, సూర్యనారాయణ, రామారావు, మల్లిఖార్జునరావు, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పై అవగాహన


సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

ఎస్‌ఎన్‌పాడు, ఎన్‌జీపాడుల్లో ర్యాలీలు

సంతనూతలపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఆయా గ్రామాల అధికారులకు జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి హాజరైన మండలపార్టీ అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ తగ్గింపుతో ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువులపై ధరలు తగ్గాయని, ఈవిషయాన్ని అధికారులు గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా చైతన్యపరచాలన్నారు. ఎంపీడీవో డి.సురేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీ తగ్గించినట్లు తెలిపారు. ఈసందర్భంగా సంతనూతలపాడులో బైకుర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, తహసీల్దార్ నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తెలుగుయువత అధ్యక్షుడు ముప్పరాజు శ్రీను, పలువురు అధికారులు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడులో అధికారులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

ఎం.వేములపాడులోనూ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం క్యూర్‌కోడ్ ఆధారిత స్మార్ట్‌రైస్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఈవో కాశమ్మ, వీఆర్వో మౌలాలీ, టీడీపీ నాయకులు మారెళ్ల శ్రీనివాసరావు, యలమంద, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 అందరికీ ప్రయోజనకరం

నాగులుప్పలపాడు : జీఎస్టీ 2.0 ద్వారా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో తేళ్ల రవికుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.సెప్టెంబరు 25 నుంచి జీఎస్టీ 2.0 పై ప్రజలకు విస్తృత ప్రచార, అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నాగులుప్పలపాడులోని మండల పరిషత్‌కార్యాలయాల సముదాయాల వద్దనుంచి బస్టాండ్ సెంటర్ వరకు స్థానిక అధికారులతో కలసి ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అవగాహన బైక్ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్- సూపర్ జీఎస్టీ అని చెప్పారు.తొలుత స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ తలసాల ఏడుకొండలు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి మూర్తి, ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ రమణయ్య,ఉపాధి హామీ ఏపీవో దేవరపల్లి రవిబాబు, హెచ్‌ఎం మందా కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ప్రజలకు మేలు

కొండపి : సూపర్ జీఎస్టీతో అన్ని రకాల నిత్యావసర, ఇతర సరుకుల ధరలు తగ్గి ప్రజలకు మేలు చేకూరిందని ఎంపీడీవో బి.రామాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఎస్‌హెచ్‌జీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ధరాభారం నుంచి ఊరట లభించిదన్నారు. దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బి.గోపీనాథ్, సీసీలు పాల్గొన్నారు.



కొండపిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామాంజనేయులు

పొన్నలూరులో బైక్ ర్యాలీ

పొన్నలూరు : జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సోమవారం పొన్నలూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ ఇది సాగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన తర్వాత ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

-700 మందికి సేవలు, ఉచితంగా మందుల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం కిమ్స్ హాస్పటల్స్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సహకారంతో క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సూర్యకల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా అనేక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా విద్య, వైద్యం అనే అంశాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని తనవంతు సాయంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. గతంలో సర్వేరెడ్డిపాలెంలో నిర్వహించి వైద్య శిబిరం ద్వారా ఎంతో మంది చికిత్స చేయించుకున్నారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో భాగంగా సుమారు 700 మంది డ్రైవర్లు, వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. సుమారు రూ. 30వేల విలువైన మందులను ఉచితంగా ఇచ్చినట్లు తెలిపారు.


ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారులు

ఈ కార్యక్రమంలో కిమ్స్‌కు చెందిన డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ ఎం. వర్షిత, కిమ్స్ మేనేజర్ అమర్‌నాద్, క్యాంపు కో ఆర్డినేటర్ ప్రవీణ్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, డీన్ డాక్టర్ వాసుబాబు, ఎన్‌ఎస్‌ఎస్‌డీన్ డాక్టర్ నవనీతకృష్ణన్ తదితరులు ఉన్నారు.


ఒంగోలు రిమ్స్ ఎదురు రహదారిపై నిలిచిన వర్షపు నీరు


ఒంగోలులో కురుస్తున్న వర్షం


ఒంగోలు నగరంలోని కొత్తపట్నం రోడ్డులో భారీ వర్షానికి రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

భారీ వర్షం

వీధులన్నీ జలమయం

ఒంగోలు నగరంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు 3 గంటల పాటు పడిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. నగరంలోని కొత్తపట్నం బస్టాండ్, మార్కెట్ సెంటర్, ఆర్టీసీ డిపో, కర్నూల్ రోడ్డు, ఓల్డ్ నవభారత్ థియేటర్ రోడ్డుతో సహా పలు లోతట్టు ప్రాంతాలలో వరద నీరు నిలిచిపోయింది. వర్షపు నీటికి తోడు డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. దీంతో ఉదయాన్నే బస్సుల కోసం వెళ్లేవారు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. - ఒంగోలు, ఆంధ్రజ్యోతి


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషం అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) పేర్కొంది. కాగా గవాయ్‌పై దాడికి నిరసనగా సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నల్లజెండాలతో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ సుప్రీం కోర్టు సీజేఐపై బూటు విసిరిన అడ్వొకేట్ రాకేష్ కిషోరుపై సుమోటాగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న అమరావతిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే దళితుల ఆత్మ గౌరవ సభకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతర ం కలెక్టర్ పి. రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధి బాబు, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిరాజ్, సీనియర్ నాయకుడు కిషోర్‌తోపాటు, కొండపి, కనిగిరి, గిద్దలూరు, కందుకూరు, పొదిలి ఇన్‌చార్జులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బెస్ట్ టీచర్ అవార్డును అందుకుంటున్న దేవీ వరప్రసాద్

ఏకేయూ హెచ్‌వోడీకి అవార్డు

ఒంగోలు విద్య, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో వ్యాయామ విద్యావిభాగాధిపతి గా పనిచేస్తున్న ఐ. దేవీ వరప్రసాద్‌కు సోలేట్ ఇంటర్నేషనల్ అవార్డులు-25లో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డును ప్రదానం చేశారు. విజయవాడలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ నుంచి దేవీవరప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌ను పలువురు అభినందించారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ రాజాబాబు

విద్యార్థులకు బహుమతులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ పీ రాజాబాబు బహుమతులు అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు ఆయా బహుమతులను అందించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి పీ దినేష్‌కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ పోస్టర్‌ను కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు.


అమ్మవార్లకు పొంగళ్లతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

త్రోవగుంటలో అమ్మవార్లకు పొంగళ్లు

ఒంగోలు(రూరల్)అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):ఒంగోలు నగరం త్రోవగుంట గ్రామంలో సోమవారం గ్రామదేవతలు అయిన పుట్లమ్మ, మారెమ్మ,మరెడమ్మ తల్లులుకు గ్రామ మహిళలు పాల పొంగళ్లు సమర్పించారు. ఈ పొంగళ్ల కార్యక్రమం చివరి రోజు కావటంతో గ్రామంలో మహిళలు మేళతాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. గురువారం నుం చి జరుగుతున్న(ఐదురోజులు) ఈ పొంగళ్ల కార్యక్రమం సోమవారం సాయంత్రంతో ముగిసింది.


ఈకేవైసీ చేస్తున్న ఏపీవో నాగేశ్వరరావు

'ఉపాధి' కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

ఒంగోలు(రూరల్)అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో నాగేశ్వరరావు కోరారు. ఒంగోలు మండల ఉపాధి హామీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కూలీలు ఈకేవైసీ చేయించుకోవటం వలన దొంగ మస్టర్‌ను నివారించవచ్చునని తెలిపారు. ఒకరు బదులు మరోకరు పనిచేసే పరిస్థితిని నివారించవచ్చునని తెలిపారు. అందువలన జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పనులు జరుగు సమయంలో ఉదయం ఒక ఫొటో మరోనాలుగు గంటల తరువాత మరొక ఫొటో తీస్తామన్నారు. నవంబరు నుంచి ఉపాధి పనులు ప్రారంభమవుతాయన్నారు. ఒంగోలు మండలంలోని జాబ్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు


ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

పొన్నలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జెడ్ మేకపాడులో అభివృద్ధి పనులు చేసినందుకు కృతజ్ఞతగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి డాక్టర్ స్వామి చిత్రపటాలకు గ్రామస్థులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో 470 మీటర్ల మేర సీసీ రోడ్డు, కరెంట్ లైన్లు వేసినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటూరి మాధవరావు, ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు మందపెద్ద తిరుపాలు, నీటి సంఘం అధ్యక్షుడు సన్నమూరి నరసింహారావు, నాయకులు ఆదినారాయణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రమ్య హోటల్లో అగ్నిప్రమాదం

ఒంగోలు క్రైం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని రమ్య హోటల్‌లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. సోమవారం ఉదయం స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని రమ్య హోటల్‌లో పొయ్యి దగ్గర ఎగ్జాస్ట్‌కు నిప్పు అంటుకొని ప్రమాదం సంభవించింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ అధికారి శ్రీనివాసులరెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అయితే అక్కడ హోటల్‌లో ఉన్న సామగ్రితోపాటుగా ఎగ్జాస్ట్ మొత్తం కలిసి సుమారు రెండు లక్షలు నష్టం వాటిల్లిందని హోటల్ యజమాని ఆర్.వల్లభరెడ్డి తెలిపినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. హోటల్‌లో అగ్నిప్రమాదం గుర్తించగానే సిబ్బంది అక్కడ ఉన్న ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు.

కల్తీ మద్యంపై వైసీపీ నిరసన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు డిమాండ్ చేశారు. కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన అనంతరం ఎక్సైజ్‌శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగాజరిగిన కార్యక్రమంలో రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కఠారి శంకర్, లంకపోతు అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వై. వెంకటేశ్వరరావు, కేవీ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వ్యక్తిపై దాడి

ఒంగోలు క్రైం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగమూరు రోడ్డులో గల తేజస్విని బార్‌లో ఇరువురు వ్యక్తులు ఫూటుగా మద్యం సేవించి బయట ఉన్న ఓ వ్యక్తి పై దాడి చేశారు. వివరాలలోకి వెళితే నాగులుప్పలపాడు మండలం చదలవాడకు చెందిన గేర చిన్నా ప్రస్తుతం ఒంగోలులోని బాషా బజారులో నివాసం ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం తేజస్విని బార్ బయట చికెన్ పకోడి కొంటున్న చిన్నాను గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించి దాడికి దిగారు. వారి వద్ద ఉన్న మద్యం బాటిల్‌తో తలపై కొట్టగా చిన్నాకు తీవ్ర గాయమైంది. ఈమేరకు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒంగోలులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ రోజు ఉదయం 8గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తన కార్యాలయంలో జన్మదినోత్సవం సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు.

గుంతలతో రహదారి - తాగునీటిలో కలుస్తున్న మురుగు

- బృందావన్‌గార్డెన్స్ కాలనీ వాసుల అవస్థలు

ఒంగోలు(రూరల్),అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావన్ గార్డెన్స్‌లోకి వెళ్లే రోడ్డు వర్షపు నీటితో నిండి గుంతలు పడింది. దీనికితోడు రహదారి బురదమయం కావటంతో కాలనీవాసులు ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కాలనీలోకి వచ్చు నీటిలోకి డ్రైనేజ్ వాటర్ చేరటంతో కాలనీలోని గృహాలకు వచ్చునీరు, నీచు వాసనరావటంతో నీరు తాగలేని పరిస్థితి వచ్చింది. దీనిపై మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డును వెంటనే క్వారీడస్ట్‌తో సరిచేయాలని, కాలనీకి సురక్షితమైన నీరు సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

సంతనూతలపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో స్థానిక అంబేడ్కర్‌భవన్ కమిటీ హాల్‌లో లబ్ధిదారులకు సోమవారం క్యూర్‌కోడ్ ఆధారిత స్మార్ట్‌రైస్ కార్డులను తహసీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ డి.నాగమణిలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, వీఆర్వో వెంకటస్వామి, టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆర్.అంకారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా నాణ్యమైన పురుగుమందులు

నాగులుప్పలపాడు,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు సొసైటీ ద్వారా రైతులకు తక్కువ ధరకు నాణ్యమైన పురుగు మందులు అందించడానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్ అన్నారు.ఉప్పుగుండూరు గ్రామంలోని సహకారసంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన పురుగుమందుల అమ్మకం విభాగాన్ని వ్యవసాయాధికారి పోతినేని వెంకట్రావుతో కలిసి మనోజ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, డైరెక్టర్లు పెంట్యాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, సీఈవో ఎన్ కోటి, డీసీసీ బ్యాంక్ మేనేజరు శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తెలగతోటి జాన్సన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మెట్టు సుబ్బయ్యనాయుడు, ఎం.సత్యనారాయణ, కనగాల రామకృష్ణ, సీపీఎం నాయకులు తూబాటి శ్రీకాంత్, జి. బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా బోరు వేయించిన దాతలు


బోరు వేయిస్తున్న దాతలు

సంతనూతలపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని అంబేడ్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం దాతలు డాక్టర్ కొమ్మి నర్సింగరావు, శాంతిప్రియ దంపతులు స్థానికుల కోరిక మేరకు స్వచ్ఛందంగా బోరు వేయించారు. దాతలు గత కొన్నేళ్లుగా పలుగ్రామాల్లో ఇలా పలుసేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.నాగమణి, నీటిసంఘం అధ్యక్షుడు చెరుకూరి శ్రీను, నాయకులు టి.శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు బాలినేని కల్యాణ్‌రెడ్డి, నాయకులు తెల్లమేకల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బొడ్డు శంకర్, సాధినేని శ్రీరామూర్తి, తదితరులు పాల్గొన్నారు.



17న రంగనాయక స్వామి భూముల కౌలుకు వేలం

రాచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం భూముల కౌలుకు ఈనెల 17వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. పాటదారులకు 2025-26 నుంచి 2029-2030 ఐదు సంవత్సరాల వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. చోళవీడు, అనుములవీడు, రామాపురం, సోమిదేవిపల్లి, రంగాపురం గ్రామాల్లోని దాదాపు 27ఎకరాల మెట్ట భూమికి ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో ఉదయం 11గంటలకు వేలంపాట జరుగుతాయన్నారు.

బాబోయ్ కుక్కలు

- వీధుల్లో స్వైరవిహారం
- కొత్తవారు రావాలంటే జంకుతున్న వైనం
- నియంత్రణలో అధికారులు విఫలం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బెడద తీవ్రమవుతుంది. ఒంటరిగా వీధుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ చిన్న పెద్ద తేడా లేకుండా దాడులకు తెగబడుతున్నాయి. వాహనాల వెంట పడుతుండడంతో రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులను కరుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కాలంలో గిద్దలూరు పట్టణంలో వీధికుక్కల సంఖ్య బాగా పెరిగింది. కుక్కల నియంత్రణపై అధికారులకు ఆదేశాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పురపాలక సంఘ అధికారులు అంతగా దృష్టి సారించడంలేదనేది అందరికీ తెలిసిందే. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. ఈప్రాంతంలో రోజూ ఎక్కడో ఒకచోట కుక్కలదాడిలో ఒకరిద్దరు గాయపడుతూనే ఉన్నారు. ఇటీవల కుక్కలదాడి ఘటనను పరిశీలిస్తే భయానకంగా ఉంటున్నాయి. కాళ్లు, చేతులు రక్తం వచ్చే విధంగా కరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో కుక్కకాటు ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. నియంత్రణ చర్యల పేరిట నిధులు పక్కదారి పడుతున్నాయే తప్ప కుక్కల సంఖ్యను అదుపుచేయలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుక్కల సంతతి ఉత్పత్తి అధికంగా జరిగే జూలై నుంచి డిసెంబరు వరకు జాగ్రత్తగా ఉండాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. గర్భందాల్చిన కుక్కలు ఎక్కువ కోపంతో ఉంటాయని, ఇలాంటి కుక్కలు తమను తరిమే ప్రయత్నం చేసే వారిపై అవి దాడి చేస్తుంటాయి. పెంపుడు కుక్కలు కూడా కొన్ని సందర్భాలలో ఇలాగే ప్రవర్తిస్తాయని పశు వైద్యులు చెప్తున్నారు. తినే సమయంలో కుక్కలను కదిలించ కూడదని, నోటి నుంచి లాలాజలం వస్తుంటే అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. ప్రజలు కుక్కలపై రాళ్లు వేయవద్దని, కర్రలతో కొట్టే ప్రయత్నం చేస్తే భయాందోళనకు గురై కుక్కలు ఎదురుదాడి చేసి గాయపరుస్తాయని చెప్తున్నారు.



వాసవీ నగర్‌లో గుంపులుగా ఉన్న కుక్కలు

కంభంలో పిచ్చికుక్క స్వైర విహారం

10మందికి తీవ్రగాయాలు

కంభం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కంభం, కందులాపురం పంచాయతీల పరిధిలో సోమవారం పిచ్చికుక్క దాడిలో 10మంది తీవ్రంగా గాయపడిన ఘటన జరిగింది. పిచ్చికుక్క వెళ్తున్న పలవురిపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిసింది. ఈ దాడిలో కంభానికి చెందిన పెద్ద శ్రీను, బి వెంకటేశ్వరమ్మ, సత్యమ్మ, కందులాపురానికి చెందిన ఏడుకొండలు, జులేఖాబీ, ఏలియా, మౌనిక, ప్రియాంక, కె శ్రీనివాసులు కాళ్లు, చేతులపై కరిచి గాయపరిచింది. వారంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



కంభం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంది

కాగా పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారికి రేబిస్ వ్యాధి సోకకుండా గాయపడిన ప్రాంతాన్ని శుభ్రం చేసి వ్యాక్సినేషన్ ఇస్తున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ ప్రియదర్శిని తెలిపారు. వైద్యశాలలో కుక్క, పాము కాటులకు వ్యాక్సినేషన్ అందుబాటులో ఉందని తెలిపారు.

వైసీపీ అబద్ధాలను ప్రజలు నమ్మరు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం అంటూ వైసీపీ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరని, నకిలీ మద్యానికి మూల విరాట్ జగన్‌రెడ్డి అండ్ కో అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కల్తీ మద్యం అమ్మి నకిలీ బ్రాండ్‌లతో అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తులు ఇప్పుడు నకిలీ మద్యంపై మాట్లాడడం విడ్డూరమన్నారు. ఇటీవల కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జయచంద్రారెడ్డిని టీడీపీ నుంచి సస్పెండ్‌చేశారని మరి వైసీపీలో కేసులు నమోదై జైలు పాలైన వ్యక్తులను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కల్తీ మద్యం కుంభకోణం వెలికి తీసేందుకు నలుగురు ఐపీఎస్‌లతో సిట్ వేశామని, తప్పు చేసిన వారిపై తప్పక చర్యలు ఉంటాయని ఎరిక్షన్‌బాబు ఆప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి శనగ విత్తనాలు పంపిణీ

రాచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాలలో మంగళవారం నుంచి సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి షేక్ మహబూబ్ బాషా సోమవారం తెలిపారు. బయోమెట్రిక్ విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని అందుకు సంబంధించిన డబ్బులు రైతులు జమ చేయాలన్నారు. ఏజేజీ-11, కాక్-2 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని క్వింటా పూర్తి ధర రూ.7800కాగా, సబ్సిడీ రూ.1950 పోను రూ.5850 చెల్లించాలన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

మీకోసంకు రెండు అర్జీలు

రాచర్ల, అక్టోబరు (13 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు రెండు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. భూముల కొలతల విషయమై వచ్చిన అర్జీలపై తహసీల్దార్ స్పందించి వెంటనే కొలతలు వేయాలని సర్వేయర్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు

గిద్దలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ ప్లాజాలో నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మంది రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరుకాగా వారికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ జె.సుధాకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ ఆదాం, నేత్ర వైద్యనిపుణుడు రమణారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

పత్తి దిగుమతి సుంకాలు 50శాతం పెంచాలి

బేస్తవారపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన పత్తి దిగుమతి సుంకాలను తిరిగి 50శాతానికి పెంచాలని ఏపీ రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. మండలం మోక్షగుండం గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలోని కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయక కార్యదర్శి ఊరుమార్పు జోసఫ్, ఎంపీ కొండయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గిద్దలూరు మండల వీవోఏల నూతన కార్యవర్గాన్ని ఈసందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎన్.నాగలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎం.పార్వతి, ప్రధాన కార్యదర్శిగా జి.మాబున్నీ, సహాయ కార్యదర్శిగా నాగమల్లేశ్వరి, కోశాధికారిగా పి.గంగాదేవి, కమిటీ సభ్యులుగా భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, స్వాతి, భవానిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైసీపీ తెచ్చిన కాలపరిమితి సర్క్యులర్ రద్దు



మాట్లాడుతున్న ఆవులయ్య

గిద్దలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ తెచ్చిన కాలపరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టీ ఆవులయ్య తెలిపారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయం ఆవరణలో గిద్దలూరు మండల వీవోఏల యూనియన్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. వైసీపీ హయాంలో గ్రామ సంఘాల సమైక్య మార్పుతోపాటు వీవోఏలను మూడేళ్లకు ఒకసారి మార్పు చేయాలని ఇచ్చిన సర్క్యులర్‌లను ఈనెల 1 నుంచి వీవోఏలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించి రద్దు చేసిందని తెలిపారు.

కోనపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానం

- నిత్యం ప్రయాణాలతో రద్దీ
- పట్టించుకోని అధికారులు



అక్కపల్లె వద్ద రోడ్డు దుస్థితి

బేస్తవారపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని కోనపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం సాగించాలంటే నరకమేనని అంటున్నారు. అడుగుకో గుంత ఉండడంతో ద్విచక్రవాహనదారులు ఈ గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు మాకు సంబంధం లేదని, అర్‌అండ్‌బీ అధికారులు వాళ్లే చేయాలని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ రోడ్డును మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కోనపల్లె రోడ్డులోని అక్కపల్లె, గలిజేరుగుళ్ల గ్రామ నడిబొడ్డున రహదారిలో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి నీరు నిల్వతో బురద గుంతగా తయారైంది. ద్విచక్రవాహనదారులు పలుమార్లు బురద గుంతలో పడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న గలిజేరుగుళ్ల రోడ్డు



కొత్త ఉపాధ్యాయులతో హెచ్ఎం

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

పెద్ద దోర్నాల,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎంఈవో కార్యాలయంలో దోర్నాల మండలానికి నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు ఎంఈవో మస్తాన్ నాయక్‌ను కలిసి సోమవారం నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలని, సమయాపాలన పాటించాలని, సంబంధిత పాఠశాలల పరిదిలోని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని, విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వర్ధన్, మొద్దు నాగేశ్వర రావు,రామకృష్ణా నాయక్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ముగ్గురు, గణితం ఉపాధ్యాయులుగా వెంకట సుబ్బారెడ్డి, సోషల్‌కు శ్రీకాంత్, ఇంగ్లీష్ టీచర్‌గా పులి రమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. హెచ్ఎం శ్యామ్ ప్రసన్నతాంజలి వారిని విధుల్లోకి తీసుకున్నారు.

టెన్నిస్ క్లబ్ నూతన కార్యవర్గం

గిద్దలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు టెన్నిస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు టెన్నిస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాషా, కోశాధికారిగా కె.రంగయ్య, ఉప కోశాధికారిగా యు.మహేష్‌ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డి తెలిపారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి



జీఎస్టీ పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, అధికారులు

మార్కాపురం రూరల్, అక్టోబరు 13 (అంధజ్యోతి) : తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహ న కల్పించాలని ఎంపీడీవో ఏ బాలచెన్నయ్య కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలులో సోమవారం సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కరపత్రాలను ఎంపీడీవో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జీఎస్టీపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ సెక్రటరీలకు ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఏవో భాగ్యవతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగరాజు, ఈసీ కిషోర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, పీఎ్ ఎలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రతి కుటుంబంలో ఎంతో మేలు జరుగుతందని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్, ఏపీవో బులెన్ రావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై ధర్నా

మార్కాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం తయారు చేస్తున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ నకిలీ మద్యం ఏరులై పారుతోందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు వెన్నా హనుమారెడ్డి, ఉడుముల కోటిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పట్టణ, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు షేక్ సలీం, మురారి వెంకటేశ్వర్లు, సూరెడ్డి రామసుబ్బారెడ్డి, పోరుమామిళ్ల విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలి మద్యం తాగి ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయం నంఉచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

స్మార్ట్ కార్డుతో ఎక్కడైనా రేషన్ పొందవచ్చు



కార్డులను పంపిణీ చేస్తున్న సొసైటీ బ్యాంక్ చైర్మన్ పుల్లారెడ్డి



గుడిపాడు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు శేషాద్రి

రాచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజలు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందవచ్చని రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి అన్నారు. ఎడవల్లి గ్రామంలో సోమవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనుములవీడు గ్రామ టీడీపీ నాయకుడు వేమిరెడ్డి శివరామిరెడ్డి, వీఆర్వోలు ఎస్ రంగయ్య, బీ కిషోర్ కుమార్, సర్పంచులు పల్నాటి లతీఫ్, గోపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి, గ్రామ వీఆర్‌వో నాగేశ్వరరావు లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకులను సక్రమంగా పొందవచ్చని తెలిపారు.



డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీజే నాయకులు

తుమ్మలచెరువుకు ఆర్టీసీ బస్సు నడపాలని విజ్ఞప్తి

మార్కాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు మండలం తుమ్మలచెరువు హైస్కూల్‌కు రావాలంటే నాలుగు గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఆర్టీసీ బస్సు నడపాలని ఎంపీజే నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని బుడ్డపల్లె, జగన్నాధపురం, కేతగుడిపి, సూరేపల్లి గ్రామాల విద్యార్థులు మూడు నుంచి నాలుగు కిలో మీటర్లు రోజూ నడిచి తుమ్మలచెరువు హైస్కూల్‌కు వెళ్లాల్సివస్తోందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక ట్రిప్పు బస్సును విద్యార్థుల కోసం తిప్పాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపీజే నాయకులు షేక్ నాగూర్‌మీరావలి, షేక్ రసూల్, షేక్ అమీర్, సయ్యద్ మస్తాన్‌వలి ఉన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా మురళి

రాచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పీ మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జీ సుధాకర్‌రావు ఈస్ట్ గోదావరి రెడ్డిగూడెంకు బదిలీ అయ్యారు. పాఠశాలలో పనిచేస్తున్న మురళిని పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన మురళిని విద్యాశాఖ అధికారులు షేక్ మైనుద్దీన్ అశ్విని కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తానని అన్నారు.

రేషన్ సమస్య తీర్చాలని తహసీల్దార్‌కు వినతి

పొదిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీకాలనీ, ఇస్లాంపేట, ప్రకాష్‌నగర్‌కు చెందిన రేషన్ లబ్దిదారుల సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇమాంసాహెబ్ అధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ క్రిష్టారెడ్డిని కలిసి ఆయా కాల నీవాసులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ప్రధాన రహదారికి ఒకవైపు నాలుగు రేషన్ దుకాణాలు ఉన్నాయని అక్కడికి వెళ్ళి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని వాటిని లేనిప్రాంతాలైన 11, 12 వార్డులకు మార్పు చేస్తే రేషన్ తెచ్చుకునేందకు వీలుగాఉంటుందని తహసీల్దార్‌కు తెలిపారు. కనుక సమస్యను దృష్టిలో ఉంచుకొని పరిష్కరించాలని వారు కోరారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్

రైతులకు ఉపయోగపడే పనులు చేయాలి

పొదిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే పనులు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్ అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.60 లక్షల వ్యయంతో వ్యవసాయ గోడౌన్‌కు ప్రహరీని నిర్మించినట్లు చెప్పారు. అదే వ్యయంతో కార్యాలయం నిర్మించి ఉంటే బాగుండేదని అన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్యాలయం ఏర్పాటు చేసేందుకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఏఎంసీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


రాహుల్‌కు మద్దతుగా సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న రంగస్వామి

రాచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓట్ల దొంగ గద్దె దిగు అనే కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా గిద్దలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి సోమవారం రాచర్ల మండలంలోని చిన్నగానిపల్లి, చోళ్లవీడు గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి, మడల నాయకులు జమాల్, నాగేశ్వరరావు, బుజ్జి వెంకటేశ్వర్లు, చాంద్, డీఎస్ఆర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో బేల్దారి కూలీ మృతి



గురవయ్య మృతదేహం

కంభం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నూతన భవన నిర్మాణ పనులలో భాగంగా రెండవ అంతస్తుపై పని చేస్తున్న బేల్దారి కూలీ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన సోమవారం కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలో జరిగింది. ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. కంభం మండలం చిన్న కంభం పంచాయతీ పరిధిలోని పోరుమామిళ్లపల్లి గ్రామానికి చెందిన పసుపుల గురవయ్య (54) కందులాపురం పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనికి వచ్చి సెంట్రింగ్ పని చేస్తుండగా సమీపంలో ఉన్న హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి రెండవ అంతస్తు పై నుంచి కింద పడడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. గురవయ్యకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముఖాముఖి

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు

ఎల్.లక్ష్మీనారాయణ, తహసీల్దార్, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో ఎంత మంది లబ్ధి దారులకు స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేశారు?

జవాబు: మండలంలో 21 గ్రామ పంచాయతీల పరిధిలో 16,970 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేశాం. ఇప్పటికే 25.40 శాతం మందికి అందజేశాం

ప్ర: చాలామందికి అందలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి?

జ: అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నాం. ఏఒక్కరికీ అన్యాయం జరగదు. ఇంకా వెయ్యి కార్డులు రావాల్సి ఉంది.

ప్ర: రీ సర్వేలో భూయాజమానులకు అన్యాయం చేస్తున్నట్టు పలువురు ఫిర్యాదు చేస్తున్న మాట నిజం కాదా?

జ: ఇప్పటికి మండలంలో 12 గ్రామాల్లో భూములు రీ సర్వే చేశాం. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత రికార్డులు తీ సుకొస్తే పరిష్కరిస్తున్నాం.

ప్ర: నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా ఇవ్వడంలేదనే విమర్శలు వస్తున్నాయి?

జ: అలాంటిదేమి లేదు. ప్రభుత్వం విడుదల చేసే నిత్యావసర సరుకులను ప్రతినెలా ఒకటో తేదీనుంచి 15 వరకు కార్డుదారులకు అందజేయాలి. నిత్యం రేషన్ షాపులను తనిఖీ చేస్తూ అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

గ్రామ సభల ద్వారా పనుల గుర్తింపు

పామూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంద్వారా 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో నూతన పనులను గుర్తించేందుకు గ్రామ సభలు ఉపయోగ పడతాయని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అన్నారు. సోమవారం మండలంలోని బొట్లగూడూరు గ్రామ సచివాలయంలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.బాల, కార్యదర్శి కె.కృష్ణమూర్తి, వీఆర్వో గరీబా, గుర్రం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వంట పాత్రలు చోరీ

ముండ్లమూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి వంట పాత్రలు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. అంగన్‌వాడీ టీచర్ బిజ్జం వెంకటరమణమ్మ విధులకు వెళ్ళగా పాఠశాలలో తాళం పగులగొట్టి ఉంది. లోపలకి వెళ్లిచూడగా వివిధరకాల వంట పాత్రలు చోరీకి గురయ్యాయి.

ప్రశాంతంగా ఉత్సవాన్ని జరుపుకోవాలి

ముండ్లమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామంలో బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవి, కాశీ విశ్వేశ్వర స్వామి నాభిశిల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. పసుపుగల్లులో సోమవారం సాయంత్రం ఆలయ కమిటీ నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థులందరూ కలసిమెలసి ఉత్సవాన్ని జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వీవీ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

ముండ్లమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జె.శ్రీనివాసరావు, మారెళ్ళ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎన్ఎం రాధాకృష్ణలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ సోమవారం జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఎంపీడీవో ఎం.శ్రీదేవి తెలిపారు. వీరిరువురిని నెల్లూరు జిల్లాకు కేటాయించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు

ముండ్లమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని యోహాన్‌ను గత నెల 11వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన సూరబోయిన శేషయ్య దాడి చేశారు. గాయపడిన అతడు దర్శిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. యోహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సూరబోయిన శేషయ్యతోపాటు ఆయన వెంట ఉన్న రావులపల్లి శివ కుమార్, దేవకుమారిని సోమవారం ఎస్ఐ కమలాకర్ అరెస్టు చేసి దర్శి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు.

న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించటంతో ఒంగోలు జిల్లా జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

పెరిగిన వార్డులు.. మారిన పరిధులు

» దర్శి మున్సిపాల్టీ ముఖచిత్రం



దర్శి మున్సిపాలిటీ కార్యాలయం

దర్శి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య పెరిగింది. తాజాగా అధికారులు ప్రతిపాదించిన ప్రకారం వార్డుల పరిధులు మారాయి. గతంలో నగర పంచాయతీగా ఉన్న సమయంలో 20 వార్డులు ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల అప్‌గ్రేడ్ అయి మున్సిపాలిటీ అయిన విషయం విదితమే. ఓట్ల సంఖ్య పెరగటంతో వార్డులను పెంచారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో 29,991 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్కో వార్డుకు 1110 మంది ఓటర్ల చొప్పున 27 వార్డులుగా విభజించారు. తాజాగా 7 వార్డులు పెరిగాయి.

1వ వార్డు తూర్పు వైపున తూర్పువీరాయపాలెం మేజర్ కాలువ నుంచి ఎస్‌వీఆర్ స్కూల్ వరకు, పడమర దర్శి అద్దంకి రోడ్డు తూర్పువీరాయపాలెం మేజర్ నుంచి అయ్యప్ప స్వామి గుడి వరకు, ఉత్తరం పాలడుగు ధనమ్మ ఇంటి వద్ద నుంచి రామాలయం మాన్యం భూమి వరకు, దక్షణం దర్శి అద్దంకి రోడ్డు నుంచి ఎస్‌వీఆర్ స్కూల్ వరకు

2వ వార్డు తూర్పు వైపు రైల్వే ట్రాక్, పడమర వైపు దర్శి-అద్దంకి రోడ్డు నుంచి అయ్యప్పస్వామి గుడి ఆర్‌సీ వరకు, ఉత్తరం అయ్యప్పస్వామి గుడి నుండి దర్శి, అద్దంకి రోడ్డు ఆర్‌సీ వరకు

3వ వార్డు పడమర వినాయకస్వామి గుడి వెనుక రోడ్డు నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డు వరకు, ఉత్తరం ఇంటి నెంబర్ 1-647 నుంచి దేశివాయి సాయిబాబా గుడి వరకు, దక్షణం ప్రభుత్వ జూనియక్ కాలేజీ నుంచి సందువారిపాలెం రోడ్డు వరకు

4వ వార్డు పడమర దర్శి, అద్దంకి రోడ్డు నుంచి గడియారస్తంభం వరకు ఉత్తరం జోమ్ కాలువ, దక్షణం దర్శి, తూర్పుచౌటపాలెం రోడ్డు

5వ వార్డు తూర్పు రైల్వే ట్రాక్, పడమర ఇంటి నెంబర్ 2-161/2 నుంచి తూర్పుచౌటపాలెం రోడ్డు వరకు, ఉత్తరం ఇంటి నెంబర్ 2-161/4 నుంచి చౌటపాలెంరోడ్డు మీదుగా రైల్వే ట్రాక్ వరకు, దక్షణం చిన్నకాలువ మీదుగా రైల్వే ట్రాక్ వరకు

6వ వార్డు తూర్పు వైపు దర్శి, చౌటపాలెంరోడ్డు నుంచి చిన్నకాలువ వరకు, పడమర చౌటపాలెంరోడ్డు నుంచి డొరబీడు మీదుగా చిన్నకాలువ వరకు, ఉత్తరం ఇంటినెంబర్ 3-280 నుంచి 4-283/15 ఇంటి వరకు, దక్షణం చిన్నకాలువ రోడ్డు

7వ వార్డు తూర్పు రైల్వే ట్రాక్ పడమర గడియారస్తంభం నుంచి దద్దాలమ్మ గుడి వరకు, ఉత్తరం దర్శి, సామంతపూడి రోడ్డు నుంచి చిన్నకాలువ రోడ్డు మీదుగా రైల్వే ట్రాక్ వరకు, దక్షణం దద్దాలమ్మ గుడి నుంచి ఎస్ఎస్ అపార్ట్‌మెంట్ మీదుగా దర్శి మున్సిపాలిటీ హద్దు వరకు

8వ వార్డు ఇంటి నెంబరు 4-461/71 నుంచి మున్సిపాలిటీ హద్దు వరకు, పడమర దద్దాలమ్మ గుడి నుంచి ఇంటి నెంబర్ 4-858ఓ6 వరకు, ఉత్తరం దద్దాలమ్మ గుడి నుంచి ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్ పొలాలకు వెళ్లే రోడ్డు వరకు, దక్షణం ఇంటి నెంబర్ 4-858/6 నుంచి రైల్వే ట్రాక్ వరకు

9వ వార్డు తూర్పు 6వ డివిజన్ పడమర హద్దు, పడమర బ్రమరా వెంచర్ నుంచి మున్సిపాలిటీ హద్దు వరకు, ఉత్తరం రైల్వే ట్రాక్ నుంచి మీనాక్షి హస్పెటల్ రోడ్డు మీదుగా ఎన్ఎస్‌పీ కెనాల్ వరకు, దక్షణం మున్సిపాలిటీ హద్దు వరకు

10వవార్డు తూర్పు పొదిలి రోడ్డు ఇంటినెంబర్ 4-1136 నుంచి 4-1350/2 వరకు, పడమర ఇంటినెంబర్ 4-1445 నుంచి బ్రమరా వెంచర్ వరకు, ఉత్తరం పొదిలి రోడ్డు 4-1470/1 నుంచి 4-1145 వరకు, దక్షణం దర్శి, పొదిలి రోడ్డు ఇంటి నెంబర్ 4-1136 నుంచి బ్రమరా వెంచర్ వరకు

11వ వార్డు తూర్పు పొదిలి, దర్శి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గడియార స్తంభం వరకు, పడమర దర్శి, లంకోజనపల్లి రోడ్డు నుంచి గడియారస్తంభం వరకు, ఉత్తరం దర్శి, లంకోజనపల్లి రోడ్డు నుంచి సాయిబాబా గుడి ముందు వరకు, దక్షణం దర్శి, పొదిలి రోడ్డు నుంచి ఇంటినెంబర్ 5-307/4 వరకు

12వ వార్డు తూర్పు మాన్‌సింగ్‌నాయక్ వీధి నుంచి మున్సిపాలిటీ హద్దు వరకు, పడమర దర్శి, లంకోజనపల్లి రోడ్డు నుంచి దర్శి మున్సిపాలిటీ హద్దు వరకు, ఉత్తరం దర్శి, లంకోజనపల్లి రోడ్డు నుంచి 5-184 ఇంటి నెంబర్ వరకు, దక్షణం దర్శి మున్సిపాలిటీ హద్దు వరకు

13వ వార్డు తూర్పు దర్శి, లంకోజనపల్లి రోడ్డు ఇంటినెంబర్ 5-184 నుంచి మున్సిపాలిటీ హద్దు వరకు, పడమర దర్శి, లంకోజనపల్లి రోడ్డు ఇంటినెంబర్ 5-530 నుంచి మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం దర్శి, లంకోజనపల్లి రోడ్డు ఇంటినెంబర్ 5-530 నుంచి 5-563 వరకు, దక్షణం మున్సిపాలిటీ హద్దు

14వ వార్డు పడమర దర్శి-కురిచేడు రోడ్డు నుంచి లంకోజనపల్లి రోడ్డు వరకు, ఉత్తరం దర్శి, కురిచేడు రోడ్డు ఎన్టీఆర్ బస్‌బే నుంచి ఇంటినెంబర్ 5-1012 వరకు, దక్షణం ఇంటి నెంబర్ 5-607 నుంచి లంకోజనపల్లి రోడ్డు వరకు

15వ వార్డు పడమర వైపు పుట్టబజారు ఇంటినెంబర్ 5-1125 నుంచి ఎన్ఎస్‌పీ కెనాల్ వరకు, ఉత్తరం పుట్టబజారు ఇంటినెంబర్ 5-1125 నుంచి ఇంటినెంబర్ 5-1085 వరకు, దక్షణం సర్వే నెంబర్ 812 వరకు

16వ వార్డు పడమర దర్శి, కురిచేడు రోడ్డు నుంచి శివరాజ్‌నగర్ 1వ రోడ్డు మీదుగా దర్శి మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం దర్శి కురిచేడు రోడ్డు, దక్షణం మున్సిపల్ హద్దు వరకు

17వ వార్డు తూర్పు దర్శి- కురిచేడు రోడ్డు నుంచి మున్సిపల్ హద్దు వరకు, పడమర దర్శి-కురిచేడు రోడ్డు నుంచి శివరాజ్ నగర్ 3వ రోడ్డు మీదుగా మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం దర్శి-కురిచేడు రోడ్డు, దక్షణం మున్సిపల్ హద్దు వరకు

18వ వార్డు తూర్పు దర్శి, కురిచేడు రోడ్డు నుంచి శివరాజ్ నగర్ 3వ రోడ్డు మీదుగా మున్సిపల్ రోడ్డు వరకు, పడమర దర్శి, కురిచేడు రోడ్డు నుంచి శివరాజ్‌నగర్ 10 రోడ్డు మీదుగా మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం దర్శి - కురిచేడు రోడ్డు, దక్షణం మున్సిపల్ హద్దు

19వ వార్డు తూర్పు కురిచేడు రోడ్డు నుంచి శివరాజ్‌నగర్ 10 రోడ్డు మీదుగా మున్సిపల్ హద్దు వరకు, పడమర సాయినగర్ కొండ నుంచి మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం కొండ, దక్షణం మున్సిపల్ హద్దు వరకు

20వ వార్డు పడమర ఎంపీపీ స్కూల్ నుంచి ప్రభుత్వ వైద్యశాల రోడ్డు వరకు, పడమర కాకతీయ నగర్ 2వ వీధి నుంచి సాగర్ కాలువ మీదుగా మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం మున్సిపల్ హద్దు, దక్షణం దర్శి- కురిచేడు రోడ్డు

21వ వార్డు తూర్పు దర్శి, అద్దంకి రోడ్డు, పడమర రామ కోటమ్మ ఇంటి నుంచి ప్రభుత్వ హాస్పటల్ వరకు, ఉత్తరం జామియా మసీదు నుంచి వరికూటి కోటేశ్వరరావు ఇంటివరకు, దక్షణం దర్శి- కురిచేడు రోడ్డు

22వ వార్డు తూర్పు పోలీస్‌సర్కిల్ ఆఫీస్ నుంచి బొడ్రాయి వీధి మీదుగా జోమ్‌కాలువ వరకు, పడమర ఎర్రచెరువు నుంచి వీరాయపాలెం మేజర్ వరకు, ఉత్తరం వీరాయపాలెం మేజర్ కాలువ, దక్షణం జామియా మసీదు నుంచి ప్రభుత్వ హాస్పటల్ రోడ్డు వరకు

23వ వార్డు తూర్పు సంగువారివీధి నుంచి పొట్టి శ్రీరాములు డిగ్రీ కాలేజీ వరకు, పడమర దర్శి-అద్దంకి రోడ్డు నుంచి జెండా చెట్టు ముఖద్వారం మీదుగా మున్సిపల్ హద్ద వరకు, ఉత్తరం జోమ్‌కాలువ, దక్షణం దర్శి -అద్దంకి రోడ్డు నుంచి సంగువారి వీధి వరకు

24వ వార్డు పడమర సంగువారి వీధి నుంచి పొట్టిశ్రీరాములు డిగ్రీ కాలేజీ వరకు, ఉత్తరం వాణి స్కూల్ నుంచి పొట్టి శ్రీరాములు డిగ్రీ కాలేజీ వరకు, దక్షణం దర్శి -అద్దంకి రోడ్డు నుంచి సంగా తిరుపతిరావు వీధి వరకు

25వ వార్డు ఉత్తరం దర్శి-అద్దంకి రోడ్డు నుంచి హిందు శ్మశానం రోడ్డు వరకు, దక్షణం వాణి స్కూల్ రోడ్డు నుంచి పొట్టి శ్రీరాములు డిగ్రీ కాలేజీ వరకు

26వ వార్డు తూర్పు దర్శి-అద్దంకి రోడ్డు జనసేన కార్యాలయం నుంచి మున్సిపల్ హద్దు వరకు, పడమర మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం మున్సిపల్ హద్దు వరకు, దక్షణం దర్శి-అద్దంకి రోడ్డు నుంచి హిందూ శ్మశానం రోడ్డు వరకు

27వ వార్డు తూర్పు మున్సిపల్ హద్దు వరకు, పడమర దర్శి-అద్దంకి రోడ్డు వీరాయపాలెం మేజర్ నుంచి మున్సిపల్ హద్దు వరకు, ఉత్తరం మున్సిపల్ హద్దు వరకు, దక్షణం దర్శి-అద్దంకి రోడ్డు వీరాయపాలెం మేజర్ నుంచి రైల్వే ట్రాక్ వరకు

వార్డుల సంఖ్య పెంచిన అనంతరం నూతన హద్దులను ఏర్పాటుచేస్తూ అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. దీంతో నూతన వార్డులను అధికారులు ఖరారు చేశారు.

నూతన ఉపాధ్యాయులతో..

» మండల పరిషత్ బడుల్లో తీరని కొరత

» దొనకొండ మండలానికి 44 మంది కేటాయింపు

జడ్పీ ఉన్నత పాఠశాలలు కళకళ



దొనకొండలో నూతన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంఈవోలు సాంబశివరావు, అమీర్

దొనకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన 44 మంది ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క టీచర్ పోస్టుకూడా భర్తీచేయలేదు. ప్రజా ప్రభుత్వంలో మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులను నియమించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 57 ప్రాథమిక, ఒకటి ప్రాథమికోన్నత, 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 5177 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 52 మంది సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల్లో 34 మంది స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అనేక ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయుడితో బోధనలు జరుగుతున్నాయి. పలు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతను విద్యార్థులు ఇప్పటివరకు ఎదుర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా వీరి కొరతను ప్రజా ప్రభుత్వం తీర్చింది.

మండలంలోని ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలల్లో తెలుగు 3, హిందీ 2, ఇంగ్లీష్ 6, లెక్కలు 6, ఫిజికల్ సైన్స్ 1, బయాలజికల్ సైన్స్ 4, సోషల్ 6, పీఈటీ 6 మొత్తం 34 మంది నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు విధుల్లో చేరాయి. దీంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెట్ టీచర్ల కొరత తీరి నూతన ఉపాధ్యాయులతో కళకళలాడుతున్నాయి. 57 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో దాదాపు 52 మంది ఉపాధ్యాయుల కొరత ఉంటే కేవలం పది మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది.

ఈసందర్భంగా ఎంఈవో ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ దొనకొండ మండలంలోని ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రజాప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయులు చేరారు. ఇప్పటివరకు విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న సబ్జెక్ట్ టీచర్ల కొరత తీరింది. అందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పామూరుకు 20 మంది..

పామూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా వారికి ఎంఈవో పి. కోటిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు 20 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. అందులో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఏడుగురిని నియమించారు. అలాగే, సీఎస్ పురం మండలంలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పీసీపల్లిలో 14 మంది..

పీసీపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఎంపికైన 14 మంది ఉపాధ్యాయులను మండలానికి కేటాయించారు. సోమవారం వీరు విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్‌లు 11మంది, ఎస్‌జీటీలు ముగ్గురిని మండలానికి నియమించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలు సంజీవి, శ్రీని వాసరావును కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అనంతరం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు.

ముండ్లమూరుకు 20 మంది..

ముండ్లమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన 20 మంది ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో సోమవారం విధుల్లో చేరారు. ఎంఈవో షేక్ కాలేషావలికి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. నూతన ఉపాధ్యాయులకు యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాలు స్వాగతం పలికాయి.

తాళ్లూరులో 13 మంది..

తాళ్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన 13 మంది ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో సోమవారం విధుల్లో చేరారు. స్థానిక విద్యావనరులకేంద్రంలో ఎంఈవో జి.సుబ్బయ్యకు జాయినింగ్ ఆర్డర్‌లు అందజేశారు. వీరి చేరికతో కొంతమేర ఉపాధ్యాయుల కొరత తీరింది.

స్మార్ట్ రేషన్ కార్డులతో అవినీతికి చెక్

» మాజీ ఎంపీపీ దశరథరామయ్య



నర్రమారెళ్లలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పామూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ పంపిణీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని మాజీ ఎంపీపీ జి.దశరథరామయ్య అన్నారు. మండలంలోని నర్రమారెళ్లలో సోమవారం లబ్ధిదారులకు వీటిని అందజేశారు. అలాగే, కంభాలదిన్నె, బొట్లగూడూరు, దూబగుంట, కట్టకిందపల్లి, పామూరు, మోపాడు, గోపాలపురం ,అయ్యవారిపల్లి, తూమాటివారిపల్లి, బోడవాడ తదితర గ్రామాల్లోనూ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు పోకా నాయుడుబాబు, యారవ శ్రీనివా సులు, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, ఎన్. సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు వీఆర్వోలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన 17,731 స్మార్ట్ రేషన్ కార్డులను ఆయ గ్రామాలకు సంబంధించిన వీఆర్వోల ద్వారా రేషన్ డీలర్లకు అందజేస్తున్నట్టు చెప్పారు. రేషన్‌డీలర్లు ఈపాస్ మిషన్‌లో రేషన్‌కార్డు లబ్ధిదారుని పేరును నమోదుచేసి, వేలిముద్ర వేయించిన అనంతరమే స్మార్ట్ కార్డును పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ పంపిణీలో జరుగుతున్న మోసాలను ఈకార్డులతో అరికట్ట వచ్చునని చెప్పారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



ప్రభుత్వ పథకాలను గ్రామస్థులకు వివరిస్తున్న ఎస్టీఆర్, కేఎస్ఎస్ సభ్యులు

కనిగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్) అన్నారు. సోమవారం రాత్రి హనుమంతునిపాడు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో కేఎస్ఎస్ సభ్యులు, గ్రామస్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నరలోనే ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్టు చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానంతో పాటు ప్రజాసంక్షేమం కోసం అదనంగా పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నట్టు చెప్పారు. ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం రూ.15వేలు అందజేసినట్టు చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సీఎం అడుగు జాడల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రాష్ట్రంలో ఎక్కడా జరగని అభివృద్ధిలో కనిగిరిలో చేసి చూపించారన్నారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామంలో 60 ఓటర్లుకు ఒక కేఎస్ఎస్ సభ్యుడిని నియమించి వారిద్వారా సంక్షేమ పథకాల అమలుతీరును పర్యవేక్షించే బాధ్యతను కల్పించారన్నారు. ఇటీవల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్టు చెప్పారు. ఇంకా ఎవరైనా అందని వారు తగిన ఆధారాలతో వస్తే వారికి రేషన్ కార్డులు మంజూరులో సహకారాన్ని అందిస్తామన్నారు.

కార్యక్రమంలో మండల క్లస్టర్ కన్వీనర్ గాయం తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి మురహరి నరసయ్య, రమణారెడ్డి, వెంకట్, లింగంగుంట్ల గ్రామ అధ్యక్షుడు కోటిరెడ్డి, రాజేంద్ర, బాలగురవయ్య, కృపయ్య, రమేష్, పెద్దమస్తాన్, బాలచెన్నయ్య, పెద్దిరమేష్, తిరుపతయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, గాయం సుబ్బారెడ్డి, సఫీర్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చందలూరు హైస్కూల్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

దర్శి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ అఫ్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ 19 త్రోబాల్ పోటీల్లో ఈ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కె.చిన్నబాబు, ఎం.యశ్వంత్, ఆర్.ప్రేమ్, ఎన్.సతీష్‌కుమార్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావటం పట్ల ప్రధానోపాధ్యాయుడు ఎం. గురుప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ బాలనర్సింహం, ఉపాధ్యాయులు అభినందించారు.

దర్శిలో నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

దర్శి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డు, ఆటోనగర్, తూర్పుగంగవరం రోడ్డు, సందువారిపాలెం, చింతలపాలెం ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఏ.సచన్ కుమార్ తెలిపారు 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీవన ఎరువులపై అవగాహన కలిగిఉండాలి

ముండ్లమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ రకాల పంటలు సాగు చేసే రైతులు జీవన ఎరువులపై అవగాహన కలిగి ఉండాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జి.రమేష్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. మరో ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు మాట్లాడుతూ రైతులు ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో ఉపాధి మెరుగు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి

కనిగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి మెరుగు పడుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి అన్నారు. స్థానిక పామూరు రోడ్డులోని డిగ్రీ కళాశాలలో పరిశ్రమల స్థాపన, సౌలభ్యం, ఉపాధి అంశాలపై సోమవారం వ్యాపారస్తులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ విదేశాల ఉద్యోగాల కోసం ఆసక్తి చూపుతున్నారన్నారు. దృఢసంకల్పంతో లక్ష్యసాధన దిశగా అడుగులేస్తే స్వదేశంలోనే ఉన్నత ఉద్యోగాలు పొంది ఉన్నతస్థాయికి చేరుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో గోనుగుంట్ల పవన్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ. 2 లక్షల 44వేలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ2,43,998 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.86,520, లడ్డూ ప్రసాదం అమ్మకంద్వారా రూ.29,660, అన్నదాన పథకానికి విరాళాలద్వారా రూ.76,722, స్వామివారి పంచామృత అభిషేకానికి రూ.33,096 వచ్చినట్లు తెలిపారు. శాశ్వత అన్నదాన పథకానికి కడప జిల్లా పోరుమామిళ్ళ మండలం చిన్నాయపల్లికు చెందిన కొండా సూర్యనారాయణ రూ.50 వేలు అందజేశారు.

తాళ్లూరు స్టేషన్‌ను సందర్శించిన సీఐ

తాళ్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు పోలీస్ స్టేషన్‌ను దర్శి సీఐ రామారావు సోమవారం సాయంత్రం సందర్శించారు. కేసుల పురోగతి, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు, ఏఎస్ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సీఆర్డీఏ కార్యాలయంలో విభాగాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మీ త్యాగం మరువను

- నిలువనీడలేని రోజున కూర్చునేందుకు చోటిచ్చారు
- ఒక్క మాటతో వేల ఎకరాల భూమినిచ్చారు
- రాజధాని నిర్మాణానికి దారి చూపారు
- స్థల బలం, ఆడబిడ్డల పోరాటంతోనే నేటి అమరావతి
- సీడ్, కోర్ క్యాపిటల్‌లతో సింగపూర్ అద్భుతమైన ప్లాన్
- అమరావతి నుంచి నేరుగా ఏడు రాష్ట్రాలకు రోడ్లు
- గ్రీన్ ఎనర్జీతో కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం
- అట్టహాసంగా ప్రారంభమైన ఏపీ సీఆర్డీఏ కార్యాలయం
- రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం

గుంటూరు, తుళ్లూరు అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని రైతులు, ఆడ బిడ్డలను మర్చిపోను. రాష్ట్ర విభజన జరిగి రాజధాని లేక, నిలువనీడ కూడా లేని సమయంలో కూర్చునేందుకు చోటు కల్పించి, భూము లిచ్చిన మిమ్మల్ని మరిచిపోవడమంటే.. మీ త్యాగాలను మర్చిపోవ డమే! ఒక్క పిలుపుతో వేల ఎకరాల భూములిచ్చారు. రాజధాని నిర్మా ణానికి దారిచూపారు. రాజధానిని కాపాడుకోవడానికి ఆడబిడ్డలు ఉద్య మించారు. రాజధానిని నిలుపుకోవడం కోసం మీ ఆరాటం, చేసిన పోరాటం, పడిన అవమానాలు, పడ్డ ఇబ్బందులు ఏవీ నేను మర్చి పోలేను. అందుకే రాజధాని రైతులకు రెట్టింపు గౌరవం కల్పిస్తా. వారికి అండగా నిలుస్తా' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామంలో ఏపీ సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఉద యం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యాలయంలోని సీఆర్డీఏ, సీడీఎంఏ, ఏడీసీఎల్, మినిస్టర్ చాంబర్లను ప్రారంభించారు. ఏడంతస్తులు తిరిగి కార్యాల యంలోని ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధ లోహ విగ్రహాన్ని, రిసెప్షన్, క్యాంటీన్‌లను పరిశీలించారు. ఫస్ట్ ఫ్లోర్లోని కాన్ఫరెన్స్ హాళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని ల్యాండ్ పూలింగ్ కాన్సెప్టను తీసుకువచ్చి ఒక్క పిలుపు ఇస్తే వేల ఎకరాలు ఇచ్చి, రాజధాని నిర్మాణానికి ముందుకు వచ్చిన (మిగతా 6వ పేజీలో)



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, ప్రక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, కలెక్టర్ అన్సారియా, నారాయణ



సీఆర్డీఏ భవన నిర్మాణానికై స్థలం ఇచ్చిన రైతులు ఆలూరి గోపాలరావు, అలపర్తి నారాయణరావుకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు





సీఆర్డీఏ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి వివరిస్తున్న కమిషనర్ కన్నబాబు



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు



రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలతో సీఎం



గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ముగిసిన నలుగురు విద్యార్థుల పోస్ట్‌మార్టం

చీరాల, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): వాడరేవు సముద్రతీరంలో ఆదివారం చోటుచేసుకున్న సంఘట నలో నలుగురు విద్యార్థులకు పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. గల్లంతయిన ఐదుగురిలో హైద రాబాద్‌కు చెందిన ముగ్గురి మృత దేహాలు ఆదివారమే ఒడ్డుకు చేరగా, చీరాలకు చెందిన ఇద్దరి కోసం గా లింపు చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం గౌతమ్ (16) మృత దేహాన్ని గుర్తించారు. ఐదో విద్యార్థి షారోన్ కోసం గాలింపు కొన సాగుతోంది.

ఉక్కిరిబిక్కిరవుతున్న పోలీసులు

గతంలో ఒకే సంఘటనలో నలుగురు విద్యార్థులు తీరంలో గల్లంతయిన ఘటన మరువక మునుపే ఒకేరోజు రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. మరొకరి కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి. పోలీ సులు వీరిని ఏ విధంగా అదుపు చేయాలో అర్థం కాక ఉక్కిరి బిక్కి రవుతున్నారు. అన్ని విధాలుగా ప్రమాదాలపై పర్యాటకులకు అవ గాహన కల్పిస్తున్నా కొందరు పోలీ సుల కళ్లు గప్పి జనసంచారం లేని ప్రదేశాలపై మక్కువ చూపి ప్రమాదాలను కొనితెచ్చుకుంటు న్నారు. మరోవైపు పోలీసుల పర్య వేక్షణ, గజ ఈతగాళ్ల నిర్వహణపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి.



గాలింపు చర్యల్లో పోలీసులు



నరసరావుపేట ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

శనగ.. సాగు ఎలా?

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించింది. దీనికి ప్రయత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, శనగ సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. కొన్ని చోట్ల పత్తి కూడా సాగు చేశారు. అయితే ఈ మధ్య కాలంలో కురిసిన అధిక వర్షాలతో పత్తి పంట దాదాపు ఉరకెత్తింది. దీంతో పత్తి పంటను కూడా తొలగించి శనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే శనగ విత్తన కొరత రైతులను వేధిస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్ సంస్థకు శనగ సాగుకు సంబంధించి ఇండెంట్లు పంపినట్లు సమాచారం. కానీ ఇప్పటి వరకు ప్రభు త్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు.

- రాయితీ విత్తనం కోసం రైతులు ఎదురు చూపు
- ఇండెంట్ ఇచ్చిన వ్యవసాయ శాఖ
- స్పందన కరువు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ఏడాది పండించిన పొగాకుకు ధర లేక రైతులు దారుణంగా నష్టపోయారు. గత ఏడాది పల్నాడు జిల్లాలో 15,840 ఎక రాలు, బాపట్ల జిల్లాలో 65,180 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 11,175 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. దీంతో ధర లేక రై త ు లు అల్లా



డుతున్న తరుణంలో, ప్రభుత్వమే కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇంకా కొంతమంది రైతుల ఇళ్లలోనే పొగాకు నిల్వలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం పొగాకు కొనడమే కాకుండా, పొగాకు సా గును నిషేధించింది. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రత్యామ్నాయంగా శనగ పంట వైపు మొగ్గు చూపారు. శనగ విత్తేందుకు పొలాలను సిద్ధం చేసిన అన్నదాతలు విత్త నం కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా రబీలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లా లో విస్తృతంగా శనగ సాగు చేస్తారు. గత ఏడాది బాపట్ల జిల్లాల్లో శనగ సాధారణ విస్తీర్ణం 74,572 ఎకరాలు. పల్నాడు జిల్లా ల్లో 29,495 గుంటూరు జిల్లాలో 19,925 ఎకరాలలో సాగు చేశారు. పొగాకుపై నిషే ధంతో ప్రత్యామ్నాయంగా శనగ సాగు చే పట్టే అవకాశాలు మెండుగా ఉండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుం దని వ్యవసాయ (మిగతా 6వ పేజీలో)

ప్రజల సంతృప్తి స్థాయి పెంచండి

- ప్రతి రోజూ ప్రజలు నన్ను కలవవచ్చు
- భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి) : పనితీరు మార్చుకోండి...ప్రజల సంతృప్తి స్థాయిని పెంచండని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్‌రూమ్ సిబ్బంది, పీజీఆర్ఎస్ సిబ్బంది పనితీరుపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది చురుకుగా పనిచేయాలని పని తీరులో నాణ్యత ఉండాలని చెప్పారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించాలన్నారు. పరిష్కరించిన తదుపరి ధ్రువీకరణపత్రం తప్పనిసరిగా ప్రతిఒక్కరికి ఇవ్వాలన్నారు. ప్రతిరోజు ఉదయం 11గంటలు నుంచి 12 గంటల వరకు జిల్లా కలెక్టర్‌ను ప్రజలు ఎవరైన సంప్రదించటానికి వీలుఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అర్జీనమోదు కాగానే కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది సంబంధితశాఖల వారితో మాట్లాడాలన్నారు. చుక్కలభూమిని నిషేధిత జాబితా నుంచి తొలిగించటానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, డ్వామా పీడీ విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. సోమవారం వారితో సమావేశం నిర్వహించారు. జాతీయ రహదార్ల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ వేగంగా చేపట్టాలని చెప్పారు. భూసేకరణ పూర్తి కాగానే అభివృద్ధి పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. జాతీయ రహదారి 544జీ నిర్మాణం కొరకు జిల్లాలో 19.8హెక్టార్లు సేకరించగా మరో 4.5హెక్టార్‌లలో భూమి సేకరించాల్సి ఉందన్నారు. 45రోజుల్లో ఈప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూమికి నష్టపరిహారం సంబంధితులకు అందించాలన్నారు. జాతీయ రహదారి 167ఎ నిర్మాణానికి 88.38 హెక్టార్‌లో భూమి సేకరించగా మిగిలిన రెండు హెక్టార్లు త్వరగా సేకరించాలన్నారు. భూమి సేకరించినప్పటికి 158మందికి నగదు చెల్లింపు జరగకపోవటం ఏమిటని ఆరా తీశారు. వినుకొండ నుంచి గుంటూరు రహదారి విస్తరణ పనులకు భూసేకరణ ప్రక్రియ నవంబరులోగా పూర్తి చేయాలన్నారు. రొంపేరు కాల్వ నిర్మాణానికి 117.45 ఎకరాల భూమి సేకరించగా ఇందులో కొందరికి నేటికి నగదు చెల్లించకపోవటంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణానికి తక్షణమే భూమి సేకరించాలని చెప్పారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాలలో 203.48 ఎకరాలలో ప్రభుత్వ భూమి, 1591.17 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉందన్నారు. మంచినీటి ట్యాంక్‌ల శుభ్ర పరిచే ప్రక్రియ యూనిట్ ఏర్పాటు కోసం బాపట్ల మండలం మూలపాలెంలో 2ఎకరాలు, చీరాల దేవాంగపురి పంచాయతీలో 1.47 ఎకరాలు, ఇసుకపల్లిలో 3.54 ఎకరాలు, రేపల్లె బేతపూడిలో 1.35 ఎకరాలు సేకరించాలన్నారు. సాంకేతిక సమస్య రావటంతో ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉందన్నారు. నల్లమడ కాల్వ ఆధునీకరణ పనులకు సంబంధించిన సర్వే 2వారాలలో పూర్తి చేయాలన్నారు. గుంటూరు ఛానల్‌కు 51.34 ఎకరాల భూమి పర్చూరు మండలంలో భూసేకరణ చేయాలన్నారు. బాపట్లలో ఎస్టీ, బీసీ, సామాజిక భవనాల నిర్మాణానికి భూమి సేకరించాలని స్టేడియం నిర్మాణానికి 7.5 ఎకరాలు, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు 5 ఎకరాలు, మార్టూరులో మినీ స్టేడియం ఏర్పాటుకు భూమి సేకరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

కొండమంజులూరు విద్యార్థికి ప్రధానిని కలిసే అవకాశం

బాపట్ల, పంగులూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం కొండమంజు లూరు గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి సి.హెచ్. పవన్ గోపీకృష్ణకు దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశం దక్కింది. సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్ వ్యాసరచన పోటీలో విద్యార్థి పవన్ గోపీకృష్ణ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీ లకు ఎంపిక య్యాడు. దాంతో అతడికి ఈ నెల 16న కర్నూలులో దేశ ప్రధాని నరేంద్రమోదీతో జరిగే ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. విద్యార్థి పవన్ గోపీకృష్ణతో పాటు విద్యార్థికి శిక్షణయిచ్చిన ప్రధానోపాధ్యాయురాలు అనిత, పాఠశాల ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి యస్.పు రుషోత్తం సోమవారం అభినందించారు.



పవన్‌గోపికృష్ణ

ఏఎంసీల మెరుగునకు.. మాస్టర్ ప్లాన్

- మార్కెట్ కమిటీ స్థలాల్లో కోల్డ్‌చైన్, అగ్రి ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు
- సీఎం ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ కసరత్తు

అద్దంకి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు త్వరలో మాస్టర్‌ప్లాన్‌లు రూపుదిద్దుకోనున్నాయి. పేరుకు నియోజకవర్గంలో ఒక ఏఎంసీ ఉన్నప్పటికీ కేవలం ఫంక్షనల్ యార్డుల్లోనే లావాదేవీలు జరుగుతోన్నాయి. మిగతా కమిటీలన్ని పాడుబడినట్లుగా ఉంటున్నాయి. ఆయా కమిటీలు కేవలం చెక్‌పోస్టుల ద్వారా వచ్చే ఆదాయానికే పరిమితం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించడం ద్వారా మార్కెట్ కమిటీల్లో ఖాళీగా ఉన్న భవనాలు, స్థలాలను ప్రాసెసింగ్ అవసరాలకు వినియోగించి తద్వారా వాటి ఆదాయం పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మార్కెటింగ్ అధికారులు జిల్లాలోని ఏఎంసీలకు మాస్టర్‌ప్లాన్‌లను రూపొందించేందుకు కసరత్తు చేస్తోన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వీటిల్లో కొన్ని మాత్రమే ఫంక్షనల్ గా గుర్తింపు పొందాయి. గుంటూరు, దుగ్గిరాల, పొన్నూ రు, తెనాలి, మంగళగిరి వంటి ఏఎంసీలలోనే వ్యవసా య ఉత్పత్తుల లావాదేవీలు జరుగుతుంటాయి. మిగతా ఏఎంసీలలో ఖాళీస్థలాలు బోలెడన్ని ఉన్నాయి. ఫిరంగిపురంలో అయితే ఏకంగా ఈవీఎంల గోడౌన్‌కి అక్కడి ఏఎంసీ భవనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యం లో మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించడం వలన ఎన్ని భవ నాలు ఉన్నాయి, ఖాళీ స్థలాలు ఎంత విస్తీర్ణంలో అందుబాటులో ఉన్నాయి, గోడౌన్ల సంఖ్య వంటి వాటన్నింటిపై స్పష్టత వస్తుంది. దాంతో కోల్డ్‌చైన్ కేంద్రాలను నిర్మించేందుకు అవకాశం ఉంటుంది.



ఫిరంగిపురం ఏఎంసీలో ఖాళీగా ఉన్న భవనాలు

ఈ కోల్డ్‌చైన్ కేంద్రాలలో రైతుల పంట ఉత్పత్తులు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చు. అలానే సరుకుల విక్రయం జరిగిన తర్వాత కోల్డ్‌చైన్ కేంద్రం నుంచి గమ్యస్థానం వరకు నిర్ణీత ఉష్ణోగ్రతలో రవాణ చేయడానికి వాహనాలుంటాయి. అలానే అగ్రి ప్రాసెసింగ్ సెంటర్లు అనేవి మనకు ఎక్కడా లేవు. వీటి ఏర్పాటు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువని జోడించొచ్చు. ఇతర రాష్ట్రాలు, దేశాలు మన వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లి అక్కడ ప్రాసెసింగ్ చేసుకొని అధిక లాభాలు గడిస్తోన్నాయి. ఉదాహరణకు మిర్చిలో తేమ శాతం అధికంగా ఉంటే రైతుకు ధర తగ్గించేస్తారు. అదే యార్డులో డ్రైయింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తే అక్కడే రైతులు మిర్చిని ఆరబెట్టించుకొని విక్రయించుకోవచ్చు. ఇలా అన్ని రకాల పంటలను ప్రాసెసింగ్ చేసి ఎగుమతులు చేస్తే అధిక లాభాలు గడించొచ్చని సీఎం చెప్పారు. దాంతో మాస్టర్‌ప్లాన్‌లను ఏ సంస్థతో తయారు చేయించాలనే దానిపై మార్కెటింగ్ శాఖ అధ్యయనం చేస్తున్నది.

బీఈడీ పరీక్షల్లో అక్రమాలు

డమ్మీ అభ్యర్థికి రూ.5వేలు

చూచిరాతకు రూ.1000

యథేచ్ఛగా వసూలు చేస్తున్న కళాశాల యాజమాన్యాలు

పొదిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అయ్యోర్ల పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థుల బలహీనతను బట్టి కళాశాల యాజమాన్యాలు ముక్కుపిండి మరీ దండుకుంటున్నాయి. జాతికి మార్గదర్శకంగా నిలవాల్సిన ఉపాధ్యాయ పరీక్షలలో కాబోయే విద్యార్థులు అడ్డదారులు తొక్కుతున్నారు. విద్యాశాఖ అధికారులు కళాశాల నిర్వాహకులు వంతపాడుతున్నారు. పొదిలిలో సోమవారం నుంచి ప్రారంభమైన బీఈడీ పరీక్షలు అవకతవకలకు కేరాఫ్‌గా మారాయి. పట్టణంలోని మూడు కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

ముఖ్యంగా ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన బీఈడీ విద్యార్థులు అధిక శాతం మంది ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. దీంతో వారి నుంచి చూసిరాతకు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెయ్యి ఇచ్చిన విద్యార్థి యథేచ్ఛగా చూసి రాసుకోవచ్చు. వారికి అవసరమైన స్లిప్పులను అందిస్తారు. ఒకవేళ ఆ విద్యార్థి పరీక్షకు రాలేకపోతే వారి తరఫున నకిలీ వ్యక్తి పరీక్ష రాసేందుకు రూ.5వేలను వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా కళాశాలల్లో సైతం కేవలం ఇతర రాష్ట్రాల విద్యార్థులు ప్రవేశం పొందడమే వారి విధి. ఆ తరువాత క్లాసులకు హాజరుకావాల్సిన పనేలేదు. కేవలం పరీక్షలకు హాజరైతే సరిపోతుందని యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నాయి. తరగతులు నిర్వహించే పని లేకపోవడంతో ఆ కాలేజీలో బోధన సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరం కూడా లేదు. జిల్లా నడికూడలిలో బీఈడీ పరీక్షలు అపహాస్యంగా మారగా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ అక్రమాల్లో అధికారుల చేతివాటం కూడా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. భావితరాలను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు ఇలా తప్పుడు మార్గంలో పరీక్షలు రాయడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శనగ.. సాగు ఎలా..?

(5వ పేజీ తరువాయి)

శాఖ అంచనా వేసింది. ఇప్పటికే విత్తనాల కోసం ఇండెంట్లు పంపింది. దీనిపై ఏపీ సీడ్స్ నుంచి ఉలుకు పలుకు లేదు. విత్తన సరఫరా జాప్యం జరుగుతోందన్న అభిప్రాయం వ్యవసాయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

మద్దతు ధర రూ.225 పెంపు

కేంద్ర ప్రభుత్వం శనగకు మద్దతు ధరను పెంచించింది. క్వింటాకు రూ 225 పెంచింది. గత రబీలో క్వింటాకు రూ 5,650గా ఉన్న మద్దతు ధరను ప్రస్తుత రబీ సీజన్‌లో 5,875కి పెంచింది. మద్దతు ధర పెరగడం శనగ సాగుకు కలిచివచ్చే అంశంగా ఉంది.

రాయితీ పెంచాలి

వైసీపీ ప్రభుత్వం శనగ విత్తనం రాయితీని 50 నుంచి 25 శాతంకు తగ్గించింది. కూటమి ప్రభుత్వం కూడా గత ఏడాది శనగ విత్తనంకు 25 శాతం రాయితీని కొనసాగించింది. పంట మార్పిడి చేసే నేపథ్యంలో విత్తన రాయితీని పెంచాల్సి బాధ్యత ప్రభుత్వం పై ఉందని రైతులు కోరుతున్నారు. 50 శాతం రాయితీపై ఎకరాకు 40 కేజీల చొప్పున శనగ రాయితీపై విత్తన సరఫరాను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం గత ఏడాది కిలోకు రూ 23.50 25శాతం రాయితీని అందించింది. 50 శాతంకు రాయితీ పెంచితే కిలోకు రూ 47 సబ్సిడీ రైతులకు అందే అవకాశం ఉంటుంది. అంటే ఎకరాకు శనగ విత్తనంకు రూ 1,880 రాయితీ రైతులకు లభించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అద్దంకి టౌన్ హాల్ నిర్మాణానికి పరిపాలన ఆమోదం

అద్దంకి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో అద్దంకిటౌన్ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పరిపాలనా ఆమోదం లభించినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. సుమారు 18 సెంట్ల ఖాళీ స్థలంలో ఆదానీ గ్రూప్ సంస్థల నుంచి రూ. 3.40 కోట్ల సీఎస్ఆర్ నిధులతో టౌన్‌హాల్ నిర్మాణం చేయనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్‌తో పాటు డైనింగ్ హాల్ నిర్మాణం చేయనున్నారు. మొదటి అంతస్థులో 180 మంది కూర్చొనే విధంగా ఫంక్షన్ హాల్ నిర్మించనున్నారు. అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తక్కువ అద్దెలతో పలు రకాల ఫంక్షన్ లకు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

చెక్‌పోస్టులలో డిజిటల్ చెల్లింపులేవి..?

● చెల్లింపుదారులతో పాటు సిబ్బందికి తప్పని తిప్పలు



భవానీసెంటర్‌లో వ్యవసాయమార్కెట్ చెక్‌పోస్టు

అద్దంకి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ డిజిటల్ యుగం వైపు పరుగులు తీస్తుంటే వ్యవసాయ మార్కెట్ యార్డులలో నేటికీ నగదు ద్వారా మాత్రమే చెల్లింపులకు అనుమతిస్తున్నారు. సాధారణంగా దూర ప్రయాణం చేసే వాహనచోదకులు, రైతులు నగదు తక్కువ తీసుకొని, ఎక్కువ మొత్తాన్ని డిజిటల్ చెల్లింపులకు వీలుగా ఉంచుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయమార్కెట్ యార్డులు చెక్‌పోస్టులలో మాత్రం డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేదు. అత్యధిక సందర్భాలలో చెల్లింపుదారుల వద్ద నగదు లేక డిజిటల్ చెల్లింపులు మాత్రమే చేస్తామని పట్టుబడుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితులలో విధులలో ఉన్న సిబ్బంది తమ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు డిజిటల్ చెల్లింపులు చేయించుకొని, మరుసటి రోజు బ్యాంక్‌కు వెళ్లి కార్యాలయాలలో జమ చేస్తున్నారు. దీంతో సమయం వృధా కావడంతో పాటు వ్యక్తి గత బ్యాంక్ ఖాతాలలో నగదు లావాదేవీలు పెరిగి పలు సందర్భాలలో అదనపు చెల్లింపులు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇక రెగ్యులర్ సిబ్బంది తమ వ్యక్తిగత ఖాతాలలో డిజిటల్ చెల్లింపులు చేయించుకుంటే ఆదాయపన్ను వివరాలు దాఖలు సమయంలో ఇబ్బందిగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఇక అవుట్ సోర్సింగ్ సిబ్బంది అయితే అంత నగదు లావాదేవిలు జరిగితే ఏ ముప్పు ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇలా నగదు చెల్లింపులు జరిగే సమయంలో విధులలో ఉన్న సిబ్బంది మధ్య మనస్పర్థలు కూడా వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ యార్డులలో డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించాలని రైతులు, రవాణాదారులు, సిబ్బంది కోరుతున్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం

డిజిటల్ చెల్లింపులకు అవకాశం లేకపోవడంతో పలుమార్లు ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. ఎక్కువ మంది చెల్లింపుదారులు డిజిటల్ చెల్లింపులనే ఇష్టపడుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వస్తే డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పిస్తాం.

సూర్య ప్రకాష్‌రెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు

ప్రధాని సభ ఏర్పాట్లలో జిల్లా నేతలు

మంత్రి బీసీ జనార్దనరెడ్డి పర్యవేక్షణలో పాల్గొన్న ఉగ్ర, అశోక్‌రెడ్డి, దామచర్ల సత్య

నలమల అటవీ ప్రాంతంలో పోలీసులు జల్లెడ



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో జిల్లా నేతలు

ఒంగోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న కర్నూలు జిల్లాలో పర్యటించనుండగా ప్రభుత్వపరంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సంబంధించి జిల్లాకు చెందిన పలువురు నేతలు ఆ ఏర్పాట్లలో పాల్గొంటున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు చేస్తుండగా అధిష్ఠానం ఆదేశాలతో జిల్లాకు చెందిన మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలు సోమవారం ఏర్పాట్లలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌లు సవరించిన నేపథ్యంలో దాని ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 16న కర్నూలులో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సభలో ప్రధాని పాల్గొంటున్నారు. సుమారు మూడు లక్షల మందితో కర్నూలు నగరానికి సమీపంలోని నన్నూరు వద్ద ఈ సభను నిర్వహిస్తున్నారు. అందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లలో సోమవారం జిల్లా నేతలు పాల్గొన్నారు. అక్కడ బహిరంగ సభా వేదిక, సభా ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించడంతో పాటు మంత్రి నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కర్నూలు సభకు ముందుగా ప్రధాని శ్రీశైలం వెళ్లి మల్లన్నను దర్శించుకోనున్నారు. ఈనేపథ్యంలో దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్ళే మార్గంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

పొంగి ప్రవహించిన దుద్దుకూరు వాగు



దుద్దుకూరు వద్ద నిలిచిన రాకపోకలు

● నిలిచిన రాకపోకలు

● ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

ఇంకొల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాత మద్రాసురోడ్డులోని దుద్దుకూరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో వాగుపై ఉన్న నేలచప్టా వద్ద సోమవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇంకొల్లు నుంచి ఒంగోలు వైపు వెళ్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చిన్నపాటి వర్షానికి ఇక్కడ వాగు పొంగి ప్రవహించడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు ఎటువంటి ప్రమాదం జరగకుండా సిబ్బందితో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఈఈఎంటీ-2026 ఆన్‌లైన్ ప్రతిభ పరీక్ష నోటిఫికేషన్

అద్దంకిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ అనుమతితో రాష్ట్రవ్యాప్తంగా ఈఈఎంటీ 2026 పరీక్షను నిర్వహిస్తున్నట్లు 'ఎడ్యుకేషనల్ ఎపిఫని స్వచ్ఛంద సంస్థ' కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, రాష్ట్ర సమన్వయకర్త కేవీ శ్రీనివాసరావులు తెలిపారు. ఆ మేరకు సోమవారం నోటిఫికేషన్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 7వ తరగతి, 10వ తరగతి విద్యార్థులు ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. అక్టోబరు 15వ తేదీలోపు పరీక్షకు నమోదు చేసుకోవాలని, డిసెంబరు 6న ప్రిలిమినరీ పరీక్ష, 7న ఫలితాలు, మెయిన్స్ నమోదు డిసెంబరు 8న, మెయిన్స్ పరీక్ష డిసెంబరు 27న, ఫైనల్ ఫలితాలు జనవరి 2026లో, బహుమతుల ప్రదానోత్సవం 2026 ఫిబ్రవరి 1వ తేదీ ఉంటుందని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష విద్యార్థులు తమ ఇంటి నుంచి పాఠశాల వద్ద నుంచి ఆన్‌లైన్‌లో రాయవచ్చునని వివరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, ప్రోత్సహించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. మొత్తం రూ.9లక్షల విలువైన 162 నగదు బహుమతులను రాష్ట్ర, జిల్లా స్థాయి విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. మొత్తం 4 వేల మంది విద్యార్థులకు పైగా పతకాలు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. వివరాలకు 9951002400, 9666747996 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాసరావు

రైతులకు ఈ-పంట.. కూలీలకు ఈకేవైసీ

నమోదులో నిమగ్నమైన అధికారులు

ఈనెల 25వరకు గడువు పొడిగింపు

పంట నమోదుకు జిల్లాలో పుల్లలచెరువు చివరిస్థానం

అట్టడుగున దొనకొండ



పొలంలో ఈ కేవైసీ చేయిస్తున్న అధికారులు

త్రిపురాంతకం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఈ పంట నమోదు, ఉపాధి కూలీలకు ఈకేవైసీ ఈ రెండు కూడా ప్రజలు ప్రభుత్వ సహాయక పథకాలను సద్వినియోగ పరుచుకోవడానికి, గ్రామీణ ప్రజల ఆర్థిక స్వావలంబనకు ఆధారంగా నిలుస్తాయి. సాంకేతిక సమగ్రతతో వ్యవసాయ రంగంలోనూ, ఉపాధి వేతనాల్లోనూ పారదర్శకతను పెంచి అభివృద్ధికి కొత్త దిశను చూపించబోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతులకు ఈ-పంట నమోదు, ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ నమోదు ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలపై జిల్లా అధికారులు ప్రత్యేక ఆదేశాలను జారీ చేస్తున్నారు. ఇందుకు కారణాలు కూడా ఈ పంట నమోదులో పుల్లలచెరువు మండలం అట్టడుగున ఉండడం, ఉపాధి హామీలో కూలీలు ఎక్కువ మంది ఈ ప్రాంతంలోనే ఉండడం. కాబట్టి ఇక్కడ నమోదు శాతం పెంచాలని ముఖ్యంగా ఈ రెండు కార్యక్రమాలు 100 శాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు.

రైతు, కూలీల జీవనోపాధి లక్ష్యం

ఈ రెండు కార్యక్రమాల ద్వారా ప్రజల జీవనోపాధి బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం. రైతులు తాము పండించిన పంట నమోదు ప్రక్రియ ద్వారా కలిగే లాభాలు గుర్తించాలి. పంట నమోదు చేసుకోవటం ద్వారా పంటల బీమా, ఇతర ప్రభుత్వ సబ్సిడీలు, మద్దతు ధర వంటివి పొందేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా పంటన మోదు ప్రక్రియ మందకొడిగా సాగుతుండగా ప్రస్తుతం మళ్లీ ఈనెల 25 వరకు ప్రభుత్వం గడువు పొడిగించటం ద్వారా రైతులకు వెసలుబాటు దొరికింది. దీంతో అధికారులు కూడా నూరుశాతం నమోదుకు కృషి చేస్తున్నారు. మరోవైపు ఉపాధిహామీ పథకంలో పారదర్శకత కోసం తెచ్చిన కేవైసీ ద్వారా బోగస్ మస్టర్లకు చెక్ పెడుతూ, ఉపాధి వేతనాలు సకాలంలో బ్యాంకుల ద్వారా పొందేందుకు, ఇతర సదుపాయాలకోసం కూలీలకు ఇది తప్పనిసరి చేశారు. ఇందులో నమోదు కాని కూలీలకు పని కూడా కల్పించటం కుదరదని చెప్పడంతో ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది.

నమోదు వివరాలు ఇలా

జిల్లాలో పంట నమోదు కార్యక్రమంలో పుల్లలచెరువు మండలం చిట్టచివరి స్థానంలో ఉంది. పుల్లలచెరువు మండలంలో 39.56 శాతం మాత్రమే నమోదు కాగా, అత్యధికంగా 86.94 శాతంతో మద్దిపాడు, తరువాత స్థానంలో 83.73 శాతంతో ఎర్రగొండపాలెం రెండో స్థానంలో ఉంది. త్రిపురాంతకం 72.62, దోర్నాల 54.05, పెద్దారవీడు 48.43 శాతం నమోదు చేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా చూస్తే 59.51 శాతం మాత్రమే పంట నమోదు ప్రక్రియ జరిగింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం లక్ష్యం పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశిస్తున్నారు. ఇక ఉపాధి హామీ పథకం కూలీల కేవైసీ నమోదు ప్రక్రియ కూడా వేగంగా జరుగుతుండగా జిల్లా మొత్తంమీద 8లక్షల 24వేల 127 మంది కూలీలు ఉండగా అందులో సోమవారం నాటికి 3లక్షల 59వేల 272 మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. అంటే 43.59 శాతం పూర్తయినట్లయింది. ఇందులో అత్యధికంగా 62 శాతంతో అర్ధవీడు మండలం ముందుండగా, దొనకొండ మండలంలో 33.44 శాతంతో చివరిస్థానంలో ఉంది. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎర్రగొండపాలెం 38.61, త్రిపురాంతకం 42.51, పుల్లలచెరువు 45.47, దోర్నాల 47.21, పెద్దారవీడు 55.92 శాతం నమోదు చేశారు.

ఆలయ కమిటీ సభ్యునిగా 'ఆలా' ప్రమాణ స్వీకారం

పర్చూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం ఆలయ కమిటీ సభ్యునిగా పర్చూరుకు చెందిన జనసేన పార్టీ నాయకులు ఆలా అనిల్ కుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన పార్టీ తరుపున ఆయనకు ప్రజా కూటమి ప్రభుత్వంలో శ్రీశైలం ఆలయ కమిటీలో పదవి వరించింది. ఈసందర్భంగా పలువురు జనసేన, ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



కమిటీ సభ్యులతో ఆలా అనిల్ కుమార్

అవీఇవీ

అంతర్గత రహదారులకు మహర్దశ

బల్లికురవ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులను మంజూరు చేసింది. ఎంతో కాలం నుంచి అభివృద్ధికి నోచుకోని లింక్ రోడ్లకు సైతం నిధుల మంజూరుతో గ్రామాలకు మహర్దశ పట్టనుంది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో బల్లికురవ మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5.70 కోట్ల నిధులను మంజూరు చేయించారు. త్వరలో ఈ పనులు గ్రామాలలో ప్రారంభంకానున్నాయి. గ్రామీణ రోడ్లకు నిధులు మంజూరు విషయం తెలియగానే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి రవికుమార్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో దశాబ్దాల నుంచి అధ్వానంగా ఉన్న వేమవరం రాజుపాలెం లింకు రోడ్డును మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని వారు అంటున్నారు. మొత్తం 37 పనులకు నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. గ్రామాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువలను అభివృద్ధి పరచనున్నారు.నిధులు మంజూరైనా గ్రామాలు వెలమవారిపాలేనికి రూ.20 లక్షలు, కూకట్లపల్లికి రూ.20 లక్షలు, ఎస్ఎల్ గుడిపాడుకు రూ.20లక్షలు, వైదనకు రూ.20లక్షలు, ముక్తేశ్వరంకు రూ.50 లక్షలు కొమ్మినేనివారిపాలెంకు రూ.20లక్షలు, పెద అంబడిపూడి రూ.30 లక్షలు, వల్లాపల్లి రూ.20 లక్షలు, బల్లికురవ రూ.25లక్షలు, చెన్నుపల్లి రూ.20లక్షలు, కొప్పెరపాలేనికి రూ.20లక్షలు, కె.రాజుపాలెంకు రూ. 10లక్షలు, ఉప్పుమాగులూరుకు రూ.30 లక్షలు, వేమవరానికి రూ.20 లక్షలు, కొత్తూరుకు రూ.1 కోటి, చెన్నుపల్లి వైదన బీటీ రోడ్డుకు రూ.75 లక్షలు, వేమవరం రాజుపాలెం మెటల్ రోడ్డుకు రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల తో మరో పది రోజుల్లో గ్రామాలలో పనులు ప్రారంభం కానున్నాయి.

18నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

చినగంజాం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.నరసింహారావు, రాష్ట్ర నాయకులు కుర్రా రామారావులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు-2025 గోడ పత్రికను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబరు 2న మండల స్థాయిలో, నవంబరు 23న జిల్లా స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో విజయం సాధించిన జట్టుకు డిసెంబరు 12, 13, 14 తేదీలలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, జనవిజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుబ్బారావు, కే శ్రీనివాస్, సైన్స్ ఉపాధ్యాయులు ఉదయభువనేశ్వరిలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి రవికుమార్ ఆదేశాలతో ఏర్పాటు



ఎస్టీ కాలనీలో మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

బల్లికురవ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి చెప్పారు. బల్లికురవలోని రెండు ఎస్టీ కాలనీలలో తాగునీటి సమస్యను ప్రజలు మంత్రి రవికుమార్ దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో మండల పరిషత్ నిధులు రూ.2.50 లక్షలతో రెండు మినీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి రక్షిత స్టోరేజ్ చెరువు ద్వారా వచ్చే నీటిని పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ట్యాంకులను సోమవారం ఎంపీడీవో, కుసుమకుమారి, తహసీల్దార్ రవి నాయక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కాలనీవాసులతో మాట్లాడుతూ తాగునీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ఎస్టీ కాలనీ వాసుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొట్టిపాటి లక్ష్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతురావు, నేతలు మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, దద్దాల అంజయ్య, పావులూరి ఏడుకొండలు, వేల్పూరి దానయ్య, నాగబోయిన శ్రీనివాసరావు, చల్లగుండ్ల నాగేశ్వరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మీ త్యాగం మరువను'!

(5వ పేజీ తరువాయి)

రైతుల త్యాగాలను ఆయన కొనియాడారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నిర్మిస్తున్న సెల్ఫ్ మానిటైజేషన్ నగరమని, విమర్శకులు ఆ విషయం గుర్తించాలని హితవు పలికారు. సీడ్ క్యాపిటల్, దాని చుట్టూ కోర్ క్యాపిటల్, ఆ తరువాత సీఆర్డీఏ రీజియన్‌లతో సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, దానితో రైతుల భవిష్యత్తు రాబోయే రోజుల్లో అద్భుతంగా మారుతుందని చెప్పారు. రైతులు అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని, వారి భూములను అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. హైటెక్ సిటీ రాక ముందు ఎకరా లక్ష రూపాయలు ఉన్న భూములు ఇప్పుడు ఎకరా 170 కోట్లు ఉందని చెప్పారు. దీనిని బట్టి భవిష్యత్ నగరం ఎలా ఉండబోతోందో ఆలోచించుకోవాలన్నారు. రాజధాని గ్రీన్ ఎనర్జీతో కూడిన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఒక వైపు కృష్ణమ్మ, మరోవైపు పచ్చని చెట్లతో అద్భుత నగరంగా అమరావతి ఉండబోతోందన్నారు. రాజధానిలో అద్భుతమైన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రాజధానిలోని ఏడు రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళతాయన్నారు. డ్రెయిన్లు, వాటర్ లైన్లు, విద్యుత్ లైన్లు అన్నీ ప్రత్యేకించి యుటిలిటీ డక్టుల్లో నిర్మిస్తున్నామని చెప్పారు.

● అమరావతికి స్థల బలం..

దేవతల రాజధాని అమరావతి అయితే.. మన ప్రజా రాజధాని అమరావతి అని సీఎం కొనియాడారు. దేశంలోని దేవాలయాల నుంచి మట్టి, పవిత్ర జాలలు తెచ్చి దేవుడి ఆశీస్సులతో ప్రారంభమైన నగరమని అన్నారు. సాక్షాత్తూ ప్రధాని పార్లమెంటులోని మట్టి, యమునా నదీ జలాలు తెచ్చి అమరావతికి తోడ్పాటునిచ్చారన్నారు. ఇప్పుడు కూడా రాజధానికి ప్రధాని ఎంతో తోడ్పాటునిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆ బాధ్యతతోనే పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి పనిచేస్తున్నామన్నారు. 2047 వరకూ ఇదే ఒరవడి కొనసాగితే అమరావతికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. అప్పటి వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

● త్యాగాల ఫలితాలు రైతులే అనుభవించాలి

రాజధాని కోసం రోడ్డెక్కి పోరాడిన అమరావతి మహిళా రైతుల త్యాగం మరవలేనిదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, వారు పడ్డ అవమానాలు, బాధలు అన్నీ గుర్తేనన్నారు. అందుకే తాను కూడా జోలె పట్టి వారికి అండగా నిలిచామన్నారు. కష్టాలు మరిచిపోవద్దని, రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలన్నారు. ఫేజ్-1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారని గత పాలకులు రైతులను నానా హింసలు పెట్టారని సీఎం గుర్తుచేశారు. రాజధాని ఎడారని, స్మశానమని. వేశ్యల రాజధాని అనే స్థాయికి వారి ఉన్మాదం చేరిందని వాటన్నిటికీ సమాధానం చెప్పేలా రాజధానిని నిర్మిస్తానని చెప్పారు. 'రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా.. రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తా' అంటూ సీఎం హామీనిచ్చారు. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, ధూళిపాళ నరేంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



స్టడీమెటీరియల్ అందజేస్తున్న అజిత్ ట్రస్ట్ చైర్మన్

పంగులూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరు 7న నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పోటీపరీక్షలో పాల్గొనే విద్యార్థులకు అజిత్ చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ వి.వీరనారాయణ స్టడీమెటీరియల్ అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎంఎస్ పార్ట్‌వన్ ఇంగ్లీష్‌మీడియం స్టడీ మెటీరియల్‌ను మండలంలో పోటీపరీక్షకు హాజరయ్యే 125 మంది విద్యార్థులకు సోమవారం అందజేశారు. చందలూరు, పంగులూరు, బూదవాడ, కొండమంజులూరు, కోటపాడు, అలవలపాడు, కొండమూరు, రేణంగివరం ఉన్నత పాఠశాలలకు చెందిన 8వతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో చైర్మన్ వీరనారాయణతో పాటు హెచ్ఎంలు గిరిజ, శ్రీనివాసరావు, పూసల రఘురామయ్య, ఐ.అనిత, వి.వేణుబాబు, గోవిందరాజులు, వాసుబాబు, సందిరెడ్డి శ్రీహరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీరంలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ డా.వినోద్‌కుమార్



గాలింపును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా తీరంలో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డా.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి వాడరేవుకు చేరుకొని గాలింపు చర్యలు పర్యవేక్షించారు. గల్లంతైన షారోన్ కోసం 6 డ్రోన్ కెమెరాలు, 10 మంది వీఆర్‌వోలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలతో చర్యలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో మంగళవారం నాటికి గల్లంతయిన వ్యక్తి ఆచూకీ కనుగొనాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పది బోట్లతో వెతికించారు.

కళాశాల పాత భవనాల తొలగింపు

- ఆరు దశాబ్దాల నాటివి కావడంతో అధికారుల చర్యలు
- వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి



పాత భవనాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో పాత భవనాలలో ఒకటిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శిధిలావస్థకు చేరిన భవనాలను తొలగిస్తున్నారు. పట్టణంలో 1960లో ప్రభుత్వ హైస్కూల్‌లో అదనపు గదులను నిర్మించారు. అనంతరం 1966లో ఎస్ఎస్ఎల్‌సీ ఎగ్జామ్ సెంటర్‌ను ఇదే భవనంలో నిర్వహించారు. ఈ భవనాన్ని 1974 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వినియోగించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త భవనాలు నిర్మించడంతో కొంత కాలం పాటు ఖాళీగా ఉంది. అనంతరం గొట్టిపాటి రవికుమార్ అద్దంకి ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలో అద్దంకికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించడంతో ఖాళీగా ఉన్న భవనాలను వినియోగించుకున్నారు. దశాబ్ద కాలం క్రితం శింగరకొండ సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు భవనాలు నిర్మించారు. అప్పటి నుండి పాత భవనాలు ఖాళీగా ఉన్నాయి. అదే సమయంలో పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. అదే ప్రాంతంలో అద్దంకి పట్టణ సమగ్ర మంచినీటి పథకంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నారు. దీంతో పలువురు ఇటీవల మంత్రి రవికుమార్‌ను కలిసి పాత భవనాలను తొలగించాలని కోరారు. దీంతో రెండు రోజులుగా పాతభవనాల తొలగింపు చేపడుతున్నారు. దీంతో ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు అదనపు ఖాళీ స్థలం ఏర్పడనుంది. అయితే అద్దంకి పట్టణం నడిబొడ్డున ఉండటంతో వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పలుచోట్ల భారీ వర్షం



కడవకుదురులో చెరువును తలపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి

చినగంజాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో కడవకుదురు గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారిపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపించింది. రహదారిపై వర్షపునీరు నిలవడంతో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షంకురిస్తే వారం రోజుల వరకు రహదారిపై రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని పాదచారులు పేర్కొంటున్నారు. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లపై వర్షపునీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక మండల పరిధిలో పలు ప్రాంతాల్లో పోసిన వరినారుమడులు వర్షానికి ఎక్కడ దెబ్బతింటాయో అని రైతులు భయాందోళన చెందుతున్నారు.



కారంచేడులో వరినాట్లు వేస్తున్న కూలీలు

వర్షానికి తడిచిన మినప ఓదెలు

పంగులూరు : రెండురోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షంతో మినుము రైతులలో ఆందోళన నెలకొంది. మండలంలోని పలు గ్రామాలలో 2,500 ఎకరాలలో మినుము సాగవుతోంది. కొండ మూరు, రేణంగివరం, అలవలపాడు గ్రామాలలో 300 ఎకరాలకు పైగా మినుము కోతదశకు చేరుకుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. కొండమూరు గ్రామంలో కొందరు రైతులు ఇప్పటికే పంటకోతకోసి నూర్పిడి కోసం పొలాలలో ఓదెలు వేసి ఉంచారు. ఆది, సోమవారాలలో కురిసిన వర్షానికి తడిసిన మినుము ఓదెలను ఏవో సుబ్బారెడ్డి సోమవారం పరిశీలించారు. మరో మూడురోజులపాటు వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు మినుము రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. వర్షం పడితే కోతకోసి ఓదెలపై ఉన్న మినుముతో పాటు కోతకువచ్చిన పంట చేతికి దక్కదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం తెల్లవారు జామువరకు మండలంలో 3.5 సెంటీమీటర్ల వర్షం పడినట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.

ఆశనిరాశల మధ్య వరినాట్లు

కారంచేడు (పర్చూరు) : ఆశనిరాశల మధ్య రైతులు వరినాట్లు వేస్తున్నారు. గత ఏడాది పండిన వరికి గిట్టుబాటు ధరలేక అమ్ముకున్న వారు నష్టాలు చవిచూశారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయం లేక ఏ పంట సాగుచేయాలో అర్థంకాక భవిష్యత్‌లోనైనా నాణ్యమైన ధర లభిస్తుందన్న ఆశతో వరి సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది వరి సాగు రైతులకు నిరాశ మిగిల్చినా, ఆశ చావక సాగువైపు కదిలారు. ప్రస్తుతం నీరు అందుబాటులో ఉండడంతో కారంచేడు మండలంలోని కుంకలమర్రు, కారంచేడు, స్వర్ణ తదితర ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి.

ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన మెగా డీఎస్సీ విజేతలు



విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

చీరాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-25లో ఎంపికైన అభ్యర్థులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిలో చీరాల మండలానికి సంబంధించి ఎస్‌జీటీ (స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్)లు 8 మంది, స్కూల్ అసిస్టెంట్ 1 ఉన్నారు. అలాగే వేటపాలెం మండలంలో ఒకరు స్థానం దక్కించుకున్నారు. దీంతో మండల అధికారులు వారికి నియామక పత్రాలు అందజేశారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

పంగులూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణ ముగించుకుని సోమవారం వారికి కేటాయించిన స్థానాలలో విధుల్లో చేరారు. మండలానికి ఇద్దరు సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు, ఒక వ్యాయామోపాధ్యాయుని కేటాయించారు. పిన్నక హరికృష్ణ ఎస్.ఎస్. అసిస్టెంట్‌గా చందలూరు ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరగా మధుసూదనరెడ్డి పంగులూరు ఉన్నత పాఠశాలలో విదులలో చేరాడు. గాదె అశోక్‌రెడ్డి ఫిజికల్ డైరక్టర్‌గా బూదవాడ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు.

బాధిత కుటుంబ సభ్యులకు అండగా ప్రభుత్వం

- యువనాయకులు గౌరీ అమర్నాథ్



ఆర్‌డీవోతో మాట్లాడుతున్న అమర్నాథ్

వాడరేవు (చీరాల), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తీరంలో మృత్యువాత పడిన బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని యువ నాయకులు గౌరీ అమర్నాథ్ చెప్పారు. సోమవారం షారోన్ కోసం తీరంలో జరుగుతున్న గాలింపు చర్యలపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణతో మాట్లాడారు. ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

బల్లికురవ, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కబొక్కలపాడులో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ శాఖ ఈఈ మస్తాన్‌రావు ప్రారంభించారు. గ్రామంలోని 30 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ధరఖాస్తులు చేసుకోగా వారికి అవసరమైన ఏడు త్రిఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సోమవారం రైతులకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ఈఈ ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో రైతులకు సత్వరమే కనెక్షన్లు మంజూరువుతున్నాయన్నారు. రైతులు ఎవరైన విద్యుత్ కనెక్షన్ కావాలంటే వెంటనే దరఖాస్తులు చేసుకుంటే మంజరు చేయిస్తామన్నారు మార్టూరు ఏడీఈఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతురావు, దర్శి రామస్వామి, బుల్లిరామయ్య, మురళి, ముత్తినేని సుబ్బారావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు బహూకరణ



అంగన్‌వాడీ కేంద్రానికి సమకూర్చిన బల్లలు కుర్చీలు

సంతమాగులూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన నేలపాటి అంజమ్మ తన భర్త నేలపాటి లక్ష్మీ నారాయణ జ్ఞాపకార్థం అంగన్‌వాడీ బీసీ సెంటర్ కార్యాలయానికి కావలసిన ఫర్నిచర్ ఆఫీస్ టేబుల్ 1, కుర్చీలు 10, టేబుల్‌బల్ల 1, 5 అరల డిస్‌ప్లేర్యాకును బహుమానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సంతమగులూరు ప్రాజెక్ట్ సీడీపీవో సుధ, సూపర్‌వైజర్ సుష్మ రాణి, వైస్ ప్రెసిడెంట్ గమిడి వెంకట్రావు, అంగన్‌వాడి టీచర్ శ్రీలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం అభివృద్ధికి కృషి

- డ్రెయినేజీ పనులకు భూమిపూజ

చీరాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో డ్రెయిన్ల అధ్వాన స్థితిపై కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. సోమవారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.22 లక్షలతో 12వ వార్డులో డ్రయినేజీ పనులు భూమిపూజ చేశారు. శాసనసభ్యులు ఎంఎం.కొండయ్య సూచనలతో డ్రెయినేజీ సమస్యపై దృష్టి సారించినట్లు చెప్పారు. చైర్మన్ వెంట డీఈ రఘురామ్, ఏఈ రవికుమార్, మామిడాల సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో నిరసనలు



అద్దంకిలో నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

పర్చూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం అరికట్టాలని, సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టాలంటూ సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో పర్చూరులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి సీఐ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చీరాల : రాష్ట్ర ప్రభుత్వం కల్తీ మద్యం కుటీర పరిశ్రమలతో ప్రజల ప్రాణ నష్టాలు భారీగా చోటు చేసుకుంటున్నాయని పలువురు వైసీపీ నేతలు అన్నారు. ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు సోమవారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు నేతలు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బొనిగల జైసన్ బాబు, బత్తుల అనీల్, మేరీబాబు, వాసు, గవిని శ్రీను, కబీర్, ప్రసన్న, తేళ్ల రాంబాబు, ప్రసాద్‌రెడ్డి, అద్దంకాల రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం విధానాలకు నిరసనగా సోమవారం వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డు లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన నిరసన ర్యాలీ రామ్‌నగర్ మీదుగా నాగులపాడు రోడ్డులో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నకిలీ మద్యంపై విచారించారించాని కోరారు. అద్దంకి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వచ్చిన వైసీపీ నేతలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పందిళ్లపల్లి(చీరాల), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 69వ డివిజనల్ స్థాయి ఆటల పోటీల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లి స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ - 17 విభాగంలో హై జంప్‌లో సందీప్, హేమర్ త్రో - నాగజాయి, వెంకటేశ్వర్లు, పూజిత, లాంగ్‌జంప్‌లో ఆదిలక్ష్మి, వాలీబాల్లో సందీప్, రవితేజ, సిద్ధు, కబడ్డీలో సందీప్, సిద్ధు, షటిల్ బ్యాడ్మింటన్‌లో పూజిత, ఖోఖోలో డేనీ, లక్ష్మణ్, అండర్ -14లో 400, 600మీటర్స్ రన్నింగ్‌లో నిఖిత, హైజంప్‌లో రత్నకుమార్, బ్యాడ్మింటన్‌లో కార్తికేయ, జ్యోత్స్న ప్రతిభ కనబరిచారు. దీంతో సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, సెక్రటరీ మోహన్‌రావు, అంకయ్య విద్యార్థులను, పీఈటీ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు.

చదువుతోపాటు ఆటలపై ఆసక్తిని పెంచుకోవాలి

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):బాలికలు చదువుతో పాటు ఆటలలో కూడా రాణించాలని, వాటిపై ఆసక్తిని పెంచుకోవాలని తహసీల్దార్ కే. రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం గురుకుల బాలికల పాఠశాలలో అంగనవాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో బాలికలకు ఆటలపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం యద్దనపూడి తహసీల్దార్ కార్యాలయంలో పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఎంఈవో చిలుకూరి గోపి, సూపర్ వైజరు సుజాత, యనమదల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటల పోటీలలో పమిడిపాడు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

మేదరమెట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా డివిజనల్ స్థాయి ఆటల పోటీలలో పమిడిపాడు విద్యార్థులు ప్రతిభ చూపారు. డివిజనల్ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీ పోటీలలో పి.చరణ్‌తేజ, ఏ. కార్తీక్‌లు, అండర్-14 విభాగంలో జి.ధనూష్‌లు ప్రతిభ చూపారు. అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో వి. అమరేశ్వరి, అండర్-14 విభాగంలో సీహెచ్ మహాలక్ష్మి, యూ.ప్రణతిలు అర్హత సాధించారు. పందిళ్లపల్లిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో అండర్-14 బాయిస్స్ విభాగంలో 600 మీటర్ల పరుగుపందెంలో కే.యశ్వంత్, 400 మీటర్ల పరుగుపందెంలో వై.గిరిలు ఎంపికైనట్లు హెచ్ఎం. బి. అంజయ్య, పీఈటీ సుల్తాన్‌లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, ఉపాధ్యాయులను, గ్రామస్థులు అభినందించారు.

రేపటి నుంచి స్వాములకు చద్ది

మార్టూరు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పడమర బజారున శ్రీ రుక్మాబాయిసమేత పాండురంగ, శ్రీప్రసన్నాంజనేయస్వామి వార్ల దేవస్థానంలో బుధవారం నుంచి మాలధారణ స్వాములకు మధ్యాహ్నం చద్ది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ సకల ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరేళ్లగా దాతల సహకారంతో అయ్యప్ప స్వాములకు, భవాని స్వాములకు, శివ స్వాములకు వివిధ మాలలు ధరించిన వారికి ఈ చద్ది ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా మండల దీక్షా కాలము అంటే వచ్చే నెల 25 వతేదీ వరకు చద్ది కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆంజనేయులు తెలిపారు.

దాడిచేసి కొట్టిన ఘటనపై కేసు నమోదు

మార్టూరు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):మండలంలోని వలపర్ల గ్రామంలో జానీ భాషా మరో నలుగురు యువకులుతో కలిసి తనపై దాడిచేసి కొట్టారని గోరంట్ల నారాయణ అనే వ్యక్తి సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు వలపర్ల పంచాయతీలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన నారాయణ గతంలో వలపర్ల గ్రామానికి చెందిన మౌలాలి అనే వ్యక్తి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. అయితే ఇటీవల మౌలాలి చనిపోవడంతో, ఆయన కుమారుడు జానీభాషా లక్ష రూపాయలను ఇవ్వాలని నారాయణ పై వత్తిడి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం వలపర్ల గ్రామంలో స్నేహితులతో కలిసి నారాయణపై జానీభాషా దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాషా తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో సోమవారం నాయుడు లక్ష్మీనారాయణ అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అవివాహితుడైన లక్ష్మీన్నారాయణ రెండురోజుల క్రితం గ్రామంలో ఒక మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భయపడిన యువకుడు ఇంట్లోనే పురుగు మందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆయన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని గుంటూరు వైద్యశాలకు చికిత్సకు తరలించారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురు జూదరుల అరెస్ట్
- రూ.23,500 స్వాధీనం

జాండ్రపేట (చీరాల), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై వన్ టౌన్ సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మీ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. సోమవారం స్టేషన్ పరిధిలోని జాండ్రపేటలోలో జరిగిన ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద రూ.23,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చినగంజాం : మండలంలోని కడవకుదరు గ్రామంలోని పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నట్లు ట్రైనీ ఎస్ఐ సీహెచ్.అనూష తెలిపారు. కడవకుదురు గ్రామంలోని మోటుపల్లి రైల్వేగేటు సమీపంలో నిర్మాణంలోని భవనంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1000ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేది ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ధనలక్ష్మి తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై జరిగే సమీక్ష సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గొర్రెపాడు పంచాయతీ కార్యదర్శికి డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి

బల్లికురవ, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెపాడు పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వరప్రసాద్‌రెడ్డికి డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి లభించింది. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన వరప్రసాద్‌రెడ్డికి ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగోన్నతులలో డిప్యూటీ ఎంపీడీవో పోస్టు వచ్చింది.

నన్నెవరు అడుగుతారులే... అన్న ధైర్యమో... లేక నన్ను అడిగే దమ్ము ఎవరికుందిలే.. అన్న ధీమానో... తెలియదు కానీ... ఓ కాంట్రాక్టరు పంచాయతీరాజ్‌శాఖ అధికారులకే పంగనామం పెట్టాడు. టెండరు వేసేందుకు అర్హత లేకపోయినా, దర్జాగా టెండరు వేసి రూ.కోట్ల పనులను దక్కించుకున్నాడు. ఈ టెండర్ల సమయంలో కూడా అన్నీ వివాదాలే. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి ఆ కాంట్రాక్టరు మాయాజాలంపై ముఖ్యమంత్రి కార్యాలయాని (సీఎంవో)కి ఫిర్యాదు చేశారు.

అధికారులకే పంగనామం..!

- బిడ్ కెపాసిటీ లేకపోయినా టెండర్ల దాఖలు
- ఆన్ హ్యాండ్ వర్కులు చూపడంలో మతలబు
- ఇప్పటికే జిల్లాలో రూ.కోట్ల పనుల అప్పగింత
- సీఎంవోకు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

నెల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం మండలానికి చెందిన ఓ కాంట్రాక్టరు చాలాకాలంగా కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. జిల్లాతోపాటు కర్నూలు, అదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ తదితర తెలంగాణ జిల్లాలోనూ పనులు చేస్తున్నారు. సాధారణంగా ప్రతీ కాంట్రాక్టరుకు వారి ఎక్స్‌పీరియన్స్‌ను బట్టి బిడ్ కెపాసిటీని నిర్ణయిస్తారు. ఆ కెపాసిటీకి లోబడే ఎక్కడైనా టెండర్లు వేయాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ కాంట్రాక్టరు బిడ్ కెపాసిటీ రూ.52.60 కోట్లు మాత్రమే. ఇప్పటికే తెలంగాణలో ఒక్క ఆర్ అండ్‌బీ శాఖలోనే రూ.60 కోట్లకుపైగా ఆన్ హ్యాండ్ వర్కులున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక కర్నూలులోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మరో రూ.80 కోట్లు వర్కులు ఉండగా, జిల్లాలో కూడా మరో రూ.20 కోట్ల వరకూ వర్కులున్నట్లు తెలుస్తోంది. అంటే ఇప్పటికే తన బిడ్ కెపాసిటీకు మించి టెండర్లు వేసి వర్కులు తీసుకున్నారు.



● ఆన్‌హ్యాండ్ వర్కులు దాచి..

అదే సమయంలో ఇటీవల ఆత్మకూరులో ఓ రోడ్డు వర్కుకు టెండర్లు పిలవగా, అది కూడా ఆ కాంట్రాక్టరే దక్కించుకున్నారు. ఈ టెండరు సమయంలో కూడా ఇతర ప్రాంతాల్లోని ఆన్‌హ్యాండ్ వర్కులను చూపించలేదని అభియోగాలున్నాయి. ఈ టెండరు సమయంలో ఇతర కాంట్రాక్టర్లు పోటీకు రాకుండా రాజకీయ ఒత్తిళ్లు తేవడం అప్పట్లో వివాదాస్పదంగా మారింది. ఇలా తన బిడ్ కెపాసిటీ రూ.52 కోట్లు అయితే, అందుకు రెండింతలు అధికంగా వర్కులు దక్కించుకున్నారని సీఎంవోకు చేసిన ఫిర్యాదులో ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌హ్యాండ్ వర్కులను దాచిపెట్టి అధికారులకే మస్కా కొడుతూ టెండర్లు వేస్తున్నారని, తద్వారా ఇతర కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారంటూ సీఎంవోకి ఫిర్యాదు అందడంతో అక్కడి అధికారులు స్పందించారు.

పంచాయతీరాజ్‌లో ఓ కాంట్రాక్టరు మాయాజాలం

● విచారణకు ఆదేశాలు

ముఖ్యమంత్రి కార్యాలయాని (సీఎంవో)కి చేసిన ఫిర్యాదుకు సదరు కాంట్రాక్టరు ఇటు ఏపీలోనూ, అటు తెలంగాణలోనూ చేస్తున్న పనుల జాబితాను జతచేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం చూస్తే ఈ కాంట్రాక్టరు పంచాయతీరాజ్ అధికారులను బురిడీ కొట్టించినట్లు స్పష్టమవుతోంది. ఈ కాంట్రాక్టరు టెండర్లపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎంవో నుంచి పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్ తనకున్న రాజకీయ పలుకుబడితో సీఎంవోకు నివేదిక పంపకుండా పంచాయతీరాజ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పంచాయతీరాజ్ ఇంజనీర్లలో కూడా ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఫిర్యాదు వాస్తవమే...

ఈ విషయమై పంచాయతీరాజ్ ఎస్‌ఈ కోటేశ్వరరావును వివరణ కోరగా ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించి ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. అయితే ఫిర్యాదు దారుడు తన ఫిర్యాదును వెనక్కు తీసుకున్నాడని ఆయన చెప్పడం గమనార్హం. ఓ కాంట్రాక్టరు తప్పు చేశాడని ఆధారాలతో అధికారుల దృష్టికి వచ్చాక, ఫిర్యాదుదారుడు వెనక్కు వెళ్లాడని విచారణ చేయకుండా ఉండడం ఏంటని.. పంచాయతీరాజ్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

అయ్యోర్లకు ఆహ్వానం

- విధుల్లో చేరిన కొత్త టీచర్లు
- అభినందనలు తెలిపిన ఎంఈవోలు
- విద్యార్థులకు మిఠాయిల పంపిణీ
- స్వాగతం పలికిన ఉపాధ్యాయ సంఘాలు

ఉదయగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎస్సీలో ఎంపికైన కొత్త టీచర్లు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరారు. మండలానికి 34 మంది ఉపాధ్యాయులు రాగా, వారిలో ఇద్దరు ఎస్జీటీ, 32 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఒక్క ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనే 15 మంది కొత్త ఉపాధ్యాయులు చేరారు. టీచర్ల నియామకంతో మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరినట్లయింది. విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

కలువాయి : డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 20 మంది ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని పలు పాఠశాలలో విధుల్లో చేరారు. ముగ్గురు ఎస్జీటీలు, 17 మంది స్కూల్ అసిస్టెంట్‌లు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధులకు హాజరయ్యారు.

సీతారామపురం : మండలంలో 18 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించారని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల పరిధిలో స్కూల్ అసిస్టెంట్లు 10 మంది , ఎస్జీటీలు ఇద్దరు, పీజీటీలు ఐదుగురు, టీజీటీ ఒకరు చొప్పున నియమితులయ్యారు. సోమవారం 17 మంది నూతన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరందరిని మండల విద్యాశాఖ తరఫున అభినందిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి కోరారు.

కొండాపురం : మండలానికి 21 మంది నూతన ఉపాధ్యాయులు సోమవారం వచ్చారని ఎంఈవోలు 1, 2 కే.రవికుమార్, ఆనందరావు తెలిపారు. 21 మందిలో ఎస్జీటీలు- 6. స్కూల్ అసిస్టెంట్లు-8, ఫిజికల్ డైరెక్టర్లు ఏడుగురు ఉన్నారని వారు తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో ఇద్దరికి జాయినింగ్ ఆర్డర్స్ అందచేసి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలని ఎంఈవోలు కోరారు. మండలంలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్-1938 ఉపాధ్యాయ సంఘం నేతలు సర్వీస్ రిజిష్టర్లను అందచేసి స్వాగతం పలికారు. మండలానికి 21 మంది కొత్తగా వచ్చినా,ఇంకా 27 మంది ఎస్జీటీలు, 4 స్కూల్ అసిస్టెంట్లు కొరత ఉందని వారు తెలిపారు.



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరిన కొత్త టీచర్లతో ఎంఈవో వెంకటేశ్వర్లు



షేక్ నాయబ్ రసూల్‌కు జాయినింగ్ ఆర్డర్ అందజేస్తున్న సీతారామపురం ఎంఈవో మస్తాన్‌వలి

17న విద్యుత్ ప్రత్యేక అదాలత్



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కరం కోసం ఈనెల 17న నెల్లూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు నెల్లూరు టౌన్ విద్యుత్ ఈఈ ఎం శ్రీధర్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు టౌన్, డివిజన్ పరిధి రామ్మూర్తినగర్, ఏకే నగర్, రాజేంద్రనగర్ సబ్‌డివిజన్ల పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు ఈ అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. మినీబైపాస్ రోడ్డులోని మిలీనియం సబ్‌స్టేషన్‌లో సీజీఆర్‌ఎఫ్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

డీటీడబ్ల్యూవోగా సుజాత



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా(డీటీడబ్ల్యూవో)గా కే. సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరు సీతారామరాజు జిల్లా కందవరం అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమె జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా పదోన్నతిపై నియమితులయ్యారు. నెల్లూరులో డీటీడబ్ల్యూవోగా పనిచేస్తున్న పరిమళ అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరుకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

గుడ్లూరులో రియల్టర్ల దందా

- విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలం కబ్జా
- అధికారులు అడ్డగించినా లెక్కచేయక రోడ్డు నిర్మాణం

గుడ్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడ్లూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. కందుకూరు - గుడ్లూరు రహదారిలోని గుడ్లూరు శివార్లలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఇటీవల ఏడు ఎకరాల్లో అనధికారికంగా వెంచర్ వేశారు. ఆ వెంచర్‌కు అనువైన రహదారి కోసం ఏకంగా విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్నే ఆక్రమించారు. అంతేకాక ఆ స్థలంలో రోడ్డు కూడా వేసేశారు. గుడ్లూరులో రెండు దశాబ్దాలక్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కాగా, అప్పట్లో దాని భవిష్యత్తు అవసరాలకు సరిపడా స్థలాన్ని కేటాయించారు. తమస్థలం చుట్టూ విద్యుత్‌శాఖ కంచె ఏర్పాటుచేసుకుంది. అయితే ప్రస్తుతం ఆ సబ్‌స్టేషన్ వెనుకవైపు సరైన దారి సౌకర్యంలేని భూమిని పేదల వద్ద కారుచౌకగా కొనుగోలు చేసి రియల్టర్లు వెంచర్ వేశారు. అనంతరం సబ్‌స్టేషన్ కంచెను తీసివేసి ఆస్థలంలో విశాలమైన రహదారిని ఏర్పాటు చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలు చూపించాలని పంచాయతీ అధికారులు కోరినా, వీఆర్‌వో వెళ్లి ఇక్కడ దారిలేదని హెచ్చరించినా వారు లెక్కచేయలేదు. ఆదివారం సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో కంచెను తొలగించి చదును చేశారు. సోమవారం ట్రాక్టర్లతో మట్టితోలి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన స్థలాలకే రక్షణ లేకపోతే, సామాన్యుల మాటేమిటని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా, ఆ స్థలం విద్యుత్‌శాఖకు కేటాయించిన స్థలమని నిర్ధారణ అయిందని, అందువల్ల దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులదేనని పేర్కొన్నారు.



వెంచర్ కోసం విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమించి, నిర్మిస్తున్న రోడ్డు

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం...

గుడ్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమించి, రియల్టర్లు రోడ్డు నిర్మాణం చేస్తుండటాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈ విషయమై తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. సబ్‌స్టేషన్ స్థలాన్ని కాపాడుకునేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ టీ. మధుబాబు

వరద పెరిగితే గేట్ల ఎత్తివేత!

- నిండుకుండలా జలాశయాలు
- వచ్చే రెండు నెలలు జాగ్రత్త
- ఆ దిశగా అధికారుల చర్యలు

సోమశిలలో దెబ్బతిన్న 11,12 గేట్ల రోప్‌లు



దాదాపు పూర్తి సామర్థ్యం మేరకు నీటితో నిండిన సోమశిల జలాశం

అనంతసాగరం అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. జిల్లాకు ఇప్పటివరకు సరైన వర్షపాతం నమోదు కాకపోయినా, ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ముఖ్యంగా సోమశిల ఎగువన తెలుగుగంగతో జిల్లాకు నీటిల భ్యత పుష్కలంగా చేకూరింది. శ్రీశైలంకు జూరాల, సుంకేసుల నుంచి గత నెలలో భారీగా వరద రావడంతో అక్కడ నుంచి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టుల నీటి అవసరాలు తీరాయి. అంతేకాక కృష్ణాజలాలతో సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తిసామర్థ్యానికి చేరుకున్నాయి. ఇక రానున్న రోజుల్లో సరిపడా సాగు, తాగు నీటి అవసరాలు తీరాయి. కాగా ఈనెల చివరివారంతోపాటు, నవంబరులో కోస్తాంధ్రలో భారీవర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ దిశగా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. సోమశిల పూర్తిసామర్థ్యం 78 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 74, కండలేరు పూర్తిసామర్థ్యం 65 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 60 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఒక్కసారిగా భారీవరద వస్తే దిగువ ప్రాంతాల్లో ముప్పు వాటిల్లకుండా నీటిమట్టం తగ్గించుకొని, జలాశయాలకు వచ్చే వరదను అంచనా వేస్తూ అధికారులు కిందకు నీటిని విడుదల చేస్తున్నారు. అంతేకాక ప్రాజెక్టుల పటిష్టతపై కూడా దృష్టి సారిస్తున్నారు. సోమశిల పరిధిలో 11,12 గేట్ల రోప్‌లు తీవ్రంగా దెబ్బతినగా, వాటిని ఎత్తే పరిస్థితి లేదు. ఇక మిగిలిన వాటిని వినియోగించుకుంటూ వరదలు తగ్గేవరకు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం...

ఎగువ నుంచి వచ్చే వరదను అంచనా వేస్తూ నీటిని దిగువకు వదులుతున్నాం. ఈ సీజన్ వెళ్లే వరకు ప్రజలు పెన్నానదిలోకి వెళ్లవద్దని, అలాగే పశువులను తోలవద్దని ఆదేశాలు ఇచ్చాం. ఆదిశగా ప్రజలను అప్రమత్తం చేశాం. వరద తీవ్రత చెప్పలేం. అయినా జాగ్రత్తగా ఉండాలి.

- శ్రీనివాసకుమార్, ఈఈ సోమశిల

సోమశిలకు 14,273 క్యూసెక్కుల ప్రవాహం

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 14,273 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 74.066 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

కండలేరులో 59.780 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 59.780 టీఎంసీల నీరు ఉందని డ్యామ్ ఏఈ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అవుట్‌ఫ్లో 2200 క్యూసెక్కులని తెలిపారు.

ఇంటర్ కళాశాలల్లో ప్రాక్టికిల్స్

- ప్రైవేటు కాలేజీల్లో అటకెక్కిన పరికరాలు
- రికార్డుల్లోనే ప్రయోగశాలలు
- ల్యాబ్‌లు ఉన్నా మొక్కుబడిగానే నిర్వహణ

నెల్లూరు(విద్య), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలే కీలకం. ఇందులో మార్కులు తగ్గితే ఎంసెట్, నీట్, ఐఐటీ-జేఈఈలో వెయిటేజీ తగ్గుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు రికార్డులకే పరిమితమయ్యాయి. పరీక్షల గడువు ముంచుకొస్తుండగా అభ్యాసంపై అలక్ష్యం నెలకొంటోంది. జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో వసతులు లేక కొన్ని చోట్లా, వసతులు ఉన్నా కూడా అవసరమైన పరికరాలు, రసాయనాలు లేక మరి కొన్ని చోట్లా.. పేరుకే ప్రాక్టికల్స్‌గా మారాయి.

● నామమాత్రంగా ప్రయోగాలు

ఇంటర్ విద్యలో ప్రయోగాలు నామమాత్రంగా మారా యి. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ప్రయోగాలు చేయిస్తుండగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు మాత్రం అటకెక్కించేశాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు మొత్తం 187 ఉన్నాయి. వీటిలో 116 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలుండగా, ప్రభుత్వ కళాశాలలు 24, ఎయిడెడ్ 2, మోడల్ 11, సోషల్ వెల్ఫేర్ 6, కేజీబీవీలు 12, హైస్కూల్ ప్లస్ 16 కళాశాలలు కలిపి మొత్తం 71 కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్నాయి. వీటిల్లో 53 వేల మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. అధికశాతం కళాశాలల్లో ప్రయోగశాలలు కరువయ్యాయి. కొన్ని పాడుబడిన భవనాల్లో దర్శనమిస్తుండగా, మరికొన్ని కళాశాలల్లో అసలు గదులు కేటాయింపే జరగలేదు. దీంతో బల్లలపైనే విద్యార్థులు మొక్కుబడిగా ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. భవనాలు ఉంటే అవసరమైన బల్లలు, ర్యాకులు, బీరువాలు లేవు.కొన్ని కళాశాలల్లో గదులు కేటాయించినా పరికరాలు, రసాయనాలకు కొరత తీవ్రంగా ఉంది.



నగరంలోని ఓ కళాశాలలో ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో (ఫైల్)

● మొక్కుబడిగా నిర్వహణ

అసలు ఇప్పటి వరకు ఏ కళాశాలలో కూడా ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించిన దాఖలాలే లేవు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు తప్పనిసరిగా మొదటి సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు విడివిడిగా ఒక్కో సబ్జెక్టుకు వారానికి రెండు పీరియడ్లు నిర్వహించాలి. అంటే నాలుగు సబ్జెక్ట్‌లకు కలిపి ఎనిమిది పీరియడ్లు నిర్వహించాలి. బైపీసీ విద్యార్థులకు నెలకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్ట్‌లకు కలిపి మొత్తం 32 పీరియడ్లు, ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లకు 15 పీరియడ్లు నిర్వహించాలి. అయితే ఇవి ఎక్కడా కూడా అమలు కావడం లేదు.

● ఈఏడాది ఎలానో..

ప్రాక్టికల్స్‌లో మార్పులు తీసుకువచ్చేందుకు ఇంటర్‌బోర్డు జంబ్లింగ్ విధానం అమల్లోకి తీసుకు వస్తుందా లేదా అన్న దానిపై ఇంకా ఆదేశాలు రాలేదు. అయితే ప్రభుత్వం జంబ్లింగ్ విధానంలో నిర్వహించినా, నాన్ జంబ్లింగ్‌లో నిర్వహించినా కూడా తమకేమీ పట్టదన్నట్లు ప్రైవేట్ కళాశాలలు వ్యవహరిస్తున్నాయి. ప్రాక్టికల్స్ సమయంలో అధికారులతో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఒప్పందాలు చేసుకుంటూ ఇప్పటి వరకు గట్టెక్కామని, ఇకపై కూడా అదే తంతు తిరిగి కొనసాగిస్తామంటూ బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. అరకొర జ్ఞానంతో విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్లినా, కళాశాల యాజమాన్యం నిర్ణయించిన ధర చెల్లిస్తే ఆ విద్యార్థి ప్రాక్టికల్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తారు.సంబంధిత ఇంటర్‌బోర్డు అధికారులు వీరికి పూర్తి సాయం అందించి, వారి ఒప్పందాల ప్రకారం నడుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

పక్కాగా నిర్వహించాలి..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల్లో ప్రయోగ తరగతులు పక్కాగా నిర్వహించాలి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఆదేశాలిచ్చాం.నేనే జిల్లా అంతా పర్యటిస్తూ ల్యాబ్‌లు, వసతులు ఎలా ఉన్నాయన్న అంశాలను పరిశీలిస్తున్నా. ఇంటర్‌బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి కళాశాల నడుచుకోవాల్సిందే. ఎక్కడైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలి.

- వరప్రసాదరావు, ఆర్ఐవో

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 525

చిన్నారులను ప్రీ స్కూల్స్‌కు పంపించాలి

కందుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లు దాటిన చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీస్కూల్స్‌కు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు ప్రభావతి కోరారు. మండలంలోని ఓగూరు 4వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం రాష్ట్రీయ పోషణ మహాకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటలతో విద్యాబోధనతో పాటు సమయానికి పోషకాహారం కూడా అందిస్తూ చిన్నారుల సంరక్షణ బాధ్యత చూస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కల్యాణి, రమణమ్మ, మాలతి, మాధవి పాల్గొన్నారు.



స్వదేశీ వస్తువుల వినియోగ సదస్సు



మాట్లాడుతున్న సీవీసీ సత్యం

బిట్రగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువుల వినియోగం, పరిజ్ఞాన సదస్సు సోమవారం సాయంత్రం జరిగింది. జిల్లా నేతలు సీవీసీ సత్యం, బీ మాల్యాద్రి, ఎన్ఎస్ యాదవ్ హాజరై ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వినియోగం వల్ల లాభాలు, విదేశీ వస్తువుల వాడకంతో వచ్చే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జీ కృష్ణయాదవ్, గోవిందరాజులు, పీ సూర్యం, ఏకే షైకేల్ రాజ్, ఆర్ కిషోర్, సుధాకర్, కే పోలయ్య, శీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ప్లాస్టిక్ మట్టి మాకొద్దు



ఆర్డీవోకు అర్జీ ఇస్తున్న టిడ్కో గృహ నివాసితులు

కావలి (టౌన్) అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ ప్లాస్టిక్ పేరుతో టిడ్కో గృహ సముదాయంలో తోలుతున్న మట్టి అవసరం లేదని సోమవారం టిడ్కో నివాసితులు ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. మట్టినుంచి దుర్వాసన వెదజల్లుతోందని, గాజు ముక్కలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ మట్టి తోలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామన్నారు. స్థానికులతో పాటు సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య, మధుసూదన్‌రావు, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సొంత నిధులతో రోడ్డు రిపేరు



సొంత నిధులతో గ్రావెల్ వేయిస్తున్న మునగాల వెంకటేశ్వరరెడ్డి

జలదంకి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చామదల టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మునగాల వెంకటేశ్వరరెడ్డి సొంత నిధులతో గ్రామంలోని ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించాడు. కోనేరు మీదుగా వేళ్ళే ఈ రోడ్డు గత కొన్నేళ్ళుగా అధ్వానంగా ఉంది. దీంతో వెంకటేశ్వరరెడ్డి రూ.50 వేల సొంత నిధులతో గ్రావెల్ వేయించి మరమ్మతులు చేయించడంతో ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విపత్తుల సమయాల్లో యువత చేయూతనందించాలి

అల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయాల్లో యువత సామాజిక స్పృహతో సహాయ సహకారాలు అందించాలని ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్ బాబు అన్నారు. సోమవారం అల్లూరులోని రామకృష్ణ జూనియర్, డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ విపత్తు నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్తుల నివారణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలలో ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఆకుల మహేంద్రరెడ్డి, చింతల దయాకర్, లోకేష్, ఆవుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మొగళ్లపల్లి సత్రాలను వినియోగంలోకి తేవాలి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రాలను ఆధునీకరించి వినియోగంలోకి తేవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలనాధికారి శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. నెల్లూరు నడిబొడ్డులో రూ.100 కోట్ల విలువ చేసే సత్రం ఆస్తులు శిథిలావస్థకు చేరాయని, మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య శ్రేష్టి పేద ప్రజల సేవా కార్యక్రమాల కోసం ఇచ్చిన విలువైన ఆస్తులు నిరుపయోగంగా ఉండడం బాధ కలిగిస్తోందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్తులు ప్రజలకు ఉపయోగపడాలని, కొత్త నిర్మాణాలతో దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని కోరారు.

15 మంది రౌడీషీటర్ల బైండోవర్



తహసీల్దార్ శ్రీనివాసులు ముందు రౌడీషీటర్లను హాజరు పరిచిన ఎస్సై అంకమ్మ

ఉలవపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా చట్టపరంగా వ్యవహరించే విధంగా మండలంలోని 15 మంది రౌడీషీటర్లను సోమవారం మండల ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ టీ శ్రీనివాసులు ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. 6 నెలలపాటు సత్ప్రవర్తనతో నడుచుకునేందుకు ఒక్కో రౌడీషీటర్ నుంచి రూ.లక్ష బాండ్‌తో బైండోవర్ చేయించినట్లు పేర్కొన్నారు. విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడితే చట్టపరమైన కేసులు పెట్టి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తమ పరిధిలోని రౌడీషీటర్లు అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై మండల ప్రజలకు సూచించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



శాఖవరంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

వలేటివారిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖవరంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై సోమవారం అధికారులు, నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శంకర్‌రావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామస్థులతో సమన్వయం చేసుకొని ఇంటింటికి వెళ్లి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ



మున్సిపల్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అనూష

కందుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె అనూష సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో వివిధ సమస్యలపై 5 అర్జీలు వచ్చాయని తెలిపారు. అందరు సెక్షన్ హెడ్స్ ఈ కార్యక్రమంలో పాల్గొనగా సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు. పారిశుధ్యం, ఇతర సమస్యలపై 9177700267 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేసినా తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



భ్రూణహత్యలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి, వైద్య సిబ్బంది

వలేటివారిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించాయని ప్రత్యేకాధికారిణి సుజాత తెలిపారు. మండలంలోని జమీన్‌ఉప్పలపాడు కేజీబీవీలో భ్రూణహత్యలు, లింగనిర్ధారణ పరీక్షలు, మహిళలపై అత్యాచారాలు, బాలికల అభ్యున్నతి, ఆడపిల్లలను రక్షించుకోవడం తదితర అంశాలపై సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి సుజాత మాట్లాడుతూ భ్రూణహత్యలు నిరోధించడానికి కిశోరి శక్తి యోజన తదితర పథకాలను ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయన్నారు.

మాజీ ఎమ్మెల్యేల కలయికతో హర్షం



కలిసి మాట్లాడుకుంటున్న మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి (టౌన్) అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గత సాధారణ ఎన్నికలప్పటి నుంచి దూరంగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి సోమవారం కలుసుకుని అభిమానంగా మాట్లాడుకోవడంతో వారి అనుచరులు, వైసీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. గత ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం విష్ణువర్ధన్ రెడ్డి పనిచేసినప్పటికీ, ప్రతాప్‌కుమార్ రెడ్డి ఓడిపోవడంతో విష్ణుకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల వైసీపీ అధినేత జగన్‌తో విష్ణువర్ధన్ రెడ్డి దంపతులు భేటీ అయ్యారు. విష్ణును వైసీపీ సెంట్రల్ కమిటీ సభ్యునిగా నియమించారు. అప్పటి నుండి ప్రతాప్‌కుమార్ రెడ్డి మనస్తాపం చెందారని, దీంతో ఇరువురి మధ్య మరింత దూరం పెరిగిందని వైసీపీ శ్రేణుల్లో గుసగుసలు వినిపించాయి. పద్మనాభరెడ్డి నివాసముండే వీధిలో విష్ణు, ప్రతాప్‌కుమార్ రెడ్డిలు కలుసుకుని అభిమానంతో పలకరించుకున్నారు. ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని విష్ణు అడిగి తెలుసుకోవడంతో వైసీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రూ.9,139 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ పనులు

● నెలాఖరులోపు నెల్లూరు రూరల్‌లో పూర్తి ● ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడి



చంద్రన్న విద్యుత్ వెలుగులు బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలకు విద్యుత్ కష్టాలు తీర్చి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం రూ.9139 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను వేగంగా చేస్తోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఒక్క నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనే రూ.50 కోట్లతో ఈ పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, నెలాఖరుకు మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. ఈ బృహత్తర ప్రాజెక్టుకు 'చంద్రన్న విద్యుత్ వెలుగులు' గా నామకరణం చేశామని, త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న విద్యుత్ వెలుగులు పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన బుక్‌లెట్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. చంద్రన్న విద్యుత్ వెలుగులు ప్రాజెక్టు ద్వారా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాలు, మూడు అర్బన్ డివిజన్లలో సుమారు 80 వేల మందికి మేలు చేకూరుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలో కరెంటు కష్టాలు లేకుండా చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గోమతినగర్‌లో ఉన్న గోమతి నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు, సిబ్బందికి విద్యాసంస్థల హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యాసంస్థల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు కూడా అందచేస్తున్నామన్నారు.

గతుకుల రోడ్లు.. డొక్కు బస్సులు !

● ప్రయాణికుల అవస్థలు



కందుకూరు-ఇసుకపాలెం ఆర్టీసీ బస్సులో చివరలో లేని రెండు సీట్లు



లింగసముద్రంలోని పెట్రోల్ బంకు ఎదురుగా గుంతలు పడిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గతుకుల రోడ్లు, డొక్కు బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారిపాలెం నుండి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమై దారుణంగా తయారైంది. ముఖ్యంగా ఈ రోడ్డుపై పలు చోట్ల అడుగుకో గుంత ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనికితోడు వర్షం కురిసినప్పుడు ఆనీరు ఈ గుంతలలో నిలిచి గుంతలు కాస్తా పెద్దగా మారితున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక బస్సుల విషయానికొస్తే కందుకూరు డిపో నుండి లింగసముద్రం మీదుగా కొండాపురం, మొగిలిచెర్ల, ఇసుకపాలెం వెళ్లే కొన్ని బస్సులు డొక్కు బస్సులుగా ఉన్నాయి. ఈ బస్సుల్లో సీట్లు, కిటికీలు సరిగా ఉండవు. ఇలా కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కుర్చీల బహూకరణ



పోలినేనిపాలెంలో గ్రామ సచివాలయానికి కుర్చీలు అందజేస్తున్న మాల్యాద్రి

వలేటివారిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిపాలెంలో గ్రామ సచివాలయానికి అదే గ్రామానికి చెందిన మామిళ్లపల్లి మాల్యాద్రి 11 కుర్చీలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ అమరేశ్వరి, సచివాలయ సిబ్బంది మాల్యాద్రికి అభినందనలు తెలియజేశారు.

శాంప్ - 2 పరీక్షలు ప్రారంభం



పరీక్షల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంఈవో - 2 ఆనందరావు

కొండాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శాంప్-2 పరీక్షలను విద్యాశాఖ ఆదేశాలమేరకు అధికారులు మండలపరిధిలోని అన్ని పాఠశాలల్లోనూ సోమవారం ప్రారంభించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో పరీక్షల ప్రక్రియను మండల విద్యాశాఖాధికారి - 2 ఆనందరావు పరిశీలించారు. పరీక్షాపత్రాలను వెంటనే మూల్యాంకనం చేసి ఆన్‌లైన్లో నమోదు చేయాలని ప్రిన్సిపాల్ జయంతిని ఆదేశించారు.

రాకేశ్‌శర్మను అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసిరి అవమానించిన న్యాయవాది రాకేశ్‌శర్మను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితసంఘర్షణ సమితి నేతలు జరుగుమల్లి విజయరత్నం, నెల్లూరు కొండమ్మ, వాసు, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ టిడ్కో ఇళ్లు అందచేస్తామని, ఆ మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన మాట్లాడారు. నగర పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 17,520 టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందచేయనున్నామన్నారు. అందులో 300 చ.అ విస్తీర్ణం కలిగినవి 16,144 ఉండగా, 365 చ.అ విస్తీర్ణం కలిగినవి 352, 430 చ.అ విస్తీర్ణం కలిగినవి 1,022 ఉన్నాయాన్నారు. వీటిని తగిన లబ్ధిదారులకు అందచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఉచితంగా అందచేసే ఇళ్లలో 13 వేల వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయగా 11 వేల ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నారని తెలిపారు. అర్హతలున్న వారెవరైన ఇల్లు కావాలంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైసీపీ నేత పాలవల్లికి పలువురి నివాళి

కావలి (టౌన్) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ప్రధాన అనుచరుడు పాలవల్లి పద్మనాభరెడ్డి (58) మృతదేహానికి సోమవారం పలువురు నివాళులర్పించారు. ముంగుమూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో పద్మనాభరెడ్డి మృతి చెందారు. జనతాపేట పెద్దపవని రోడ్డు వద్ద గల మృతుని నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు పేర్నేటి కోటేశ్వరరావు, వైసీపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పద్మనాభరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పద్మనాభరెడ్డి నేత్రదానం

కావలి: రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలవెల్లి పద్మనాభరెడ్డి నేత్రాలను భార్య మాధవి, కుమార్తెలు లిఖిత, తనూజ అంగీకారంతో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి దానం చేశారు. పద్మనాభరెడ్డి కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సోమవారం సేకరించారు. పద్మనాభరెడ్డి కుటుంబ సభ్యులకు కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి కృతజ్ఞతలు తెలిపారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన 150వ నేత్రదానమని రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి తెలిపారు.

కాలువల పూడికతీతను విస్మరించిన వైసీపీ



బీఎండీ బిట్-1 పూడికతీత పనులు ప్రారంభిస్తున్న సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మధుమోహన్ రెడ్డి

జలదంకి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్ట్ పరిధిలోని మేజర్, మైనర్ పంట కాలువల పూడికతీత పనులను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పి మధుమోహన్ రెడ్డి విమర్శించారు. సోమశిల ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ బిట్-1 పరిధిలో పూడికతీత పనులను సోమవారం ఆయన అన్నవరం వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఓఅండ్ఎం నిధులతో మేజర్ కాలువల్లో పూడికతీత పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. బ్రాహ్మణక్రాక మేజర్ పరిధిలోని బిట్-1, బిట్-2 సాగునీటిసంఘాల పరిధిలో పనులకు దాదాపు రూ. 12 లక్షలు మంజూరయ్యాయని, నిధుల మంజూరుకు కృషి చేసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు బ్రాహ్మణక్రాక మేజర్ ఆయకట్టు రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షుడు చింతం సుధాకర్‌రెడ్డి, వీ. పాండురంగారెడ్డి, పీ. భాస్కర్‌రెడ్డి, వీ. సుబ్బారెడ్డి, డైరెక్టర్లు, డీఈ శరత్, ఏఈ నాగార్జునరెడ్డి, నాయకులు రఘు, సుబ్బారెడ్డి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై కఠిన చర్యలు



బాణసంచాను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా బేగం

జలదంకి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో మండల పరిధిలోని జమ్మలపాలెంలోని బాణాసంచా గోడౌన్‌ను జలదంకి ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా బేగం సోమవారం సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. గోడౌన్‌కు అనుమతులు ఉన్నాయా? లేదా? అని బాణసంచా గోడౌన్ నిర్వాహకుడు శ్రీధర్‌రెడ్డిని విచారించారు. అనుమతులకు సంబంధించి ధృవపత్రాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అనుమతులు ఉంటేనే బాణాసంచా నిల్వ చేసుకుని విక్రయించాలని పేర్కొన్నారు. చట్టవిరుద్దంగా బాణసంచా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని విక్రయదారులను హెచ్చరించారు.

● కావలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా తయారీ, నిల్వలు, విక్రయాలకు సంబంధించి వ్యాపారులు తప్పకుండా అనుమతులు తీపుకోవాలని రూరల్ సీఐ రాజేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అనుమతులు పొందిన తరువాత మాత్రమే బాణాసంచా విక్రయాలు చేపట్టాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు దుకాణాల ముందు నీళ్లడ్రమ్ము, పొడి ఇసుక అగ్నిమాపక నియంత్రణ పరికరాలు ఉంచుకోవాలన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేసినా, విక్రయించినా, నిల్వలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే 112 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆడబిడ్డలను రక్షించుకుందాం..



అవగాహన కల్పిస్తున్న వెంకటసుబ్బయ్య

కలిగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంటికి మహాలక్ష్మిలాంటి ఆడబిడ్డను రక్షించుకోవడానికి కుటుంబంతో పాటు సమాజం అండగా నిలవాలని ఆరోగ్యవిద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. సేవ్ గర్ల్ ఛైల్డ్ కార్యక్రమంపై సోమవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. భ్రూణ హత్యలు, లింగ వివక్ష, పీసీపీఎన్‌డీటీ చట్టం, సుకన్య సమృద్ధి, భేటీ బచావో-భేటీ పడావో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజన, పీహెచ్ఎన్ మేరీ, హెచ్ఎస్ నరసయ్య, నాగమణి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టానికి ఇరవై ఏళ్లు

జలదంకి, (ఆంధ్రజ్యోతి): దేశంలో సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్ళు పూర్తయిందని లోక్‌సత్తా ఉద్యమనేత ఎం. మాలకొండారెడ్డి సోయవారం ఓ ప్రకటనలో తెలిపారు. స.హ చట్టం సెక్షన్ 4,1బీ ప్రకారం ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో 17 అంశాల సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని, పౌరులు అడిగిన సమాచారాన్ని గడువులోగా తప్పకుండా ఇవ్వాలన్నారు. ఇంకా ప్రజలకు ఈ చట్టంపై పూర్తిగా అవగాహన లేదన్నారు. మారుమూల గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇక్కడ.. దొంగతనాలూ ఫ్రీ!

ఆర్టీసీ బస్సుల్లో దొంగల చేతివాటం



పొదలకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత అధిక సంఖ్యలో మహిళలే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. బస్సు నిలిపితే చాలు తోసుకుంటూ ఎక్కుతున్నారు. సీట్ల కోసం కుస్తీ పడుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ముఠాలుగా ఏర్పడి ప్రయాణికులలో కలిసిపోయి చోరీలకు పాల్పడుతున్నారు. మరికొందరు ప్రయాణికులను మాటల్లో పెట్టి పర్సులు, బంగారు నగలు అపహరిస్తున్నారు. ఇటీవల కృష్ణాజిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు మూడు దఫాలుగా పొదలకూరులోని బంగారు దుకాణాలలో వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు నటించి మూడుసార్లు బంగారు కమ్మలను అపహరించారు. నాలుగోసారి వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 9 జతల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. అలాగే పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో నంగం బస్సులు ఆగే ప్రదేశంలోనూ, నెల్లూరు, రాపూరు బస్సులు ఎక్కే ప్రాంతాల్లో పలు చోరీలు జరిగాయి. ఉచిత ప్రయాణం కావడంతో ఇతర జిల్లాల నుంచి కూడా దొంగలు ఆర్టీసీ బస్సుల్లో వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నారు.

● ప్రయాణంలో జాగ్రత్తలు తప్పనిసరి...

బంగారం, డబ్బు, విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లేప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వస్తువులు ఎవరూ గుర్తించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బస్సులో గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడేప్పుడు వారి కదలికలను గుర్తించాలి. మెల్లగా మాటల్లోకి దింపి విలువైన వస్తువులు కాజేసే ప్రమాదం ఉన్నందున బస్సు ఎక్కి, దిగేటప్పుడు వెంట తెచ్చుకున్న వస్తువులు ఉన్నదీ.. లేనిదీ గమనించుకోవాలి. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే కండక్టర్లు, డ్రైవర్లతోపాటు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విలువైన వస్తువులు పోతే తొలు త డ్రైవరు, కండక్టర్‌కు సమాచారం ఇవ్వాలి. తద్వారా పరిస్థితిని బట్టి బస్సును సమీపంలోని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి తనిఖీ చేయిస్తారు.

ఆయిల్ నిక్షేపాల కోసం అన్వేషణ



నెల్లూరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : భూగర్భంలో ఆయిల్ నిక్షేపాల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందాలు జల్లెడ పడుతున్నాయి. అందులో భాగంగా బోరు వేసే యంత్రాలు నెల్లూరురూరల్లోని పలు గ్రామాల్లో ఆయిల్ నిధి కోసం అన్వేషిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా నెల్లూరుకు పడమరపల్లెలో ఈ తరహా అన్వేషణ జరుగుతోంది. అందులో భాగంగా ఆదివారం సౌత్‌మోపూరులో ట్రాక్టర్లు, బోర్‌వెల్ యంత్రాలు ప్రత్యక్షమయ్యాయి. మొగళ్లపాళెం, గొల్లకందుకూరు, పొదకూరు మండలంలోని మరిన్ని పల్లెల్లో ఈ తరహా అన్వేషణ నిర్వహిస్తున్నట్లు వాహనదారుల్లో ఓ వ్యక్తి వెల్లడించారు. జీపీఎస్ ద్వారా తమకు అందే సందేశాన్ని బట్టీ ఆయా ప్రాంతాలకు వాహనాలను తీసుకెళ్లి బోరు వేసి నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నట్లు ఆ వ్యక్తి పేర్కొన్నారు.

తల్లి ప్రేమ ఎంత మధురమో.. !

తల్లిప్రేమకు జాతి బేధాలు, హద్దులు లేవంటారు. ఆకలితో ఉన్న ఓ గేదెకు ఆవు పాలిస్తున్న దృశ్యమిది. ఈ సన్నివేశం నెల్లూరు నగరంలోని పెన్నానది ఒడ్డున చోటుచేసుకోగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై దాడులు

విడవలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ముదివర్తిలో కొద్దిరోజులుగా సాగుతున్న ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'పెన్నమ్మను కొల్లగొడుతున్నారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పందించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌తో వీఆర్‌వో వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాలుగు ట్రాక్టర్ల స్వాధీనం

తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు వీఆర్‌వో వెంకటేశ్వర్లు తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఉదయం మూడు ట్రాక్టర్లు, రాత్రి పార్లపల్లిలో ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెన్నా తీరంలో ఇసుక, మట్టి తవ్వకాలు జరిపి తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

మూలస్థానేశ్వరాలయంలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఈ నెల 15, 16, 17తేదీలలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం అంకురార్పణ, పవిత్ర సమర్పణం, 16వతేదీ ఉదయం విశేష హోమాలు, దీపారాధన, 17వతేదీ ఉదయం విశేష పూజలు, పూర్ణాహుతి, కలశ ప్రాకారోత్సవం, స్నపన కలిశాభిషేకం, పవిత్ర అలంకార దర్శనలతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

అంతుచిక్కని వ్యాధులు, వైరస్‌లతో పాటు వివిధ రకాల బ్యాక్టీరియాతో కోళ్లు అకాల మృత్యువాత పడుతున్నాయి. కోవూరు మండలం గమళ్లదిబ్బ, పొదలకూరు మండలం చాటగొట్లలో ఇటీవల అధికసంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. ఇందుకు ప్రధాన కారణం జీవసంరక్షణ పద్ధతులు పాటించకపోవడమే. అలాగే టీకాలు క్రమం తప్పకుండా వేయించకపోవడమే. కోళ్లు ఆరోగ్యంగా పెరగాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని సూచిస్తున్నారు పశుసంవర్ధకశాఖ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు డాక్టర్ జానా చైతన్య కిషోర్. ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా కోళ్ల పెంపకందారులకు పలు సూచనలు అందచేశారు.

టీకాలు తప్పనిసరి !

- ముందు జాగ్రత్తలతోనే కోళ్ల మరణాలకు చెక్
- వివిధ జాతులను ఒకేచోట పెంచరాదు
- చనిపోయిన వాటిని గుంతల్లోనే పూడ్చాలి
- పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారుగా 19,31,113పైగా నాటు, బ్రాయిలర్, లేయర్ జాతుల కోళ్లు ఉన్నట్లు అంచనా. కొడవలూరు, మర్రిపాడు, గుడ్లూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కోళ్ల ఫారాలు నిర్వహిస్తున్నారు. అయితే వాటి నిర్వాహకులు జీవసంరక్షణ పద్ధతులను పాటించకపోవడం వల్ల కోళ్లు అంతుపట్టని వ్యాధులతో మరణిస్తున్నాయి. ఇటీవల కోవూరు, పొదలకూరులో ఈపరిస్థితి వచ్చినప్పుడు రెవెన్యూ, ఆరోగ్య, పోలీసు, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా పనిచేసి మరణాలను అరికట్టారు. మృతి చెందిన కోళ్ల నుంచి ఇతర కోళ్లకు, మానవాళికి వైరస్ సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

● జాగ్రత్తలు ఎంతో ముఖ్యం

కోళ్లఫారాల నిర్వాహకులు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఫారాల్లోకి తెలియని వ్యక్తులను రానివ్వకూడదు. ఫారంలోకి వెళ్లేందుకు ఒక ద్వారం, బయటకు వచ్చేందుకు మరో ద్వారం ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా కోళ్లకు గాలి, వెలుతురు బాగా అందేలా చూడాలి. ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. అలాగే ఫారాలు శుభ్రంగా ఉంచుకోవాలి. నిర్వాహకులు ఫారాల్లోకి వెళ్లేప్పుడు కాళ్లు కడుగుకుని వెళ్లడం మంచిది. ఇందుకుగానూ ఒక నీటితొట్టి ఏర్పాటు చేసుకోవాలి. నాటు కోళ్లు పెంచేవారు, వాటిని వేరే కోళ్లతో కలవకుండా చూసుకోవాలి. కోళ్లను పెంచేవారు వలస పక్షులను పట్టుకోవడం, వాటిని కోళ్ల దగ్గరకు తీసుకెళ్లడం ప్రమాదకరం. రకరకాల కోళ్ల జాతులను ఒకేచోట పెంచకుండా చూడాలి. ఖరీదైన కోళ్లను పెంచేవారు మాత్రం లోపెథోజెనిక్ ఏవియన్ ఇన్ఫ్లుయెంజా(ఎల్‌పీఏఐ) టీకాను తప్పనిసరిగా వేయించాలి. అదికూడా డీవార్మింగ్ అనంతరం వేయించాలి. ప్రధానంగా అక్టోబరు నుంచి మార్చిలోగా ఈ టీకా వేయించాలి. ఏదిఏమైనా వ్యాధులు వచ్చిన తరువాత వాటికి చికిత్సలు చేయించడంకంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.





పౌల్ట్రీ ఫాంలోని కోళ్లు (ఇన్‌సర్ట్) డాక్టర్ చైతన్య కిషోర్

● గుంతల్లోనే పూడ్చాలి

కోళ్లకు అకాల మరణాలు సంభవించినప్పుడు వెంటనే పశువైద్యుడికి సమాచారం అందించాలి. మృతిచెందిన వాటిని లోతుగా గుంతలు తవ్వి పూడ్చిపెట్టాలి. అనంతరం ఆ గుంతపై సున్నం చల్లాలి. ఎట్టి పరిస్థితుల్లో వాటిని నీటి పారుదల కాలువలు, పేడదిబ్బల్లో పడేయకూడదు. దీనివల్ల వైరస్ ఇతర కోళ్లకు, మానవాళికి వ్యాపించే ప్రమాదం ఉంది.చనిపోయిన కోళ్లను తప్పనిసరిగా పూడ్చిపెట్టాలి. పశువైద్యుడి సూచనలు పాటించాలని చైతన్యకిషోర్ వివరించారు.

నేటి నుంచి అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అండర్-19 జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నుంచి బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాటూరు వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో ఉన్న శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీలో ఉదయం 10 గంటలకు చెస్ పోటీలు, దర్గామిట్టలోని నెల్లూరుక్లబ్‌లో ఉదయం 10 గంటలకు క్యారమ్స్ పోటీల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 15న సాయంత్రం 4 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బాస్కెట్‌బాల్, 16న ఉదయం 10 గంటలకు కోడూరుపాడు జడ్పీ హైస్కూల్‌లో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ఎంపికలను డీవీఈవో కృష్ణారెడ్డి, ఆర్‌ఐవో వరప్రసాద్‌లు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఏపీ ఆర్చరీ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వేణు

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పావురాల వేణు ఎంపిక య్యారు. విశాఖపట్నంలో జరిగిన ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చెరుకూరు సత్యనారాయణ, అధ్యక్షురాలుగా నందమూరి తేజస్విని, కార్యదర్శిగా వెంకట రమణ ఎంపికయ్యారు. వేణుకు స్థానం దక్కడంపై ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష హర్షం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాకు చెందిన కోచ్ విజయభరద్వాజ్‌ను టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా నియమించారన్నారు. నాలుగేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీ ఆర్చరీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.



వేణును అభినందిస్తున్న నందమూరి తేజస్విని

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై నారాయణ, సిబ్బంది పేకాడుతున్న నలుగురిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.20,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేడు బైక్ ర్యాలీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10గంటలకు నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల నుంచి జీజీహెచ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ ఒక ప్రకటనలో తెలిపారు. బైక్ ర్యాలీ అనంతరం ఉదయం 11 గంటలకు జీజీహెచ్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

చిరుధాన్యాలతో బేకరి ఉత్పత్తుల తయారీపై 17న శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో మహిళలకు చిరుధాన్యాలతో బేకరి ఉత్పత్తుల తయారీపై ఈనెల 17వ తేదీన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే కమ్యూనిటీ సైన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల ప్రాధాన్యం, వాటి పోషక విలువలు, వాటితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పద్ధతులపై అవగాహన, శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9492378886ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 125 మంది తరలివచ్చి ఫిర్యాదులు అందజేశారు. ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండకూడదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి వారి పిటీషన్లను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, సీఐలు భక్తవత్సలరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



వృద్ధుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

అట్టహాసంగా వాయుగుండ్ల ప్రమాణ స్వీకారం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా వర్ష్యుసా లైఫ్ స్పేసెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్స్ సీఎండీ వాయుగుండ్ల వెంకటేష్ సోమవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ఆలయ ఈవో శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. ఆయనతోపాటు ఆలయ కమిటీ చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, కమిటీ సభ్యులు కూడా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. తమ సంస్థ అధినేతకు శ్రీశైలంలో భక్తులకు సేవచేసే అవకాశం కల్పించడంపై వర్ష్యుసా లైఫ్ స్పేసెస్ కంపెనీ సీఎంజీలు అభినవరాజు, సుధాకర్, సత్తార్, విజయకుమార్, కాంచన ప్రసాద్ తదితరులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



శ్రీశైలం ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్ల ఫొటోను వాయుగుండ్ల వెంకటేష్‌కు బహూకరిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరావు

రాళ్లపాడులో బయటపడ్డ మృతదేహం గుర్తింపు

లింగసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో ఈనెల 5వ తేదీన బయటపడ్డ మృతదేహాన్ని మండలంలోని ఆర్ఆర్ పాలెం గ్రామానికి చెందిన కేతినేని కొండలరావు(45)గా పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన కేతినేని మహేష్, హరిబాబు మరికొందరు సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సై ఎం నారాయణను కలిసి ప్రాజెక్టులో లభ్యమైన మృతదేహం తమ బంధువుడిగా ఉందని వారు చెప్పారు. మృతదేహంపై సేకరించిన ఆనవాళ్లను చూపించాలని ఎస్సైను కోరారు. దీంతో మృతుడికి చెందిన ప్యాంటు, మొలతాడు, తాళాన్ని చూపించగా, వాటిలో మొలతాడు, తాళం తమ బాబాయి కుమారుడు కేతినేని కొండలరావుదని, సదరు మృతదేహం ఆయనదేనని చెప్పారు. దీంతో వెంటనే ఎస్సై నారాయణ ఆర్ఆర్ పాలెం గ్రామానికి వెళ్లి మృతుడి వద్ద లభించిన తాళంతో ఆయన ఇంటి తాళాన్ని తీశారు. దీంతో మృతుడు కొండలరావు అని, ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని చెప్పారు. కొండలరావుకు చాలా కాలం నుండి మతిస్థిమితం లేదని, ఒంటరిగా ఉంటున్నాడని చెప్పారు. దీంతో ఎస్సై నారాయణ మహేష్, మిగిలిన బంధువుల నుండి స్టేట్‌మెంటు తీసుకున్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను జాప్యం లేకుండా నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం చూపించలేకపోతే ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో అర్జీదారులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

● మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు తుమ్మారెడ్డి రేవతి, కార్యదర్శి రెహానాబేగంలు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం వలన మధ్యాహ్న భోజనం పెట్టడం కష్టంగా ఉందని పేర్కొన్నారు

● సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసకోవాలని కోరుతూ ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ.చిన్నారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్‌మాదిగ, ఉపాధ్యక్షుడు ఉదయకృష్ణ మాదిగలు వేర్వేరుగా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఆ న్యాయవాది పట్టాను రద్దు చేయాలని, బార్ అసోసియేషన్ నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీ.కిషోర్‌కుమార్, సీవీ రమణ, జీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల మాఫియాపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట యానాదుల ధర్నా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కండలేరులో చేపల మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాదులు .సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ కండలేరు జలాశయంలో మాఫియా ముఠా అక్రమంగా చేపల వేట సాగిస్తూ యానాదుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. జలాశయానికి సంబంధించి 25 కాలనీల్లో 400 మంది సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. వారంతా జలాశయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే కొందరు ముఠాగా ఏర్పడి, ఇతర జిల్లాల నుంచి కొందరిని తీసుకుని వచ్చి అక్రంగా చేపల వేట సాగిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ జేడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, బిట్ల ప్రసాద్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యానాదులు



నెల్లూరులోని కనకమహల్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

జిల్లాలో మోస్తరు వర్షం



నెల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం జిల్లాలోని కొన్ని మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 1.8 మి.మీ వర్షం కురవగా అత్యధికంగా కందుకూరులో 16.4 మి.మీ, ఇందుకూరుపేటలో 11.4 మి.మీ, బోగోలులో 7.2 మి.మీ చొప్పున వర్షం కురిసింది. కోవూరు, టీపీ గూడూరు, అల్లూరు, సైదాపురం, కావలి, విడవలూరు, ముత్తుకూరు, జలదంకి, నెల్లూరు అర్బన్, కొడవలూరు మండలాల్లో కూడా తేలికపాటి చినుకులు పడ్డాయి. అలానే జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. కాగా మంగళవారం కూడా కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

ప్రయోగాత్మకంగా ఛాంపియన్ ఫార్మర్

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు
- గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా పక్కన అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా తీసుకొచ్చేందుకు జిల్లాలో ప్రయోగాత్మకంగా ఛాంపియన్ ఫార్మర్(వ్యవసాయ విజేత) అనే నూతన విధానాన్ని అమలు చేయబోతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, సీజనల్ వ్యాధులు, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 722 గ్రామ పంచాయతీల నుంచి ఔత్సాహిక రైతులకు ఎంపిక చేసి వారిని ఛాంపియన్ ఫార్మర్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగులో పురోగతిని చూపించడం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎరువులు, పురుగు మందుల నిర్వహణ, వ్యవసాయంలో యాంత్రీకరణ, మార్కెటింగ్, ప్రకృతి వ్యవసాయం తదితర నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఇతర రైతులకు ఆదర్శంగా తీసుకునేలా తయారు చేస్తామన్నారు. ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో నెలకు ఒకరోజు సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. భూ సంబంధ విషయాలే కాకుండా ప్రతి సమస్యపై చర్చించాలని చెప్పారు. జిల్లాలో యానాదులు ఎక్కువగా ఉన్నారని, వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.